www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 29-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 263 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: నవమి రా.11:15 తదుపరి దశమి, నక్షత్రం: పూర్వాభాద్ర రా.2:22 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: ఉ.9:06-10:40, దుర్ముహూర్తం: ఉ.6:31-8:00, అమృతఘడియలు: రా.6:31-8:05, రాహుకాలం: ఉ. 9:00-ఉ.10:30, సూర్యోదయం: 6:31, సూర్యాస్తమయం: 5:35 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జనవరి 1న అంతా లొంగిపోతాం



ఆయుధాలు కూడా అప్పగిస్తాం

- ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి 11
- ఎలాంటి అరెస్టులు, ఎన్‌కౌంటర్లు చేయకండి
- మాకు భరోసానిచ్చే రాష్ట్రంలో లొంగుబాటు
- మూడు రాష్ట్రాల స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్ పేరిట మావోయిస్టుల లేఖ
- ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మరో 10 మంది



● ఆర్థిక నగరికి అంకురార్పణ

అమరావతిలో బ్యాంకులు, ఆర్థిక సంస్థల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, పయ్యావుల

అమరావతిలో ఆర్థిక నగరం

బాబు సంకల్పం.. మోదీ సహకారం.. ఒకే రోజు 15 ఆర్థిక సంస్థలకు శంకుస్థాపన

- ఇలా జరగడం దేశంలో ఇదే ప్రథమం
- అమరావతి పునఃప్రారంభం బ్రహ్మయజ్ఞం
- చంద్రబాబు సారథ్యంలో బలమైన రాజధాని
- అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో బ్యాంకింగ్
- రాష్ట్ర ఆలోచనల సాకారానికి చేయూతనివ్వాలి
- నాడు హైదరాబాద్‌లో, నేడు అమరావతిలో
- చంద్రబాబు చేతుల మీదుగానే 'ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్'
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి ఆర్థిక రంగం నుంచీ సహకరించాలనే ఉద్దేశంతోనే ఒకేరోజున 15 ఆర్థిక సంస్థల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్ఘాటించారు. ఇలా జరగడం దేశంలో ఇదే ప్రథమమని తెలిపారు. 'అమరావతిలాంటి భవిష్యత్ రాజధాని ప్రణాళిక రూపొందిస్తున్నప్పుడు.. దానికొక ఫైనాన్షియల్ (బ్యాంకింగ్) డిస్ట్రిక్ట్ ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. అందులో భాగంగానే ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీలు ఇక్కడ కొలువుతీరుతున్నాయి' అని చెప్పారు. ఆయా బ్యాంకులు, సంస్థల సీఎండీలందరికీ సభాముఖంగా ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం అమరావతి రాజధానిలోని ఏపీసీఆర్‌డీఏ కార్యాలయం వద్ద 15 బ్యాంకులు-బీమా సంస్థల ప్రాంతీయ కార్యాలయాలకు శంకుస్థాపన అనంతరం

మిగతా 12వ పేజీలో...

అహో... అమరావతి!

ఆర్థిక నగరిగా అడుగులు

- ఒకేచోట కొలువుతీరనున్న 13 బ్యాంకులు
- ముంబై నుంచి తరలి వచ్చిన బ్యాంకింగ్ దిగ్గజాలు

ఒక్క ఐదేళ్లు సహకరించండి!

- ఆ తర్వాత దేశ ఆర్థిక ప్రగతికి వెన్నెముకగా నిలుస్తాం 12
- ఆర్థిక మంత్రి నిర్మలకు సీఎం వినతి
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్రం ఊపిరిలూదుతోంది
- అమరావతి, పోలవరానికి ఆశించినదానికన్నా మిన్నగా సాయం
- నల్లమలసాగర్‌కూ తోడ్పడండి: బాబు

బ్యాంకులకు శంకుస్థాపనతో ఆర్థిక ప్రగతికి పునాది: పవన్ కల్యాణ్

7 గ్రామాలు.. 16,666 ఎకరాలు



- అమరావతిలో రెండో విడత భూసమీకరణకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్
- వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడిల్లో 7,562 ఎకరాలు
- వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమిలో 9,104 ఎకరాలు.. త్వరలో నోటిఫికేషన్
- భూములిచ్చిన రైతులకు గత నిబంధనలే

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి రెండో విడత భూసమీకరణకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొదటి విడతలో 34వేల ఎకరాలు సేకరించిన సీఆర్‌డీఏ తాజాగా మరో 16,666.56 ఎకరాలు సేకరించేందుకు రంగం సిద్ధం చేసింది. దీంతో అమరావతి కోసం రైతుల నుంచి 50వేల ఎకరాలు సేకరించినట్లవుతుంది. మొదటి విడత భూసమీకరణలో

మిగతా 13వ పేజీలో...

రైతులను ఒప్పించే సమీకరిస్తున్నాం 13

క్యాబినెట్‌కు వివరించిన సీఎం



మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, అనిత, మనోహర్, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, నారాయణ తదితరులు

అవి ప్రభుత్వ వైద్య కళాశాలలే

పీపీపీ నిర్వహణలో ఉన్నా సర్కారు పేరుతోనే ఉంటాయి

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక తీర్మానం

- ఆ కాలేజీలకిచ్చిన భూములను ఇతర అవసరాలకు వాడకూడదు
- 625 పడకల ఆస్పత్రి ఉండాలి
- 150 యూజీ, 24 పీజీ సీట్లతో కళాశాల, వసతి గృహాలు
- ప్రైవేట్ ఆయుష్ ఆస్పత్రులకు ఇకపై రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- పోలవరంలో రూ.542 కోట్లతో మరిన్ని పనులు
- ప్రైవేట్ నిర్వహణకు ఫైబర్‌నెట్
- క్యాబినెట్ భేటీలో నిర్ణయాలు
- 25 వేల కోట్ల పెట్టుబడులు, 79 వేల ఉద్యోగాలు
- ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఓకే

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మించే వైద్య కళాశాలల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. పీపీపీ విధానంలో నిర్మించి, నిర్వహించినా.. ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రి అనే పేరు పెట్టాలని నిర్ణయించింది. ప్రైవేటు ఆయుష్ ఆస్పత్రుల నియంత్రణ కోసం ఇక నుంచి రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ తీర్మానించింది. శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార-పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి

మిగతా 13వ పేజీలో...

విమానంలోకి ఇరుముడిని తీసుకెళ్లొచ్చు

- అయ్యప్ప భక్తులకు పౌర విమానయాన శాఖ శుభవార్త
- క్యాబిన్ బ్యాగేజీ కింద అనుమతించేందుకు ఓకే 2
- జనవరి 20 వరకే వెసులుబాటు

అమెరికాతో రూ.7,995 కోట్ల రక్షణ ఒప్పందం

- భారత నౌకాదళంలోని సీహాక్ హెలికాప్టర్ల నిర్వహణ చూడనున్న అమెరికా 2

కల్తీ నెయ్యిలో సుబ్రమణ్యం కుట్రదారు



- టీటీడీ జనరల్ మేనేజర్ హోదాలో బీజం
- సుబ్బారెడ్డి పీఏ సహకారంతో దందా
- మూడు డెయిరీలతో కలిసి అక్రమాలు
- వాటికి లబ్ధి చేకూర్చి.. టీటీడీకి నష్టం
- ప్రతిఫలంగా కమీషన్లు, కానుకలు
- 'భోలేబాబా' నుంచి వెండి కంచం
- లక్షల్లో నగదు, ఫోన్, వెండి కాయిన్లూ
- కల్తీ జరిగినట్టు మైసూర్ ల్యాబ్ నివేదిక ఇచ్చినా భోలేబాబాకు పెద్దఎత్తున ఆర్డర్లు
- భక్తుల మనోభావాలు దెబ్బతీశారు: సిట్

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరాలో టీటీడీ మాజీ జనరల్ మేనేజర్ ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రమణ్యం(ప్రొక్యూర్మెంట్) కుట్రదారు అని కోర్టుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తెలిపింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమగ్ర దర్యాప్తు చేస్తున్న సిట్ సుబ్రమణ్యం(ఏ-29)ను అరెస్టు చేసి జైలుకు పంపింది. కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడించింది. కల్తీ నెయ్యికి స్వచ్ఛమైన ఆవునెయ్యిగా ముద్ర వేయడం..

మిగతా 14వ పేజీలో...

మంత్రి చెబితే మాకేంటి!

- రిజిస్ట్రేషన్ల శాఖలో బరితెగింపు 'పోస్టింగ్'
- మంత్రి, స్పెషల్ సీఎస్‌ను కాదని నియామకం
- హైకోర్టు ఉత్తర్వులకూ వక్రభాష్యం
- రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌పై తీవ్ర ఆరోపణలు
- విచారణ చేసి సస్పెండ్ చేసిన ప్రభుత్వం
- హైకోర్టుకు వెళ్లి ఊరట పొందిన అధికారి
- మళ్లీ రేణిగుంటలోనే పోస్టింగ్‌కు పావులు
- ఫైలుపై 'నో' అని మంత్రి రాసినా.. ఇన్‌చార్జి డీఐజీ ద్వారా అదేచోట పోస్టింగ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి) రిజిస్ట్రేషన్ల శాఖలో ఏం జరుగుతోంది? ప్రభుత్వ స్థాయిలో ఆ శాఖ మంత్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గొప్పా? లేక... ఒక చిన్న జిల్లా అధికారే సర్వస్వమా? ఇప్పుడు ఆ శాఖలో ఇదే చర్చ జరుగుతోంది. ఒక అధికారిపై ఉన్న తీవ్రమైన ఆరోపణలు, అభియోగాల నేపథ్యంలో ఆయనపై సస్పెన్షన్



ఆనందరెడ్డి

మిగతా 14వ పేజీలో...



ఆర్థికం.. అబ్బురం!

చైనాను మించిన భారత వృద్ధి రేటు

- సెప్టెంబరు త్రైమాసికంలో 8.2%.. 6 త్రైమాసికాల గరిష్ఠం
- అమెరికా సుంకాల నేపథ్యంలోనూ రికార్డు స్థాయి ప్రగతి
- కలిసొచ్చిన తయారీ, సేవా రంగాల జోరు, జీఎస్టీ సంస్కరణలు
- శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అగ్రస్థానం
- మా ప్రభుత్వ విధానాలు, సంస్కరణల ఫలితం: ప్రధాని మోదీ

భారతదేశ ఆర్థిక ప్రగతి అంచనాలను మించి పరుగెడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) జూలై-సెప్టెంబరు త్రైమాసికం (క్యూ2)లో జీడీపీ వృద్ధి రేటు ఆరు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 8.2 శాతానికి చేరింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సుంకాలు విధించినా దేశీయంగా తయారీ, సేవా రంగాల పనితీరుతో ఈ ప్రగతి సాధ్యమైంది. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో వినియోగం పెరగవచ్చన్న అంచనాలు కూడా కలిసొచ్చాయి. దీంతో ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. 2025-26 క్యూ2లో చైనా జీడీపీ వృద్ధి రేటు 4.8 శాతాన్ని మించిన వృద్ధి సాధించిన భారత్ ప్రపంచ ఆర్థిక వృద్ధికి చోదకంగా మారింది. తమ ప్రభుత్వం అమలు చేసిన విధానాలు, సంస్కరణల వల్లే ఈ ప్రగతి సాధ్యమైందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.


భారత జీడీపీ డేటాకు సీ గ్రేడ్: ఐఎంఎఫ్ 2

- గ్రేడింగ్‌లో ఇది రెండో అతి తక్కువ స్థాయి
- గణాంకాల్లో పారదర్శకత లేదని విమర్శ



గోవాలో 77 అడుగుల శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ

ఇది నవ భారతం.. ఎవరికీ తల వంచదు



- రామజన్మభూమి పోరాటంలో ఉడుపి మఠం కీలకపాత్ర: మోదీ
- ఉడుపిలో లక్ష కంఠ గీతా పారాయణకు హాజరు 2

ఇలా వచ్చి.. అలా వెళ్లి..



- పరకామణి కేసులో సీఐడీ విచారణకు హాజరైన వైవీ సుబ్బారెడ్డి
- రెండు గంటల్లో ముగిసిన విచారణ
- తాను చైర్మన్‌గా ఉన్నప్పుడు చోరీ జరిగినా, ఇన్నాళ్లకు బయటపడిందన్న వైవీ
- ఎవరు దాచి పెట్టారో తేల్చాలని వ్యాఖ్య 14

పిన్నెల్లి సోదరులకు సుప్రీం షాక్

- టీడీపీ నాయకుల జంట హత్యల కేసులో మధ్యంతర రక్షణ రద్దు చేసిన న్యాయస్థానం 3
- ముందస్తు బెయిల్ పొందే అర్హత మీకు లేదు
- ఈ కేసులో కస్టోడియల్ దర్యాప్తు అవసరం
- ఆ డాక్యుమెంట్లు నిందితులకు ఎలా అందాయి?
- పోలీసులే సహకరిస్తున్నారా?: సుప్రీం ఫైర్

4న భారత్‌కు పుతిన్

- 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో రెండు రోజుల పాటు చర్చలు
- ఎస్‌యూ-57 ఫైటర్లు, మరిన్ని ఎస్-400ల కొనుగోలుపై ఒప్పందాలు కుదిరే అవకాశం
- స్థానిక కరెన్సీల్లో లావాదేవీలు, పౌర అణుశక్తి రంగంలో సహకారంపై నిర్ణయాలు! 2

నేడు సిద్దూ, డీకే భేటీ!

- హైకమాండ్ సూచనతో డిప్యూటీ సీఎం శివకుమార్‌ను అల్పాహార విందుకు ఆహ్వానించిన సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సీఎం మార్పుపై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ అనూహ్య పరిణామం చోటు చేసుకుంటోంది. అధిష్ఠానం సూచనతో డిప్యూటీ సీఎం శివకుమార్‌ను శనివారం ఉదయం అల్పాహార విందుకు ఆహ్వానించినట్లు సీఎం సిద్దరామయ్య శుక్రవారం వెల్లడించారు. తమ ఇద్దరికీ హైకమాండ్ నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయని, ఇద్దరూ సమావేశమై మాట్లాడుకోవాలని సూచించారని తెలిపారు. అధిష్ఠానం పిలిస్తే ఢిల్లీకి వెళ్తానని, హైకమాండ్ ఏం చెప్పినా పాటిస్తామనే విషయాన్ని తామిద్దరం ఇప్పటికే చెప్పామన్నారు. అయితే, శుక్రవారం ఓ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న డీకే.. సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరడం గమనార్హం. అంతకుముందు డీకే మీడియాతో మాట్లాడుతూ తాను దేనికీ ఆత్రపడనని.. అన్నీ అధిష్ఠానమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. కాగా, సిద్దరామయ్యను పదవి నుంచి తొలగిస్తే కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేది లేదని కురుబ సామాజికవర్గం ప్రకటించింది.

బిహార్ ఓటమికి నేనూ బాధ్యుడినే: రాహుల్

న్యూఢిల్లీ, నవంబరు 28 : బిహార్‌లో కాంగ్రెస్ ఓటమికి స్థానిక నాయకులతో సమానంగా తాను కూడా బాధ్యుడినేనని ఆ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నట్టు సమాచారం. బిహార్ ఎన్నికల కోసం పనిచేసిన నాయకులు, పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులతో కాంగ్రెస్ అధిష్ఠానం శుక్రవారం అంతర్గత సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగానే రాహుల్ పై వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఈసీ చేపట్టిన 'సర్' ప్రక్రియ వల్లే బిహార్‌లో ఓడిపోయామని నేతలు తేల్చినట్టు తెలిసింది.

రైళ్లలో ఆహార పదార్థాల అధిక ధరలకు చెక్

నూఢిల్లీ, నవంబరు 28: వందేభారత్, రాజధాని వంటి ప్రీమియర్ రైళ్లలో ఆహార పదార్థాల రేట్లు పెంచి విక్రయిస్తున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ చర్యలు చేపట్టింది. సిబ్బందికి ఐడీ కార్డులు, యూనిఫాం ఇచ్చి అధిక వసూళ్లకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. మెనూ, అధికారిక రేట్లు తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్, ఫిర్యాదులు చేయడానికి హెల్ప్‌లైన్ నంబర్ యూనిఫాంపై ముద్రిస్తోంది. వందేభారత్, రాజధాని వంటి రైళ్ల సిబ్బందికి నేవీ బ్లూ జాకెట్లు, ఇతర రైళ్లలో సిబ్బందికి లైట్ బ్లూ టీషర్ట్‌లు ఇస్తుంది.

భూమి కోసం మృతుల పేర్లతో ఫోర్జరీ పత్రాలు

- అల్ ఫలా వర్సిటీ చాన్స్‌లర్ సిద్ధిఖీ బాగోతం

న్యూఢిల్లీ, నవంబరు 28: హరియాణాలోని అల్ ఫలా యూనివర్సిటీ చాన్స్‌లర్ జావెద్ సిద్ధిఖీ బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆయన ఎప్పుడో ఏళ్ల క్రితం చనిపోయిన హిందూ మతానికి చెందిన కొంత మంది పేర్లతో ఫోర్జరీ పత్రాలు సృష్టించి.. ఢిల్లీలోని మదన్‌పూర్ ఖాదర్‌లో భూమిని మోసపూరితంగా కొట్టేశాడని ఈడీ శుక్రవారం వెల్లడించింది. ఫోర్జరీ చేసిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ(జీపీఏ) ద్వారా సర్వే నంబర్ 792లోని భూమిని సిద్ధిఖీకి సంబంధం ఉన్న తర్బియా ఎడ్యుకేషన్ ట్రస్టుకు బదిలీ చేయించుకున్నాడని పేర్కొంది. సిద్ధిఖీ సృష్టించిన ఫోర్జరీ పత్రాల్లో పేర్లు కనిపిస్తున్న కొంత మంది భూయజమానులు 1972, 1998 మధ్య చనిపోయారని, అయినా వారి పేర్లతో 2004 జనవరి 7వ తేదీతో జీపీఏ పుట్టించారని, ఆ తర్వాత దాన్ని భూమిని రిజిస్ట్రర్ చేసుకొనేందుకు ఉపయోగించారని ఈడీ వివరించింది.

అర్ధరాత్రి వరకైనా కోర్టులో ఉంటా: సీజేఐ

న్యూఢిల్లీ, నవంబరు 28: పేద కక్షిదారులకు న్యాయం చేయడమే తన ప్రథమ ప్రాధాన్యమని, అవసరమైతే వారికోసం అర్ధరాత్రి వరకు కోర్టులో కూర్చుంటానని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. శుక్రవారం కేంద్రంతో పాటు ఇతరులపై తిలక్‌సింగ్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన అనంతరం జస్టిస్ జోయమాల్యా బాగ్చితో కలిసి సీజేఐ మాట్లాడారు. 'నా కోర్టులో లగ్జరీ వ్యాజ్యాలు లేవు. అలాంటి కేసులను ధనవంతులైన కక్షిదారులు కొనసాగిస్తున్నారు. నేను మీకు ఒక విషయం చెబుతాను. చివరి వరుసలో ఉన్న అతి చిన్న, పేద కక్షిదారుడి కోసం నేను ఇక్కడ ఉన్నాను. అవసరమైతే వారికోసం అర్ధరాత్రి వరకు ఇక్కడే కూర్చుంటాను' అని సీజేఐ సూర్యకాంత్ చెప్పారు.

భారత జీడీపీ డేటాకు 'సీ' గ్రేడ్: ఐఎంఎఫ్

న్యూఢిల్లీ, నవంబరు 28: భారత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ), స్థూల విలువ జోడింపు (జీవీఏ) గణాంకాలకు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సీ గ్రేడును కేటాయించింది. తన నాలుగో వార్షిక నివేదికలో ఈ మేరకు ప్రకటించింది. జీడీపీ గ్రేడింగ్‌లో ఇది రెండో అతి తక్కువ స్థాయి. ఐఎంఎఫ్ మొత్తం ఏ, బీ, సీ, డీ గ్రేడ్లు ఇస్తుంది. జీడీపీ, జీవీఏ మదింపు కోసం సేకరిస్తున్న గణాంకాల్లో పారదర్శకత లేదని ఆక్షేపించింది. గణాంకాల సేకరణ కోసం కేంద్ర గణాంక సంస్థ తీసుకున్న ఆధార సంవత్సరమే పెద్ద పొరపాటని పేర్కొంది. భారత జీడీపీ లెక్కల కోసం ప్రస్తుతం 2011-12ను ఆధార సంవత్సరంగా తీసుకుంటున్నారు. ఈ విధానం చాలా అసంబద్ధంగా ఉందని ఐఎంఎఫ్ విమర్శించింది. జీడీపీ మదింపు కోసం వ్యయ గణాంకాలను కాకుండా, ఆదాయ గణాంకాలను పరిగణనలోకి తీసుకోవటం కూడా సరిగా లేదని పేర్కొంది. ధరల లెక్కింపులో టోకు ధరల సూచీనే ప్రామాణికంగా తీసుకుంటున్నారు తప్పితే, ఉత్పత్తిదారుల ధరల సూచీని పట్టించుకోవటం లేదని విమర్శించింది. టోకు ధరల సూచీ గణాంకాలకు మాత్రం బీ గ్రేడ్ కేటాయించింది. అన్నిరకాల గణాంకాలకు కలిపితే భారత్‌కు బీ గ్రేడ్ ఇస్తున్నట్లు ప్రకటించింది.

పక్కా ప్లాన్‌తో.. 'మత్తు' వదిలించారు!

- నైజీరియా డ్రగ్స్ రాకెట్‌ను చిత్తుచేసిన ఈగిల్ బృందం

హైదరాబాద్/ న్యూఢిల్లీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మల్నాడు రెస్టారెంట్‌లో డ్రగ్స్ తీగ దొరికింది.. భారీ నైజీరియన్ డ్రగ్స్ కార్టెల్ డొంక కదిలింది. వినూత్నంగా వస్త్రాలు, బూట్లు, సౌందర్య ఉత్పత్తుల పార్సిళ్లలో వాటితోపాటు డ్రగ్స్ పెట్టి సరఫరా చేస్తున్న నెట్‌వర్క్ గుట్టు బయటపడింది. మల్నాడు రెస్టారెంట్ కేసులో ఢిల్లీ నుంచి వచ్చిన పార్సిల్‌ను స్వాధీనం చేసుకున్న ఈగిల్ అధికారులు.. అందులోని చెప్పుల్లో డ్రగ్స్‌ను గుర్తించారు. ఆ పార్సిల్‌ను ఢిల్లీ నుంచి పంపిన నైజీరియన్‌ను గుర్తించి, 4 నెలల క్రితం ఆపరేషన్ ప్రారంభించారు. 15 రోజులు పూర్తిగా ఢిల్లీలోనే మకాం వేశారు. గురువారం అక్కడి పోలీసులతో కలసి ఆపరేషన్ చేపట్టి.. భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేశారు. శుక్రవారం ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఈగిల్ బృందం ఎస్పీ సీతారాం, ఢిల్లీ క్రైం బ్రాంచ్ జేసీపీ సురేంద్రకుమార్.. 'ఆపరేషన్ ఈగిల్ ఫోర్స్' వివరాలను తెలిపారు. 18 ప్రాంతాల్లో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో తెలంగాణ నుంచి 180 మంది పోలీసులు పాల్గొన్నారని చెప్పారు. తెలంగాణ పోలీసులు ఏడుగురిని, ఢిల్లీ పోలీసులు ముగ్గురిని కలిపి మొత్తం కలిపి 10 మంది కీలక సూత్రధారులను, మరో 30 మంది నైజీరియన్లను అరెస్టు చేశామని తెలిపారు.

ఇదిగో.. మన గోదావరి డెల్టా..!



ఇది గోదావరి డెల్టాలో మడ అడవులు, ఇతర భూ వినియోగాన్ని చూపించే ఛాయాచిత్రం. దీన్ని తీసింది ఇస్రో-నాసా సంయుక్తంగా ప్రయోగించిన నిసార్ ఉపగ్రహం. ఈ ఫొటోలను ఇస్రో శుక్రవారం అధికారికంగా విడుదల చేసింది. ఈ ఏడాది జూలై 30న ప్రయోగించిన నిసార్ సేవలు ప్రస్తుతం పూర్తిస్థాయిలో అందుతున్నాయి. ఈ నెల 7 నుంచి శాస్త్రవేత్తలు నిసార్‌ను ఆపరేషన్ దశలోకి తీసుకొచ్చారు. అప్పట్నుంచి ఉపగ్రహం భూపరిశీలన కోసం అంతరిక్షంలో తిరుగుతూ గోదావరి డెల్టాలో మడ అడవులు, ఇతర భూ వినియోగాన్ని చూపించే చిత్రాలను తీసి పంపింది. -సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

పేద దేశాల పౌరులకు నో ఎంట్రీ

19 దేశాల పౌరులకు అమెరికా గేట్లు మూత.. వారి ఇమిగ్రేషన్ దరఖాస్తులపై నిరవధిక నిషేధం



1.ఆఫ్గానిస్థాన్, 2. మయన్మార్, 3. బురుండి, 4. చాద్, 5. రిపబ్లిక్ ఆఫ్ కాంగో, 6. క్యూబా, 7. ఈక్వటోరియల్ గినియా, 8. ఎరిత్రియా, 9. హైతీ, 10. ఇరాన్, 11. లావోస్, 12. లిబియా, 13. సియెర్రాలియోన్, 14. సోమాలియా, 15. సూడాన్, 16. టోగో, 17. తుర్క్‌మెనిస్థాన్, 18. వెనుజువెలా, 19. యెమెన్

న్యూయార్క్/వాషింగ్టన్, నవంబరు 28: ప్రపంచంలో ఆర్థికంగా అత్యంత వెనుకబడిన మూడో ప్రపంచ దేశాల పౌరులు అమెరికాలోకి అడుగుపెట్టకుండా శాశ్వతంగా నిషేధం విధిస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆ దేశాల పౌరుల వల్లే అమెరికాలో హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు జరుగుతున్నాయని ఆరోపించారు. గత అధ్యక్షుడు జో బైడెన్ నిద్ర మత్తులో ఒక్క సంతకం చేసి ఇలాంటివారిని వేలమందిని అమెరికాలోకి రానిచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారివల్ల అమెరికాలోని పశ్చిమదేశాల సంస్కృతి నాశనమవుతోందని నిందించారు. అధ్యక్ష భవనం వైట్‌హౌస్ సమీపంలో నేషనల్ గార్డు దళ సిబ్బందిపై ఆఫ్ఘాన్ జాతీయుడు బుధవారం కాల్పులు జరిపిన నేపథ్యంలో ట్రంప్ గురువారం తన సొంత సోషల్‌మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ మేరకు ఓ పోస్టు పెట్టారు. 'సాంకేతికంగా మనం ఎంత అభివృద్ధి చెందినా.. లోపభూయిష్టమైన వలస విధానాల వల్ల వాటి ఫలితాలను అనుభవించలేకపోతున్నాం. అందువల్ల మూడో ప్రపంచ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపేస్తాను. అమెరికాకు ఏమాత్రం ఉపయోగపడని వారిని, అమెరికాను ప్రేమించని వారిని దేశం నుంచి తరిమేస్తా' అని ప్రకటించారు. అమెరికా సమాఖ్య ప్రభుత్వం అందించే ఏ సబ్సిడీలు కానీ, ప్రయోజనాలు కానీ అమెరికా పౌరులు కానివారికి ఇకపై లభించవని ట్రంప్ ప్రకటించారు. 'అమెరికాలోని ప్రస్తుత పరిస్థితిని సరిదిద్దాలంటే తిరోగమన వలసలే మార్గం' అని స్పష్టంచేశారు. 'దొంగలు, హంతకులు, అమెరికాలో ప్రతిదాన్నీ నాశనం చేస్తున్నవారికి తప్ప మిగతా అమెరికా పౌరులందరికీ థ్యాంక్స్ గివింగ్ డే శుభాకాంక్షలు' అని ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. అమెరికాలో ప్రస్తుతం 5.3 కోట్లమంది విదేశీయులు ఉన్నారని, వారిలో చాలామంది ప్రభుత్వ సహాయం పొందుతున్నారని తెలిపారు. గ్రీన్‌కార్డుపై అమెరికాలో ఉంటూ ఏటా 30 వేల డాలర్లు సంపాదించుకుంటున్న ఒక వ్యక్తి.. ఏటా 50 వేల డాలర్ల విలువైన ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్నాడు అని చెప్పారు. సోమాలియా నుంచి వచ్చిన వేలమంది శరణార్థులతో అందమైన మిన్నెసోటా రాష్ట్రం నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా పార్లమెంటు సభ్యురాలు, డెమోక్రాటిక్ నాయకురాలు ఇల్హాన్ ఒమర్‌పై ట్రంప్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. సోమాలియాలో జన్మించిన ఆమె.. అమెరికాకు వలస రావటానికి సోదరుడిని వివాహం చేసుకుందని ఆరోపించారు. కాగా, ట్రంప్ ఆదేశాలతో ఇప్పటికే గ్రీన్‌కార్డు పొందినవారి దరఖాస్తులను కూడా మరోసారి లోతుగా విశ్లేషించనున్నట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో తెలిపారు. ట్రంప్ ఆదేశాల మేరకు 19 దేశాల నుంచి వలసలను నిరవధికంగా నిలిపేస్తున్నట్లు ప్రకటిస్తూ.. ఆ దేశాల జాబితాను విడుదల చేశారు. కాగా, ఆఫ్గాన్ జాతీయుడు లకన్‌వాల్ కాల్పుల్లో బుధవారం తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు నేషనల్ గార్డు సభ్యుల్లో సారా (20) అనే మహిళా గార్డు మరణించినట్లు ట్రంప్ ప్రకటించారు.

ఇంటర్వ్యూలకు పిలిచి అరెస్టులు

అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్న అమెరికా అధికారులు.. గ్రీన్‌కార్డు దరఖాస్తు దారులను ఇంటర్వ్యూలకు పిలిచి మరీ అరెస్టు చేస్తున్నారు. శాన్‌డియాగోలోని యూఎస్‌సీఐఎస్ ఆఫీసులో గ్రీన్‌కార్డు ఇంటర్వ్యూ కోసం వచ్చిన ఓ వ్యక్తి చేతులకు పోలీసులు బేడీలు వేసి ఈడ్చుకువెళ్తున్న వీడియో వైరల్‌గా మారింది. అమెరికా పౌరురాలైన అతడి జీవిత భాగస్వామిని కూడా అరెస్టు చేసినట్లు బాధితుడి న్యాయవాది టెస్సా కబ్రెరా మీడియాకు తెలిపారు. గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూల కోసం ఎదురుచూస్తున్నవారిని ఆఫీసుకు పిలిచి మరీ అరెస్టు చేస్తున్నారని మరో లాయర్ చెప్పారు.

త్వరలో వెనుజువెలాలో సైనిక చర్య

వెనుజువెలాలోని మాదకద్రవ్యాల ముఠాలను అంతం చేసేందుకు అతి త్వరలో ఆ దేశంలో భూమార్గంలో దాడులు నిర్వహిస్తామని ట్రంప్ ప్రకటించారు. వెనుజువెలా నుంచి సముద్రమార్గంలో అమెరికాలోకి వస్తున్న డ్రగ్స్‌ను తమ సైనిక దళాలు విజయవంతంగా అడ్డుకుంటున్నాయని ప్రశంసించారు. భూమార్గంలో కూడా ఆ దేశంలో దాడులు చేసి డ్రగ్స్ ముఠాలను అంతం చేస్తామని తెలిపారు.

ట్రంప్‌నకు చేతకావటంలేదు

ట్రంప్ శారీరక, మానసిక సామర్థ్యంపై న్యూయార్క్ టైమ్స్ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. 79 ఏళ్ల ట్రంప్‌నకు అధ్యక్ష విధులు నిర్వహించటం చేతకావటం లేదని, అధికారిక సమావేశాల్లో అలసటతో మాట్లాడలేకపోతున్నారని పేర్కొంది. ఈ కథనాన్ని ట్రంప్ ఖండించారు. తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. అందుకు ఇటీవల తాను వరుసగా నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ పర్యటనలే నిదర్శనమన్నారు.

అమెరికాతో రూ.7,995 కోట్ల రక్షణ ఒప్పందం

న్యూఢిల్లీ, నవంబరు 28: భారత నౌకాదళంలో ఉన్న అమెరికా తయారీ ఎంహెచ్-60ఆర్ సీహాక్ హెలికాప్టర్ల ఫ్లీట్ నిర్వహణ కోసం ఆ దేశంతో ఒప్పందంపై భారత్ సంతకం చేసింది. భారత్‌పై అమెరికా అడ్డగోలు టారిఫ్‌ల విధింపు తర్వాత ఇదే తొలి రక్షణ రంగ ఒప్పందం కావడం గమనార్హం. రూ.7,995 కోట్ల విలువైన ఈ ఒప్పందంలో భాగంగా.. ఐదేళ్లపాటు ఎంహెచ్-60ఆర్ సీహాక్ హెలికాప్టర్ల నిర్వహణ, నిర్ణీత సమయాల్లో తనిఖీలు, మరమ్మతులు, విడిభాగాలు, ఇతర పరికరాల సరఫరా, శిక్షణ, సాంకేతిక సహకారాన్ని అమెరికా అందించనుంది. ఇందుకోసం భారత్‌లోనే పలు మౌలిక సదుపాయాలు కల్పించనుంది. దీనితో ఈ హెలికాప్టర్లు ఐదేళ్లపాటు నిరంతరం యుద్ధ సన్నద్ధతతో ఉండేందుకు వీలు కలుగుతుంది. అమెరికాతో ఈ ఒప్పందంపై రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ సంతకాలు చేశారు. అమెరికా నుంచి 2011లో భారత్ 24 ఎంహెచ్-60ఆర్ హెలికాప్టర్లను కొనుగోలు చేసింది. లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ ఎంహెచ్-60ఆర్ సీహాక్‌లు.. ప్రపంచంలోని అత్యాధునిక యుద్ధ హెలికాప్టర్లలో కీలకమైనవి. క్లిష్టమైన వాతావరణంలోనూ సమర్థవంతంగా పనిచేయగలవు. కాగా, ఈ ఏడాది చివరినాటికి అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఫిక్కీ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాణిజ్య ఒప్పందంలో చాలా అంశాలపై భారత ప్రయోజనాలను కాపాడే దిశగా గట్టి ప్రయత్నాలు చేశామని, ఒప్పందంపై చర్చలు ఓ కొలిక్కి వస్తున్నాయని తెలిపారు.

లోకం తీరు



రాజ్యాంగ సవరణతో చట్టసభల కాలపరిమితిని మార్చవచ్చు!

- జమిలి బిల్లుపై లా కమిషన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, నవంబరు 28: చట్టసభలకున్న ఐదేళ్ల కాలపరిమితిని రాజ్యాంగ సవరణ ద్వారా మార్చే అవకాశముందని లా కమిషన్ స్పష్టంచేసింది. పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపేందుకు ఉద్దేశించిన బిల్లుపై పార్లమెంటరీ సంయుక్త సంఘం (జేపీసీ) విస్తృత సంప్రదింపులు జరుపుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా దానికి కమిషన్ సవివర మెమోరాండం సమర్పించింది. డిసెంబరు 4న పార్లమెంటరీ కమిటీని నేరుగా కలిసి చర్చించనుంది. 'చట్టసభల కాలపరిమితికి సంబంధించి రాజ్యాంగమే పార్లమెంటుకు వెసులుబాట్లు కల్పించింది. ఐదేళ్లకు ముందే సభను రద్దుచేయొచ్చని, అత్యవసర పరిస్థితి విధించినప్పుడు దాని కాలపరిమితిని పొడిగించవచ్చన్న నిబంధనలను పొందుపరిచింది. ఈ బిల్లు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించడం లేదు' అని లా కమిషన్ తేల్చిచెప్పింది. జమిలి ఎన్నికల కోసం ప్రతిపాదించిన బిల్లు.. రాజ్యాంగంలోని 368(2) అధికరణ ప్రకారం.. రాజ్యాంగ సవరణను సగం రాష్ట్రాలు సమర్థించాలన్న కేటగిరీలోకి రాదని కూడా స్పష్టంచేసింది.

ఇంటి నుంచే ఆధార్ మొబైల్ అప్‌డేట్

న్యూఢిల్లీ, నవంబరు 28: ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్‌లో ఏమైనా మార్పులు చేయాలనుకుంటే ఇక మీదట సెల్‌ఫోన్ నుంచే చేసుకోవచ్చు. ఈ మేరకు ఆధార్ యాప్‌లో కొత్త ఫీచర్‌ను తీసుకురానున్నామని ఉడాయ్ తెలిపింది. ఆధార్‌లో నమోదైన ఫోన్ నెంబరును మార్చుకోవాలనుకుంటే.. ఆధార్ సెంటర్‌కు వెళ్లి సంబంధిత పత్రాలు సమర్పించాల్సి వస్తోంది. యాప్‌లోకే ఈ సదుపాయం వస్తే.. ఇంట్లో నుంచే అప్‌డేట్ చేయవచ్చు. ఓటీపీ, ఫేస్ రికగ్నిషన్ ఆధారంగా ఇది జరుగుతుందని యూఐడీఏఐ వెల్లడించింది.

విమానంలోకి ఇరుముడిని తీసుకెళ్లొచ్చు

- అయ్యప్ప భక్తులకు పౌర విమానాయన శాఖ శుభవార్త
- క్యాబిన్ బ్యాగేజీ కింద అనుమతిచ్చేందుకు ఓకే

న్యూఢిల్లీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విమానంలో శబరిమల వెళ్లాలనుకుంటున్న అయ్యప్ప స్వామి భక్తులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు శుభవార్త చెప్పారు. అయ్యప్ప స్వాములు అత్యంత పవిత్రంగా భావించే ఇరుముడిని (కొబ్బరికాయతో సహా) తమతోపాటే నేరుగా విమానంలో తీసుకెళ్లేందుకు (క్యాబిన్ బ్యాగేజీ కింద) అనుమతిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రత్యేక సడలింపుజనవరి 20 వరకు దేశవ్యాప్తంగా వర్తిస్తుందని తెలిపారు. ఎయిర్ పోర్టు భద్రతా సిబ్బందికి అయ్యప్ప భక్తులు సహకరించాలని, ఇరుముడి స్క్రీనింగ్, తనిఖీల సందర్భంలో అధికారుల సూచనలను అనుసరించాలని సూచించారు. ఇప్పటి వరకూ అమలులో ఉన్న భద్రతా నియమావళి ప్రకారం ఇరుముడిని చెక్-ఇన్ లగేజీగా మాత్రమే విమానాల్లో అనుమతిస్తున్నారు. దీనిపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో భక్తుల విశ్వాసాలను పరిగణనలోకి తీసుకున్న పౌర విమానయాన శాఖ.. ఇరుముడిని చేతబట్టుకునే విమానంలో ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం ఓ వీడియోను విడుదల చేశారు. "శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తుల భావోద్వేగాలను గౌరవిస్తూ.. ఇరుముడిని తమతోపాటు నేరుగా విమానంలో తీసుకెళ్లేందుకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నా. అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూనే భక్తుల సంప్రదాయలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నాం" అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

4న భారత్‌కు పుతిన్

న్యూఢిల్లీ, నవంబరు 28: సుదీర్ఘకాలం నుంచి మిత్ర దేశాలుగా ఉన్న భారత్, రష్యా సంబంధాలు నూతన శిఖరాలకు చేరనున్నాయి. వచ్చే నెల 4, 5 తేదీల్లో భారత్‌లో పుతిన్ పర్యటించనున్న నేపథ్యంలో రక్షణ, దౌత్యపరమైన బంధాలతోపాటు పలు ఇతర అంశాల్లో కీలక నిర్ణయాలు వెలువడే అవకాశముంది. భారత్‌లో పుతిన్ పర్యటన వివరాలను విదేశాంగ శాఖ శుక్రవారం ప్రకటించింది. "ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు పుతిన్ డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటిస్తారు. 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొంటారు" అని వెల్లడించింది. పుతిన్‌కు గౌరవార్థం రాష్ట్రపతి విందు ఇవ్వనున్నట్టు తెలిపింది. భారత్‌పై అమెరికా అడ్డగోలు టారిఫ్‌లు, రష్యాపై ఆంక్షలు, రష్యా చమురు కొనుగోలు చేయవద్దన్న ఒత్తిడుల నేపథ్యంలో.. పుతిన్ భారత పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్‌కు మరిన్ని ఎస్-400 క్షిపణి రక్షక వ్యవస్థలు, రెండు స్క్వాడ్రన్ల ఎస్‌యూ-57 ఫైటర్ల సరఫరా, ఇరు దేశాల మధ్య స్థానిక కరెన్సీలో లావాదేవీలు, పౌరఅణుశక్తి రంగంలో మరింత సహకారం, రష్యా నుంచి ముడిచమురు కొనుగోలుకు సంబంధించి కీలక ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది.

ఇది నవ భారతం

ఎవరికీ తల వంచదు

- రామజన్మభూమి పోరాటంలో ఉడుపి మఠం కీలకపాత్ర : మోదీ



బెంగళూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడులు జరిగినప్పుడు గత ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రధాని మోదీ ఆరోపించారు. అయితే ప్రస్తుత నవ భారతం తన ప్రజలను రక్షించుకోవడంలో వెనకడుగు వేయదని, ఎవరికీ తల వంచదని స్పష్టం చేశారు. కర్ణాటకలో ఒకరోజు పర్యటనలో భాగంగా ఆయన ఉడుపికి వచ్చారు. పర్యాయ పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్రతీర్థ స్వామీజీ మోదీకి ఘన స్వాగతం పలికారు. కనకన కిండి(కనకదాసు కిటికీ) ద్వారా శ్రీకృష్ణుడి మూలవిరాట్‌ను ప్రధాని దర్శించుకున్నారు. కనకదాసుకు పుష్పార్చన చేసి, కనకనకిండికి ఏర్పాటు చేసిన బంగారు కవచాన్ని, సువర్ణ తీర్థ మండపాన్ని ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత శ్రీకృష్ణమఠం నిర్వహించిన లక్ష కంఠ భగవద్గీతా పఠనంలో పాల్గొని గీతా పారాయణం చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. అయోధ్య రామజన్మభూమి పోరాటంలో ఉడుపి మఠం కీలక పాత్ర పోషించిందని, ఈ విషయం దేశానికి తెలుసన్నారు.

ఇక్కడే కొత్త పాలనకు పునాది

పెజావర మఠాధిపతి విశ్వేశతీర్థ స్వామీజీ మార్గదర్శకంలోనే అయోధ్య రామమందిరంలో ధ్వజారోహణ జరిగిందని మోదీ గుర్తుచేశారు. రామమందిరంలో ఉడుపి మధ్వాచార్యులకు కేటాయించిన ప్రత్యేక ద్వారం ఉందని తెలిపారు. శాంతి, సత్యాన్ని పునఃస్థాపించడంతో పాటు దౌర్జన్యాన్ని అంతం చేయాలని భగవద్గీత మనకు నేర్పుతుందని, ఇదే మన జాతీయ భద్రతా విధానం సారాంశమని అన్నారు. ఎర్రకోట నుంచి శ్రీకృష్ణుడి కరుణ సందేశాన్ని వినిపించామని, ఆయన స్ఫూర్తితో 'మిషన్ సుదర్శన చక్ర'ను ప్రకటించామని తెలిపారు. దేశంలోని ప్రముఖ స్థలాలు, పారిశ్రామిక ప్రాంతాలు, జనం చేరే ప్రదేశాల చుట్టూ రక్షణ కవచాన్ని రూపొందించామని చెప్పారు. దీన్ని శత్రువులు ఛేదించలేరన్నారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే దిశగా నీటి సంరక్షణ, మొక్కలు నాటడం, పరిశుభ్రత, స్వదేశీ, దేశ్ దర్శన్, ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యకరమైన జీవనశైలి, యోగా మరియు క్రీడలు, పేదలకు సహాయం చేయడం అనే తొమ్మిది సంకల్పాలు చేయాలని ప్రజలను మోదీ కోరారు.

'భారత భాగ్య విధాత' మోదీ

లక్ష కంఠ గీతా పారాయణలో భాగంగా భగవద్గీత 15వ అధ్యాయంలోని పలు శ్లోకాలను ప్రధాని పఠించారు. ఇదే వేదికపై శ్రీకృష్ణ మఠం మోదీని 'భారత భాగ్య విధాత' బిరుదుతో సత్కరించింది. మజ్జిగ చిలికే వెండి కవ్వాన్ని మఠాధిపతి ప్రధానికి బహూకరించారు. 2008లో గుజరాత్ సీఎం హోదాలో తొలిసారి ఉడుపికి వచ్చిన మోదీ, ప్రస్తుతం ప్రధాని హోదాలో వచ్చి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు.



గోవాలో 77 అడుగుల శ్రీరాముడి విగ్రహావిష్కరణ

శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ మఠం 550వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోవాలో 77అడుగుల ఎత్తయిన శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. దక్షిణ గోవాలోని పర్తగలి మఠంలో ఉన్న ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ.. ప్రజల్లో ఐక్యత ద్వారానే వికసిత్ భారత్ సాధ్యమని అన్నారు. నేడు భారత్ సాంస్కృతిక పునరుజ్జీవన దశలో ఉందన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం, కాశీ విశ్వనాథ్ ధామ్ పునరుద్ధరణ, ఉజ్జయినిలో మహాకాళ్ మహాలోక్ విస్తరణ వంటివన్నీ అందుకు ఉదాహరణలుగా పేర్కొన్నారు. కాగా, ఇది ప్రపంచంలోనే ఎత్తయిన రాముడి విగ్రహమని గోవా మంత్రి దిగంబర్ కామత్ తెలిపారు.

మహాయుతిలో 'స్థానిక' చిచ్చు

షిండే, ఫడణవీస్ మాటల యుద్ధం

- బీజేపీ అహంకారాన్ని రావణ లంకలా దహనం చేస్తామన్న డిప్యూటీ సీఎం షిండే
- తాము లంకలో జీవించడం లేదన్న సీఎం



ముంబై, నవంబరు 28: మహారాష్ట్రలో పాలక మహాయుతి కూటమిలో చిచ్చురేగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలోని ప్రధాన పక్షాలైన బీజేపీ, షిండే శివసేన మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో కొన్ని మున్సిపాలిటీల్లో విడివిడిగా పోటీచేస్తున్నాయి. ముఖ్యంగా దహాను, పాల్‌ఘర్ పురపాలక సంఘాల్లో పరస్పరం ఢీకొంటున్నాయి. శివసేన అధిపతి, ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే దహానులో తాజాగా స్థానిక బీజేపీ నేతలను టార్గెట్ చేశారు. ఈ ఎన్నికల్లో వారి గుత్తాధిపత్యాన్ని, అహంకారాన్ని రావణుడి లంకలా దహించివేస్తామని హెచ్చరించారు. 2వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆ పనిచేయాలని కోరారు. ఆయన వ్యాఖ్యలపై అదే ప్రాంతంలో బీజేపీ తరపున ప్రచారం చేస్తున్న సీఎం దేవేంద్ర ఫడణవీస్ తీవ్రంగా స్పందించారు. 'లంకను కాల్చేయబోతున్నారా? ఇలాంటి మాటలు ఎవరు ఎంత గట్టిగా అన్నా పట్టించుకోవద్దు. ఎందుకంటే మనం లంకలో జీవించడం లేదు. మనం శ్రీరాముడి భక్తులం. రావణుడిని విశ్వసించడం లేదు' అని వ్యాఖ్యానించారు. ఇటీవల కొందరు శివసేన కార్పొరేటర్లు, పదాధికారులను బీజేపీ చేర్చుకుంది. దీనిపై షిండే కుమారుడు, ఎంపీ శ్రీకాంత్ షిండే, ఆ పార్టీకి చెందిన మంత్రులు బహిరంగ విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై వారం కిందట షిండే కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిశారు కూడా. అయితే కార్పొరేటర్లు, పదాధికారులను కాపాడుకోవలసింది ఆయనేనని షా స్పష్టంచేశారు. దీంతో షిండే రగిలిపోతున్నారు. ఇప్పుడు ఫడణవీస్ తీవ్ర స్థాయిలో స్పందించడంతో కాస్త వెనక్కి తగ్గారు. తాను రావణుడు-అహంకారం అన్నది బీజేపీని ఉద్దేశించి కాదని.. ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేనను అన్నానని వివరణ ఇచ్చారు. మరోవైపు.. స్థానిక ఎన్నికల్లో ఓటర్లను బీజేపీ ప్రలోభాలకు గురిచేస్తోందని శివసేన ఎమ్మెల్యే నీలేశ్ రాణే ఆరోపించారు. సింధ్‌దుర్గ్‌లో ఓ కార్యకర్త ఇంట్లో డబ్బులు పట్టుబడ్డాయంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోను ఆయన శుక్రవారం పోస్టుచేశారు. ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యా చేపట్టలేదని, ఎఫ్ఐఆర్ కూడా నమోదుచేయలేదని ధ్వజమెత్తారు. ఈ ఆరోపణలను ఆయన సోదరుడైన బీజేపీ ఎమ్మెల్యే, మంత్రి నితేశ్ రాణా ఖండించారు. అందరికీ వ్యాపారాలున్నాయని.. సొంత వ్యాపారాల కోసం కార్యకర్తలు ఇంట్లో డబ్బులు పెట్టుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం


టీటీడీ అదనపు ఈవోకు విరాళం డీడీ అందజేస్తున్న దాత

తిరుమల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.కోటి విరాళంగా అందింది. తెనాలికి చెందిన ప్రవాసాంధ్రుడు రామకృష్ణ కిలారి తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

రెండు రోజుల్లో 17.40 లక్షల రిజిస్ట్రేషన్లు

» వైకుంఠ ద్వార దర్శనానికి కొనసాగుతున్న నమోదు ప్రక్రియ

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరుగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు తొలి మూడురోజులు టోకెన్ల కోసం శుక్రవారం సాయంత్రం 3 గంటల సమయానికి 17.40 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే ఈ మూడు రోజుల్లో 2.13 లక్షల మందికి మాత్రమే దర్శనానికి అవకాశం ఉంటుంది. ఈ-డిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ డిసెంబరు 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుంది.

వైద్యుల సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తాం: బొప్పరాజు

» గుంటూరులో ఏపీ జీడీఏ కేంద్ర కార్యాలయం ప్రారంభం


ఏపీ జీడీఏ కేంద్ర కార్యాలయం ప్రారంభిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ, సహకారాలు అందించి అండగా నిలుస్తామని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. శుక్రవారం గుంటూరు కన్నావారితోట నల్లా చైన్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీ జీడీఏ) కేంద్ర కార్యాలయాన్ని ఏపీ జేఏసీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మహేంద్రకుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన పదేళ్ల తర్వాత రాజధాని ప్రాంతమైన గుంటూరులో ప్రభుత్వ వైద్యుల సంఘం కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

» రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్

» ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎంపిక

విజయవాడ(బెంజ్‌సర్కిల్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ తెలిపారు. శుక్రవారం విజయవాడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ మందిరంలో ఏపీయూడబ్ల్యూజే అనుబంధ సంఘం, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. తెలుగు నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా ఏచూరి శివ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామచంద్రరావు ఎన్నికయ్యారు. అనంతరం మంత్రి సుభాష్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని కొనియాడారు.

జర్నలిస్టుల అక్రెడిటేషన్‌ కార్డుల గడువు పెంపు

విజయవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కాలపరిమితిని మరో రెండు నెలల పాటు పొడిగిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశాలు జారీచేశారు. డిసెంబరు 1 నుంచి జనవరి 31వ తేదీ వరకు లేదా కొత్త కార్డులు జారీ చేసే వరకు ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగించినట్టు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుతం నవంబరు 30 నాటికి అక్రెడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే ఈ గడువు పొడిగింపు వర్తిస్తుందని తెలిపారు.

పిన్నెల్లి సోదరులకు సుప్రీం షాక్

» టీడీపీ నాయకుల జంట హత్యల కేసులో మధ్యంతర రక్షణ రద్దు చేసిన న్యాయస్థానం

» సరెండర్ కావడానికి రెండు వారాల సమయం



న్యూఢిల్లీ, గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం నాయకుల జంట హత్యల కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఇద్దరికి గతంలో ఇచ్చిన మధ్యంతర బెయిలును సుప్రీంకోర్టు రద్దు చేసింది. సెక్షన్ 161 కింద నమోదు చేసిన డాక్యుమెంట్లు నిందితుల వద్దకు చేరడంపై అసహనం వ్యక్తం చేసింది. మధ్యంతర బెయిల్ పొందే అర్హతే పిన్నెల్లి సోదరులకు లేదంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఏపీలో పోలీసులు నిందితులకు సహకరిస్తున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఏడాది మే 24వ తేదీన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల జంట హత్యలు రాష్ట్రంలో కలకలం సృష్టించాయి. ఈ కేసులో ఏ1గా జవిశెట్టి శ్రీను, ఏ2గా తోట వెంకట్రావు, ఏ3గా తోట గురవయ్య, ఏ4గా నాగరాజు, ఏ5గా తోట వెంకటేశ్వర్లు, ఏ6గా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఏ7గా పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని చేర్చారు. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పిన్నెల్లి సోదరులు హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం నిరాకరించింది. హైకోర్టు తీర్పును సెప్టెంబరు 1న పిన్నెల్లి సోదరులు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అప్పట్లో సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ కల్పించింది. ముందస్తు బెయిలుపై మాత్రం విచారణ కొనసాగుతోంది. తుది నిర్ణయం వెలువరించే వరకు వారిని అరెస్టు చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది.

నిందితులు విచారణకు సహకరించడం లేదు : లూథ్రా

కేసు విచారణ ప్రారంభం కాగానే.. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. "సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ నిందితులు పోలీసు విచారణకు ఏమాత్రం సహకరించడం లేదు. సాక్ష్యాలను బెదిరిస్తున్నారు. సాక్ష్యాలను ట్యాంపర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు." అని తెలిపారు. సెక్షన్ 161 కింద నమోదు చేసిన డాక్యుమెంట్లు నిందితులకు ఎలా అందాయని ఈ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్ ప్రశ్నించారు. "మీరే దీనికి సమాధానం చెప్పాలి" అని లూథ్రాను ఉద్దేశించి అన్నారు. "161 స్టేట్‌మెంట్ల కాపీ నిందితుల వద్ద ఎలా ఉంది? వారు దానిని ఈ కోర్టు ముందు కూడా దాఖలు చేశారు. అసలు ఈ పత్రాలను వారు ఎలా పొందారు?" అని పిటిషనర్లలో ఒకరి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవేను జస్టిస్ విక్రమ్ నాథ్ ప్రశ్నించారు

కేసు డైరీ పొందిన తీరులోనే మీ నైజం తెలుస్తోంది : బెంచ్

న్యాయస్థానం ద్వారానే తమకు పత్రాలు అందాయని దవే వాదించే ప్రయత్నం చేయగా, జస్టిస్ సందీప్ మెహతా అభ్యంతరం తెలిపారు. "లేదు! అలా జరగకూడదు. కోర్టు మీకు కేసు డైరీని ఎప్పటికీ ఇవ్వదు. అసలు..అటువంటి అవకాశమే లేదు" అని వ్యాఖ్యానించారు. సిద్ధార్థ్ లూథ్రా మరోసారి అందుకుని "ఇది లోతుగా ఆలోచించాల్సిన అంశమే. ఇది పెద్ద సమస్య. నేను కూడా షాక్‌కు గురయ్యాను" అని అన్నారు. మరోసారి.. జస్టిస్ మెహతా కలుగజేసుకుని "ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. మీరు ఏ విధంగా దీనిని పొందినా అది సరి కాదు. ఇది సాధారణ కేసు కాదు కదా? ఇది డబుల్ మర్డర్ కేసు. ఇంతటి సీరియస్‌నెస్ ఉన్న కేసుకు సంబంధించిన కేసు డైరీని మీకు పళ్లెంలో పెట్టి మరీ అప్పగించారా?" అని అందరిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు కేసు డైరీని సంపాదించిన విధానం, మీ కుట్ర మనస్తత్వాన్ని, అసలు నైజాన్ని స్పష్టం చేస్తోంది. కేసు డైరీలోని అంతర్గత వాస్తవాలు మీకు ఎలా తెలుసు? ఇది మీ కోవర్ట్ దర్యాప్తు అవసరమైన కేసు" అని జస్టిస్ సందీప్ మెహతా ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్ధార్థ్ దవే మరోసారి వాదనలు కొనసాగిస్తూ.. కేసులో ప్రధాన ఆరోపణలు కేవలం వదంతుల ఆధారంగానే ఉన్నాయని ధర్మాసనానికి వివరించారు. పోలీసులు ప్రస్తావించిన ఫోన్ సంభాషణలు కేవలం 56 సెకన్లు, 7 సెకన్లు మాత్రమే ఉన్నాయని, ఇంత తక్కువ సమయంలో హత్యకు కుట్ర పన్నడం ఎలా సాధ్యమని, ఇది పూర్తిగా నిరాధారమైన ఆరోపణ అని వాదించారు. ఇది రాజకీయ ప్రతీకార చర్య అని వ్యాఖ్యానించారు. అయితే, దవే వాదనలతో ధర్మాసనం ఏ మాత్రం ఏకీభవించలేదు. "నిందితుల పరిధి చూసి మేం ఆశ్చర్యపోతున్నాం. కేసును ఎంతలా ప్రభావితం చేయగలరో కేసు డైరీని పొందడాన్ని చూస్తే అర్థమవుతోంది" అని జస్టిస్ మెహతా పునరుద్ఘాటించారు. మళ్లీ దవే..ఇది రాజకీయ కోణంలో పెట్టిన కేసని వాదించే ప్రయత్నం చేయగా.."ఇక్కడైనా మీరు కేసు లోతుల్లోకి వెళ్లి చూడండి.. మీకే అర్థమవుతుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మరో సీనియర్ న్యాయవాది షోయబ్ ఆలం.. మరో పిటిషనర్ తరఫున వాదనలు వినిపించి విజ్ఞప్తి చేయగా ధర్మాసనం నిరాకరించింది. పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఇద్దరినీ అరెస్టు చేయడానికి పోలీసులు అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. రెండు వారాల సమయమివ్వాలని సిద్ధార్థ్ దవే కోరగా, ఆ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, పిన్నెల్లి సోదరులు లొంగిపోవడానికి రెండువారాల సమయం ఇచ్చింది.

సీఎంలు మాట్లాడుకుంటే మేలు!

» మంత్రాలయం వద్ద బ్యారేజీల నిర్మాణంపై కర్ణాటక మంత్రికి నిమ్మల స్పష్టీకరణ


కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్. బోస్ రాజును సత్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దులో మంత్రాలయానికి సమీపాన బ్రిడ్జ్ కమ్ బ్యారేజీల నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయమే ఫైనల్ అని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సున్నితమైన అంశమైనందున ఈ వ్యవహారంలో ఉభయ రాష్ట్రాల సీఎంలు మాట్లాడుకుంటే మంచిదని సూచించారు. కర్ణాటక చిన్నతరహా నీటివనరుల మంత్రి ఎన్ఎస్ బోస్‌రాజ్ శుక్రవారం వెలగపూడి సచివాలయంలో నిమ్మలతో సమావేశమయ్యారు. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో చిలకలపర్వి-కుంబళూరు మధ్య, చిన్నమంచాల- మంత్రాలయం మధ్య రెండు బ్రిడ్జి కమ్ బ్యారేజీల నిర్మాణానికి ఆమోదం తెలపాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులు, నదీ జలాల వాడకంపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని నిమ్మల ఆయనకు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రుల స్థాయిలో సంప్రదింపులు జరపడం మంచిదన్నారు. అదేవిధంగా తుంగభద్ర డ్యాం గేట్ల మార్పిడి కోసం ఆంధ్రప్రదేశ్ తరఫున రూ.54 కోట్లు కేటాయించామని, వాటిలో ఇప్పటికే 29 కోట్లు విడుదల చేశామని తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా.. 13 మందికి గాయాలు

నూజివీడు నుంచి శ్రీశైలం వెళుతుండగా ప్రమాదం


బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

పెద్దారవీడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా పెద్దారవీడు మద్దలకట్ట సమీపంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఏపీఎస్ఆర్టీసీ బస్సు శుక్రవారం బోల్తా పడింది. ప్రయాణికులు, స్థానికుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా నూజివీడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం నూజివీడు నుంచి శ్రీశైలం బయలుదేరింది. విజయవాడలో కర్ణాటక, బిహార్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రయాణికులతోపాటు శివదీక్షధారులు ఎక్కారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో మద్దలకట్ట సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారికి, గతంలో ఉన్న రహదారికి మధ్య మలుపు వద్ద బస్సు వేగంగా వెళుతూ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 25 మందిలో 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను మూడు 108 అంబులెన్సుల్లో దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారిలో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. ఎస్ఐ సాంబయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్షతగాత్రులను ఆదుకుంటాం: మంత్రి

నూజివీడు టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. క్షతగాత్రులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని తెలిపారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఆర్టీసీ అధికారులు, డోర్నాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఆయన మాట్లాడారు.

గంజాయి విక్రయాలకు అడ్డుగా ఉన్నాడని దారుణ హత్య

» నెల్లూరు శివార్లలో వేట కొడవళ్లతో యువకుడిని నరికి చంపిన దుండగులు

» ఓ మహిళా డాన్ చేయించినట్టు నిర్ధారణ


పెంచలయ్య

నెల్లూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర శివార్లలో శుక్రవారం సాయంత్రం ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. తమ గంజాయి విక్రయాలకు అడ్డుగా ఉన్నాడన్న నెపంతో అతన్ని అత్యంత కిరాతకంగా వేటకొడవళ్లతో నరికి చంపేశారు. నేర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఓ మహిళ ఈ హత్య చేయించినట్టు నెల్లూరు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు తెలిపారు. నెల్లూరు రూరల్ పరిధిలోని కల్లూరిపల్లి వద్దనున్న ఆర్డీటీ (రూరల్ డవలప్‌మెంట్ ట్రస్ట్) కాలనీలో ఉంటున్న సీపీఎం కార్యకర్త కొట్టావిట్టం పెంచలయ్య (35) చిరు వ్యాపారాలు చేస్తుంటాడు. తమ ప్రాంతం గంజాయి సరఫరాకు ముద్రపడటంతో దానిని తొలగించుకోవాలని, ఎవరూ అలాంటి కార్యకలాపాలకు పాల్పడకూడదని స్థానికులు కొందరు గ్రూపుగా ఏర్పడి తీర్మానం చేసుకున్నారు. ఇందులో పెంచలయ్య కీలక పాత్ర పోషిస్తున్నాడు. కాగా, ఆ ప్రాంతంలో గంజాయి విక్రయాలతో పాటు ఇతర నేర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరవ కామాక్షి అనే మహిళతో పెంచలయ్య బృందానికి విభేదాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం పెంచలయ్య తన కుమారుడు నిఖిలిని స్కూలు నుంచి తీసుకుని ఇంటికి బయలుదేరాడు. కల్లూరిపల్లిలోని పాత ఇనుప సామాన్ల దుకాణం వద్దకు రాగానే వెనుక నుంచి మూడు ద్విచక్రవాహనాలపై వచ్చిన 9 మంది పెంచలయ్యను ఢీకొట్టారు. దీంతో కింద పడిపోయిన అతన్ని వేటకొడవళ్లతో అత్యంత కిరాతకంగా నరికి చంపి పరారయ్యారు. కళ్లెదుటే కన్నతండ్రిని చంపడం చూసి నిఖిలి భీతిల్లిపోయాడు. స్థానికులు పెంచలయ్యను ఆటోలో జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న అదనపు ఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా.. పెంచలయ్య హత్యలో మహిళా డాన్ తమ్ముడు పాల్గొన్నట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారని సమాచారం. ఈ ఘటనలో భాగస్వాములైన వారంతా 20 ఏళ్ల వయసున్న యువకులేనని తెలిసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

స్నేహానికి హద్దులు

చైనాతో మరీ చెడిపోలేదని అనుకోగానే ఏదో ఒక చిచ్చుపెట్టడం ఆ దేశానికి అలవాటు. సంబంధాలు మళ్ళీ అతుకుపడుతున్నాయని అనిపించిన వెంటనే మంటలు రేగుతాయి. షాంఘై విమానాశ్రయంలో భారతమహిళకు ఎదురైన వేధింపులు, అవమానాలు అత్యంత హేయమైనవి. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన పేమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ లండన్‌నుంచి జపాన్ వెడుతూ మార్గమధ్యంలో షాంఘైలో ఆగారు తప్ప, భారత్ పాస్‌పోర్టుతో చైనాలో కాలూనేందుకు ఏమీ పోలేదు. గతంలో కూడా ఆమె షాంఘై ట్రాన్సిట్ ప్రయాణాలు చేశారు. ఇప్పటివరకూ ఎవరూ ఈ తరహా ప్రయాణాలు చేయలేదని అధికారులు కూడా అనలేరు. కొందరు అతిగా వ్యవహరించి, ఉద్దేశపూర్వకంగా ఆమె పట్ల అనుచితంగా ప్రవర్తించిన విషయం స్పష్టంగా అర్థమవుతోంది. మరో మూడుగంటల్లో జపాన్ విమానం ఎక్కి వెళ్ళిపోవాల్సిన ఆమెను నిర్బంధించి, అరుణాచల్ భారత్‌లో లేదు, మీ వీసా పనికిరాదు, పాస్‌పోర్టు చెల్లదు అంటూ చైనీస్ పాస్‌పోర్టుకోసం దరఖాస్తుచేసుకోమని కూడా ఎగతాళిగా మాట్లాడటం, మిగతా వారంతా నవ్వడం వంటివి అత్యంత అవమానకరమైన ఘట్టాలు. అనేకగంటలపాటు ఏమీ తేల్చకుండా, అన్నపానీయాలు లేకుండా తనను వేధించారని, చివరకు బీజింగ్‌లోని భారత రాయబారకార్యాలయం సహాయంతో బయటపడ్డానని ఆమె చెప్పుకొచ్చారు. చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇందుకు పూర్తిభిన్నమైన వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ చట్టాలు, పౌరవిమానయాన సంప్రదాయాలను ఉల్లంఘించిన ఘటన కనుక, జరిగింది పొరపాటని ఓ మాట అనివుంటే ఈ వివాదం వెంటనే సమసిపోయివుండేది. కానీ, అరుణాచల్ విషయంలో తమవాదన బలహీనపడుతుందన్న భయంతో తమ అధికారుల చర్యలను ఆమె సమర్థించుకురావడం మరింత చిరాకు కలిగిస్తోంది. బలవంతపు చర్యలు తీసుకోలేదు, నిర్బంధాలు, వేధింపులు లేనే లేవు అంటూనే, చైనా తన అరుణాచల్ వాదనను సమర్థించుకొనే పనిలో పడింది. రెండు దేశాల మధ్యా ప్రశాంతత, పరస్పర విశ్వాసం సమీపకాలంలో నెలకొనడం అసాధ్యమని ఈ ఘటన గుర్తుచేస్తోంది.

అరుణాచల్ తమభూభాగమని చైనా ఎప్పటినుంచో వాదిస్తోంది. దక్షిణటిబెట్, జంగ్నాన్ అంటూ మన రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, గ్రామాలు, చివరకు కొండలకు కూడా తన మాండరిన్‌లో పేర్లు పెట్టుకుంటోంది. రెండుదేశాల మధ్యా ఉన్న మూడున్నరవేల కిలోమీటర్ల సరిహద్దులో అనేక ప్రాంతాలను వివాదంలోకి లాగి, ఉద్రిక్తతలను రేపడం చైనా ఒక విధానంగా పెట్టుకుంది. దాదాపు వందేళ్ళుగా సాగుతున్న వివాదాలను ఉభయదేశాలు పరిష్కరించుకోలేకపోవడం అటుంచి, సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతలను కాపాడుకొనేందుకు ఉద్దేశించిన 1993నాటి ఒప్పందాన్ని కూడా చైనా ఉల్లంఘించడం ఆరంభించింది. అమెరికాతో మన స్నేహం హెచ్చుగా ఉన్నప్పుడూ, ట్రంప్-మోదీ చేయీచేయీ కలిపి కదులుతున్నప్పుడూ చైనా చిచ్చుపెడుతుంది. ఇటీవల ట్రంప్ మోదీ మీద అలిగి, భారత్‌మీద సుంకాల భారం వేసినప్పుడు చైనా ఎక్కడలేని ఆప్యాయతనూ కనబరిచిన విషయం తెలిసిందే. పలురకాల దిగుమతులకు అనుమతించడమే కాక, మార్కెట్‌ను కూడా తెరిచింది. ఏడేళ్ళ తరువాత, ఈ ఏడాది సెప్టెంబర్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సివో) సమావేశానికి మోదీ వెళ్ళడంతో ఉభయదేశాల సంబంధాలు మెరుగుపడుతున్న ఆశ కలిగింది. రెండుదేశాల మధ్యా విమానాల రాకపోకలు నేరుగా మొదలవడంతో, వాణిజ్య వ్యాపారాలతో పాటు పర్యాటకమూ, ప్రజల మధ్య బంధాలూ బలపడతాయన్న భరోసా కూడా వచ్చింది. ఈ నేపథ్యంలో, ఒక చిన్న ఉదంతం ఉభయదేశాల సంబంధాలను ప్రభావితం చేయడం సరికాదు. జరిగినఘటనతో పాటు, దానిమీద ఇచ్చిన వివరణలూ సమర్థనలూ మరింత దూరం పెంచేట్టుగా ఉండటం విచారకరం. పరిష్కరించుకోనంత వరకూ సరిహద్దువివాదాలు అలాగే ఉంటాయి. వాటిని పక్కనబెట్టి మిగతా విషయాల్లో కలిసిసాగుదామని ఓ పక్కన అంటూనే, ఇలా అమాయకపౌరుల మీద కక్ష సాధించడం సరికాదు. తియాంజెన్ సమావేశంలో మోదీ, జిన్‌పింగ్ కలిసికట్టుగా అద్భుతమైన సంకల్పాలు చెప్పుకున్నారు. సరిహద్దు సమస్య మనబంధానికి అడ్డురావద్దనీ, ప్రత్యర్థుల్లా కాక, భాగస్వాములుగా వాణిజ్యం పెంచుకొని బాగుపడదామనీ అనుకున్నారు. డ్రాగన్, ఏనుగు కలిసి డాన్స్ చేయాలన్నారు జిన్‌పింగ్. సమస్యలను సహేతుకంగా పరిష్కరించుకుంటూ, సరిహద్దుల్లేని స్నేహంతో సాగిపోదామని అంటూనే ఉన్నతంగా వ్యవహరించకపోవడం, చిన్నచిన్న ఉదంతాలను సైతం ఉద్రిక్తతలుగా మార్చడం బాగోలేదు.

బయో ఎకానమీ-హిడ్మా

బ్రెజిల్‌లో దట్టమైన అమెజాన్ నదీ ప్రారంభంలో ఉండే బెలెమ్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్–30 పేరిట నవంబర్ 6–21 తేదీల్లో అంతర్జాతీయ వాతావరణ మార్పు సమావేశాన్ని నిర్వహించారు. అరణ్య ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల జీవన ఉపాధిని పెంచడానికీ, అమెజాన్ అరణ్యాన్ని మరింత వైవిధ్యంతో, ఉత్పాదకంగా మార్చడానికీ బ్రెజిల్ దేశం కృషి చేస్తోంది. వేడిని, కాలుష్యాన్ని పెంచే గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల చేసే మైనింగ్, ఇతర పరిశ్రమలపై ఎక్కువగా ఆధారపడకుండా, నూతన నమూనా బయో ఎకానమీ అభివృద్ధిని బ్రెజిల్ చేపడుతున్నది. చెట్ల నరికివేతను, మైనింగ్‌ను తగ్గించింది. అనేక హెర్బల్ మొక్కలను గుర్తించి, వాటి సాగును పెంచింది. ఆరోగ్య, సౌందర్య, సుగంధ ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్నది. ఫలితంగా మూలవాసుల వలసలు తగ్గిపోయాయి. అమెరికా ఖండానికి అమెజాన్ అడవులు ఊపిరితిత్తులు అనే ఎరుకతో బ్రెజిల్ బయో ఎకానమీని ప్రోత్సహిస్తున్నది.

మన దేశంలో 2024లోను, ఇప్పుడు 2025లోను కూడా తీవ్ర వాతావరణ పరిస్థితులు నమోదు అయ్యాయి. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ ఇండియా క్లైమేట్–2025 నివేదిక ప్రకారం దేశంలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్న రోజులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. ఎండ, వడగాలుల వలన అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాది కూలీల, వీధి వ్యాపారుల జీవనం ఇబ్బందులకు గురవుతున్నది. 60శాతం మంది ఆదాయాన్ని కోల్పోతున్నారు. వడదెబ్బ, గుండెపోటు, వాంతులు, వడలిపోవటం



వంటి అనారోగ్యాలకు లోనవుతున్నారు. పొలాల్లో పనిచేసేవారు సాధారణ సింథటిక్ దుస్తులు ధరించడం వలన చెమటతో బాక్టీరియల్, ఫంగల్ చర్మవ్యాధులకు లోనవుతున్నారు. ఫ్యాక్టరీలో పనిచేసేవారికి వెంటిలేషన్ లేక, యంత్రాలు విడుదల చేసే వేడికి రోగాలపాలవుతున్నారు. ఆదాయాలు తగ్గి అధిక వడ్డీలకు అప్పులు తీసుకుంటున్నారు. వారు నివసించే చిన్న చిన్న షెడ్ల లాంటి ఇళ్లలో ఫ్యాన్లు పెట్టుకునే స్తోమత ఉండదు. కూలర్, ఏసీ ఊహకందని లగ్జరీ. అధిక వేడితోపాటు, అధిక వర్షాల వలన కోట్లాది ఎకరాలలో పంట నష్టం, వరదల వలన ఇండ్లు కూలిపోవడం ఎన్నడూ లేనంతగా పెరిగిపోయాయని నివేదిక పేర్కొంది.

లక్ష చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణలను ఆనుకుని ఉన్న దండకారణ్యం భారతదేశానికి అమెజాన్ లాంటిదంటే అతిశయోక్తి కాదు. ఇక్కడి అడవులు దేశ కార్బన్ ఉద్గారాలను స్వీకరించి ప్రకృతిని శుభ్రం చేస్తున్నాయి. కానీ ఇది ఇప్పుడు ప్రమాదంలో పడింది. ఈ ప్రాంతంలో అదానీ, వేదాంత, లాయిడ్, ఆర్య, అభినవ్, జిందాల్ వంటి కార్పొరేట్స్ తవ్వకాలు ప్రారంభించాయి. ఈ ప్రాంతంలో గత రెండువందల సంవత్సరాల నుండి జల్ జంగల్ జమీన్ కోసం పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. తమ అడవిని, తమ జీవితాన్ని, ఉనికిని ప్రశ్నార్థకం చేస్తూ, నిలువ నీడ లేకుండా చేస్తున్న మైనింగ్‌ను స్థానికులు మొదటి నుండీ ప్రతిఘటిస్తున్నారు. గత మూడు దశాబ్దాలుగా మరింత తెగువతో నక్సలైట్ల నాయకత్వంలో సంఘటితమై సాయుధంగా పోరాడుతున్నారు.

ఆదివాసీ యోధుడు మడావి హిడ్మా మరణం తర్వాత దేశం అతని పోరాట లక్ష్యాన్ని అర్థం చేసుకుంటున్నది. ఇప్పుడు బ్రెజిల్ అనుసరిస్తున్న బయో ఎకానమిని గత 30 సంవత్సరాలుగా తమ ప్రాబల్యంలో ఉన్న దండకారణ్యంలో హిడ్మా నేతృత్వంలో మావోయిస్టు పార్టీ అమలుచేస్తున్నది. కానీ ఇప్పుడు జన జీవితాన్ని కాలుష్యం కోరల్లోకి నెట్టివేసే కార్పొరేట్ మైనింగ్ కోసం విప్లవకారులను ప్రభుత్వం అణచివేస్తున్నది. నవంబర్ 22న దక్షిణాఫ్రికా జోహన్నెస్‌బర్గ్‌లో నిర్వహించిన జి–20 సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ, "భవిష్యత్ తరాల కోసం సుస్థిర పర్యావరణ సమతుల్య జీవన మార్గం ఆచరణ కోసం ప్రపంచ సాంప్రదాయ జ్ఞాన నిధిని నెలకొల్పాలి" అని సూచించారు. కానీ ఆచరణలో ఈ జ్ఞానాన్ని పుష్కలంగా కలిగి ఉన్న భారత్‌ను కాపాడుతున్న ఆదివాసీ ఉద్యమాల నేతలపై అణచివేతకు పాల్పడుతున్నారు.

ప్రజలలో అసంతృప్తి మరింత రాజుకోక ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని, రాజ్యాంగం అందించిన జీవించే హక్కును విస్తృతార్థంలో అమలుచేయాలి. కార్పొరేట్లను నియంత్రించి ప్రభుత్వ పాలనలో వారి ప్రమేయం లేకుండా చేయాలి. పౌర సమాజం నిత్య అప్రమత్తతతో, ప్రజాస్వామిక పోరాట రూపాలతో పర్యావరణ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి. కాలుష్య నియంత్రణలో చైనా విధానం, జీవ ఆర్థిక వ్యవస్థలో బ్రెజిల్ విధానం మనకు ఆదర్శం కావాలి.

• అస్నాల శ్రీనివాస్
దొడ్డి కొమురయ్య ఫౌండేషన్

గవర్నర్ల వ్యవస్థపై గందరగోళం..!

'ప్రతి రాష్ట్రానికీ గవర్నర్‌తో కూడిన శాసన వ్యవస్థ ఉండవలెను..' అని రాజ్యాంగ అధికరణ 168 ప్రారంభమవుతుంది. ఆ శాసన వ్యవస్థలో శాసనసభ, శాసన మండలి ఉండవచ్చు లేదా ఒకే శాసనసభ ఉండవచ్చు. అసలు రాష్ట్ర శాసన వ్యవస్థలో గవర్నర్ ఉనికి అనవసరమనేది నా సునిశ్చిత అభిప్రాయం. ప్రజలు ఎన్నుకోని రాజ్యాంగ అధికారి ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కూడిన శాసనసభలో ఎందుకు భాగంగా ఉండాలి? శాసనసభ లేదా ఉభయ సభల నుద్దేశించి ప్రసంగించడం తదితర లాంఛన ప్రాయమైన విధులను రాష్ట్ర శాసనవ్యవస్థలో భాగంగా కాకుండానే నిర్వహించవచ్చు. శాసన వ్యవస్థ సంబంధిత తన విధులను ఇంగ్లాండ్ రాజు ఇలానే నిర్వర్తిస్తారు కదా.



■ పి. చిదంబరం
'పళని' పలుకు

శాసన వ్యవస్థలో గవర్నర్ నిర్వర్తించే నిజమైన పాత్ర బిల్లులకు అనుమతి మంజూరు చేయడమే. ఒక బిల్లు చట్టంగా రూపొందే ప్రక్రియను పూర్తి చేయడంలో గవర్నర్ ఆమోదం పొందడమనేది చాలా ముఖ్యమైన విషయం. శాసన వ్యవస్థ రాజ్యాంగ పరిమితులను అతిక్రమించకుండా ఉండేందుకు బిల్లులకు అనుమతి నివ్వడం లేదా తిరస్కరించే అధికారాలను ఒక వ్యక్తికి అప్పగించడమనేది తప్పనిసరి.

అధికరణ 216 ఇలా పేర్కొన్నది: 'శాసనసభ, శాసన మండలి ఉన్నచో ఉభయ సభలచే ఆమోదింపబడిన బిల్లును గవర్నర్ సమ్మతి కొరకు పంపవలెను. గవర్నర్ సమ్మతించినచో తన సమ్మతిని, సమ్మతించక నిలుపు చేసినచో నిలుపుదలనూ, ఒకవేళ రాష్ట్రపతి సమ్మతికి నివేదించుచున్న యెడల ఆ విషయాన్ని గవర్నర్ ప్రకటించవలెను. సమ్మతిని నిలుపుచేసినచో ఆ బిల్లును శాసనసభకు పునర్విచారణ చేయమని కోరుతూ ఒక సందేశమును పంపవలెను'. ఈ అధికరణ ఇంకా ఇలా పేర్కొంది: 'గవర్నర్ సందేశానుసారం రాష్ట్ర శాసనసభ మరొకసారి చర్చను జరిపి గవర్నర్ సూచించిన మార్పులను అంగీకరిస్తే బిల్లులో వాటిని చేర్చి, గవర్నర్ సందేశాన్ని తిరస్కరించిన యెడల ఆ బిల్లును యథాతథంగా రాష్ట్ర శాసనసభ గవర్నర్‌కు తిరిగి బిల్లును పంపిన దానికి గవర్నర్ విధిగా సమ్మతిని ఇవ్వవలెను'. ఇది శాసన వ్యవస్థపై ఆరోగ్యకరమైన నియంత్రణ. అంతేగాని శాసననిర్మాణ ప్రక్రియలో ఉపద్రవాన్ని సృష్టించడానికి లైసెన్స్ ఎంతమాత్రం కాదు.

అయితే గవర్నర్లు చేస్తున్నదేమిటి? ముఖ్యంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్లు అధికరణ 200 కింద తమకు లభించిన అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. శాసనసభ తన ఆమోదానికి పంపిన బిల్లులను తమ ఇష్టానుసారం నిలిపివేసేందుకు లైసెన్స్‌గా పరిగణిస్తున్నారు. ఈ భావనతోనే వారు పాకెట్ వీటోను ప్రయోగిస్తున్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే జవాబుదారీతనం లేకుండా శాసనప్రక్రియను అడ్డుకుంటున్నారు. బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారు. బిల్లులను ఆమోదించడం లేదు. అలా అని తిరస్కరించడం లేదు. శాసనసభ పునఃపరిశీలనకూ పంపడం లేదు. రాష్ట్రపతి పరిశీలనకు సత్వరమే నివేదించడం లేదు. పాకెట్ వీటో అనేది ఒక నికార్సయిన దురుద్దేశం. శాసనసభ ఆమోదించిన బిల్లు రూపేణా వ్యక్తమైన ప్రజా సంకల్పాన్ని అడ్డుకోవడమే పాకెట్ వీటో లక్ష్యంగా ఉన్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే పాకెట్ వీటోకు భారత రాజ్యాంగంలో అనుమతి లేదు.

ఒక బిల్లును గవర్నర్‌కు నివేదించినప్పుడు ఆయన దానిని ఆమోదించాలి లేదా తిరస్కరించాలి లేదా సాధ్యమైనంత త్వరగా శాసనసభ పునఃపరిశీలనకు పంపాలి లేదా రాష్ట్రపతి పరిశీలనకు నివేదించాలని సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. 'పాకెట్ వీటో' రాజ్యాంగ విరుద్ధమని ఆ ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ నిర్ణయాలను ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆమోదించింది. అయితే కొన్ని అంశాలపై ఈ రెండు ధర్మాసనాలూ విభేదించాయి. అయితే సామాన్య పౌరులు ఆందోళన చెందవలసినవి కావు. వాటిపై చర్చను న్యాయశాస్త్ర పండితులకు వదిలేద్దాం.

శాసనసభ తనకు నివేదించిన బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్లకు నిర్దేశించిన కాలపరిమితి విషయమై సుప్రీంకోర్టు ధర్మాసనాల భిన్న దృక్కోణాలు సామాన్య పౌరులను కలవరపెడుతున్నాయి. ఇద్దరు సభ్యుల ధర్మాసనం కఠినమైన కాలపరిమితిని నిర్దేశించింది. ఆ గడువు తప్పనిసరి అని సూచించింది. విస్తృత ధర్మాసనం అందుకు అభ్యంతరం చెప్పింది. ఆ నిర్ణయాన్ని త్రోసిపుచ్చింది. 'రాజ్యాంగ అధికారులు తమ విధులను నిర్వర్తించడంలో సర్దుకుపోయే స్వభావాన్ని ప్రదర్శించాలని' సూచించింది. ఎటువంటి కాలపరిమితిని నిర్దేశించలేదు. ఇది రాజ్యాంగ



చట్రంలో పొందుపరిచిన స్వాభావిక సరళత, విచక్షణను సూచిస్తుంది. సమాఖ్య ప్రజాస్వామ్య వ్యవస్థలో మారుతున్న విభిన్న సందర్భాలు, పరిస్థితులకు అనుగుణంగా శాసన నిర్మాణంలో సమతుల్యతను సాధించవలసిన అవసరమున్నదని ఐదుగురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. శాసన నిర్మాణంలో పాటించవలసిన ఈ సూత్రాలు సైద్ధాంతికంగా, రాజ్యాంగబద్ధంగా విమర్శాతీతమైనవి. అయితే డాక్టర్ అంబేడ్కర్ హెచ్చరికను కూడా సుప్రీంకోర్టు పరిగణనలోకి తప్పక తీసుకోవాలి. భారత రాజ్యాంగ సభ ముగింపు సమావేశం (25 నవంబర్ 1949)లో అంబేడ్కర్ ప్రసంగిస్తూ భారత ప్రజాస్వామ్య గమనం విషయమై కొన్ని సూచనాత్మక హెచ్చరికలు చేశారు: 'మన రాజ్యాంగ చట్టంలోని సుగుణాల గురించి నేను ప్రస్తావించను. ఎందుకంటే, రాజ్యాంగం ఎంత చక్కటిదయినప్పటికీ, దాన్ని పనిచేయించే పెద్దమనుషులు సరైనవారు కాకపోతే అది చెడ్డదే అవుతుంది. రాజ్యాంగం ఎంత చెడ్డదయినప్పటికీ దాన్ని పనిచేయించే పెద్ద మనుషులు మంచివారయితే, అది మంచిదే అవుతుంది. రాజ్యాంగ చట్ట స్వభావం మీదనే రాజ్యాంగం పని చేయడం ఆధారపడి లేదు. శాసనసభ, కార్యనిర్వాహక మండలి, న్యాయవ్యవస్థ లాంటి రాజ్యవ్యవస్థ విభాగాలను మాత్రమే రాజ్యాంగం అందించగలదు. ఆ రాజ్యవ్యవస్థ విభాగాలు పనిచేయటం ప్రజలు, వారి ఆకాంక్షలు, రాజకీయాల నిర్వహణా పరికరాలుగా వారు ఏర్పరచుకున్న రాజకీయ పక్షాలపై ఆధారపడి ఉంటుంది. భారత ప్రజలు, వారి పార్టీలు ఎలా ప్రవర్తిస్తాయో ఎవరు చెప్పగలరు? తమ ప్రయోజనాల సాధనకు వారు రాజ్యాంగ పద్ధతులు అనుసరిస్తారో, లేక వాటిని సాధించటానికి విప్లవ పద్ధతులను ఎంచుకుంటారో ఎవరికి తెలుసు?'

ఇప్పుడు గవర్నర్ పదవులలో ఉన్న 'పెద్ద మనుషులు' అందరూ సరైనవారు కాదని నిశ్చితంగా చెప్పవచ్చు. మరి వారు ఎలాంటివారు అన్న విషయమై ఒక నిర్ణయానికి రావడాన్ని పాఠకులకే వదిలివేస్తున్నాను. వారు ఏమి చేస్తున్నారు, ఏమి చేయడం లేదనేది భారత ప్రజలకు బాగా తెలుసు. ఒక శాసనసభ ఆమోదించిన బిల్లు చట్టం కాకుండా నెలల తరబడి నిలిపివేస్తున్న గవర్నర్లు చాలా మంది ఉన్నారు. ఫలితంగా రాజ్యాంగం పనిచేయడం లేదు. అది శిథిలమవుతోంది. ప్రజల సంకల్పం నెరవేరడం లేదు.

రాజ్యాంగ సమతౌల్యతను శాసన వ్యవస్థకు వ్యతిరేకంగా వినియోగించిన గవర్నర్ల ఉదంతాలు (ముఖ్యంగా ప్రతిపక్షాల పాలనలో ఉన్న జార్ఖండ్, కర్ణాటక, కేరళ, పంజాబ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్) సర్వోన్నత న్యాయస్థానం ఎదుట ఉన్నాయి. ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆ సమతౌల్యతను సాధికారంగా, విశ్వసనీయంగా పునరుద్ధరించగలదని ఆశించడం జరిగింది. ఆ ధర్మాసనం తన విచారణలో ఉన్న సంబంధిత కేసుల పూర్వాపరాలను ప్రశస్తంగా విశ్లేషించింది. అయితే దాని తీర్పు సైద్ధాంతిక భావనలపై ఆధారపడి వాస్తవ పరిణామాలతో సంబంధంలేని ఫలితాలకు దారితీసేలా ఉన్నది. సుప్రీంకోర్టు ముందున్న వాస్తవాలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

చట్టాలు యథార్థాలకు ప్రతిస్పందించాలి. న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి భంగం కలుగవచ్చని భావించినప్పుడు హైకోర్టు న్యాయమూర్తులను ఎంపిక చేసే అధికారాలు తనకే ఉండేలా రాజ్యాంగ అధికరణ 217కు సుప్రీంకోర్టు భాష్యం చెప్పింది. శాసనసభ ఆమోదించిన బిల్లులను సమ్మతించడం లేదా సమ్మతించకపోవడం లేదా నిలిపివేయడం లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపడంపై గవర్నర్ల అధికారాలకు సంబంధించిన అధికరణ 200 పాలనా వ్యవహారాలలో తీవ్ర సమస్యలకు దారితీస్తోంది. చట్టాల నిర్మాణంలో శాసనవ్యవస్థ సామర్థ్యమే ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన విశిష్టత. అయితే చట్టసభలు రూపొందించిన చట్టాలను నిర్హేతుకంగా, ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్న పరిస్థితులలో న్యాయ వివేకం సహాయాన్ని మాత్రమే కోరడం నిరర్థకమే అవుతుంది.

> **గవర్నర్ పదవులలో ఉన్న 'పెద్ద మనుషులు' అందరూ సరైనవారు కాదు. వారు ఏమి చేస్తున్నారు, ఏమి చేయడం లేదనేది భారత ప్రజలకు బాగా తెలుసు. ఒక శాసనసభ ఆమోదించిన బిల్లు చట్టం కాకుండా నెలల తరబడి నిలిపివేస్తున్న గవర్నర్లు చాలామంది. ఫలితంగా రాజ్యాంగం పనిచేయడం లేదు. ప్రజల సంకల్పం నెరవేరడం లేదు.**

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఆందోళన కలిగిస్తున్న పారిశ్రామిక ప్రమాదాలు!

పరిశ్రమల్లో ప్రమాదకర రసాయనాల వల్ల అగ్ని ప్రమాదాలు, పేలుళ్ల సంభవించడం నిత్యకృత్యంగా పరిణమించింది. దేశంలో 139 పారిశ్రామిక ప్రమాదాలు సంభవించి... 259 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, 560 మంది గాయపడ్డారని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకటించిన గణాంకాలు కలవరపెడుతున్నాయి. వందేళ్ల నాటి పారిశ్రామిక భద్రతా చట్టాలను సమూలంగా మార్చాల్సిన అవసరాన్ని తరచూ జరిగే ఈ దుర్ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

విజయవాడ నగరం నడిబొడ్డున ఎనిమిది ఎకరాల్లో 1950లో ప్రస్థానం ప్రారంభించిన అరవై ఏళ్ల చరిత్ర కలిగిన సిరిస్ ఔషధ కర్మాగారంలో 2000, 2013 సంవత్సరాల్లో ప్రమాదాలు జరగడం, చివరకు మూతబడటం తెలిసిందే. ఈ జూన్ 30న తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో సిగాచీ ఫార్మా కర్మాగారంలో జరిగిన భారీ పేలుడులో 46 మంది మృతి చెందగా, 333 మంది గాయపడ్డారు. గత ఏడాది ఆగస్టు 23న ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మృత్యువాత పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా విశాఖ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రమాదాలు గత కొన్నేళ్లుగా వరుసగా సంభవిస్తున్నాయంటే అది పరిశ్రమ నిర్వాహకుల, ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణికి ప్రబల నిదర్శనం. విశాఖపట్నంలోని వెంకటాపురంలో ఎల్జీ పాలిమర్స్ కర్మాగారంలో 2020 మే 7న స్టైరీన్ గ్యాస్ లీకై, ఆ విషవాయువు 3 కిలోమీటర్లు వ్యాపించి సమీప గ్రామాలను ప్రభావితం చేయడం, 12 మంది మృతిచెందటం, చాలా మంది అస్వస్థతకు గురవ్వడం మరిచిపోలేం. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పరిశ్రమల్లో ముఖ్యంగా ఫార్మా పరిశ్రమల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలు తీవ్రంగా ఆందోళన కలిగిస్తున్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం, విశాఖపట్నం సమీపంలో పరవాడ ప్రాంతాల్లోని ఫార్మా కంపెనీల్లో వరుస పేలుళ్లు, అగ్ని ప్రమాదాలు యాజమాన్యాల నిర్లక్ష్యానికి నిలువుటద్దాలు. అచ్యుతాపురం సెజ్‌తో పాటు పరవాడ ప్రాంతంలోని ఫార్మా, రసాయన పరిశ్రమల్లో రియాక్టర్ల పేలుళ్లు, అగ్నిప్రమాదాలు సంభవించాయి.



2022 అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం నూతన భద్రతా ప్రమాణాలను అమలులోకి తెచ్చినా, పరిశ్రమలు వాటిని కచ్చితంగా పాటించకపోవడం, ప్రభుత్వం పకడ్బందీగా అమలుచేయకపోవడం వల్ల భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. కార్మిక భద్రతకి ఇపుడున్న చట్టాలు సైతం ఊతమివ్వడం లేదు. ప్రతి రసాయనాన్ని సురక్షితంగా నిర్వహించే పారిశ్రామిక వాతావరణం మనకు లేదనడానికి దేశంలో గత దశాబ్ద కాలంలో జరిగిన 130 ప్రధానమైన పారిశ్రామిక ప్రమాదాలే సజీవ సాక్ష్యం. అంతెందుకు 1984 నాటి భోపాల్ గ్యాస్ విషాదం ఇప్పటికీ మనం మర్చిపోలేనిది. విషవాయువు మిథైల్ ఐసో సైనేట్ విడుదలై వేలాదిమంది మృతిచెందిన ఆ చేదు జ్ఞాపకం మనల్ని వెంటాడుతోంది. రసాయన పరిశ్రమలు ఆహారం నుంచి ఔషధం వరకు, సౌందర్య సాధనాలు, పెయింట్, దైనందిన జీవితంలో మనం ఉపయోగించే అనేక ఇతర వస్తువులకు అవసరమయ్యే రసాయనాలను పెద్ద మొత్తంలో తయారు చేస్తున్నాయి. పరిశ్రమలో ఉపయోగించే రసాయనాలు తరచుగా శుద్ధి, ఇతర పదార్థాలతో మిశ్రమం కావడం వగైరా ప్రక్రియలకు లోనవుతాయి. ప్లాస్టిక్, ఔషధాలు, సౌందర్య సాధనాలు మొదలైన వాటి తయారీకి రసాయనాల తయారీ అనివార్యమే అయినా, ప్రతి ప్రక్రియకు వేర్వేరు భద్రతా సమస్యలు ఉంటాయి. ప్రతి రసాయనాన్ని సురక్షితంగా నిర్వహించడం బాధ్యతతో కూడుకున్న అంశం.

పారిశ్రామిక స్థాయిలో ఉత్పత్తి అయ్యే కొన్ని ప్రమాదకర రసాయనాలు జిలీన్, టోలున్, నాఫ్తా, అసిటోన్ మొదలైన ద్రావకాలు, సల్ఫ్యూరిక్, నైట్రిక్, హైడ్రోక్లోరిక్, ఎసిటిక్ వంటి ఆమ్లాలు, సోడియం, పొటాషియం, కాల్షియం హైడ్రాక్సైడ్లు వంటివి పీల్చినా కూడా ప్రమాదకరమే. ఈ రసాయనాల వల్ల గాలి, నేల, భూగర్భ జలాలు, ఉపరితల నీరు తీవ్రంగా కలుషితమవుతున్న నేపథ్యంలో, వీటి నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా నియమాలు, ప్రత్యేక నిల్వ, రవాణా పద్ధతులు అవసరం. ప్రభుత్వాలు, పరిశ్రమలు కలిసి ప్రమాదాలను తగ్గించడానికి, ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడటానికి చర్యలు తీసుకోవాలి.

○ నిమ్మగడ్డ లలితప్రసాద్
బ్రహ్మయ్య అండ్ కో, విజయవాడ

కార్మిక చట్టాలు కోడ్స్‌లో వెతుక్కోవాలి!

కార్మిక చట్టాల స్థానంలో కార్మిక కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. వీటి ద్వారా సర్వతోముఖాభివృద్ధి సాధించి దేశం ముందుకు వెడుతుందని ఊదరగొట్టే ప్రయత్నం చేస్తోంది. కానీ అవి కార్మికుల హక్కులను హననం చేసి యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వారిని బలి చేస్తాయి. 100 సంవత్సరాలుగా కార్మికులకు రక్షణగా నిలిచిన చట్టాలను భూస్థాపితం చేసి, యాజమాన్యాలు తమ ఇష్టారీతిన కార్మికులను ఉపయోగించుకునేలా లేబర్ కోడ్‌లను తయారు చేయడం ఆక్షేపణీయం.

విపులంగా ఉన్న చట్టాలను కుదిస్తే వాటి పరిధి పెరుగుతుందా తగ్గుతుందా? 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా సంక్షిప్తీకరించి వాటిని కార్మికుల సంక్షేమం కోసమే అని ప్రకటించడం ఎవరూ ప్రశ్నించరు అన్న ధీమాతోనే. అంతేకాక కార్మికుల హక్కుల పట్ల నిర్లక్ష్యం, కార్మిక సంఘాల పట్ల లెక్కలేనితనం, పెట్టుబడిదారులకు దోపిడీ మార్గాలను సుగమం చేయాలన్న దృఢసంకల్పంతో మాత్రమే. కార్మిక సంఘానికి ఇచ్చిన నిర్వచనంలో యాజమాన్యాలు, యాజమాన్యాలూ కలిసి ఏర్పడిన సమూహం కూడా కార్మిక సంఘంగా పరిగణించబడుతుందని చెప్పడం వెనుక అర్థమేమిటో తెలియలేదు. ఇక నుంచి వర్కర్లు వేరు, ఎంప్లాయీస్ వేరు. రూ.18,000 వేతనం పొందే సూపర్వైజరీ ఉద్యోగి వర్కర్ కాదు! కోడ్ పరిధి మారుతుంది. అన్ని రకాల వివాదాంశాలపై తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిదే అని ప్రకటించారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏదైనా లేబర్ కోడ్‌ల అంశంలో వివాదం ఏర్పడితే కేంద్రానిదే తుదినిర్ణయం.

వేతనాల నిర్ణయంపై యాజమాన్యాలదే పూర్తి బాధ్యతట. మరి ఆ బాధ్యత నెరవేర్చకపోతే పరిష్కారమేమిటో చెప్పలేదు. సమాన పనికి సమాన వేతనం అమలు పరచాలన్నప్పుడు, స్త్రీ–పురుషులకు అసంఘటిత రంగంలో సమాన వేతనం ఏర్పాటుచేసే ప్రక్రియ ఏమిటో ప్రస్తావించలేదు. పైగా ఒక నిర్దేశించిన పనికి ఎవరినైనా నియమించుకున్నప్పుడు యజమాని నిర్ణయమే అంతిమం అని ఇండస్ట్రియల్ రిలేషన్స్ అనే కోడ్‌లో స్పష్టంగా పేర్కొంటూ, సదరు యజమాని నిర్ణయాన్ని కోర్టులో కూడా సవాలు చేయరాదన్న నిబంధన ఎందుకు ఉంచినట్లు? రాత్రి పగలు తేడా లేకుండా స్త్రీలను పనుల్లో నియమించుకోవడం, కావాల్సినన్ని గంటలు పనిచేయించుకోవడం వంటివన్నీ స్త్రీల ఉద్ధరణగా ఎలా భావించగలం?

అన్నిటికన్నా క్రూరమైన ప్రతిపాదన 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్– 'యాజమాన్యం చెల్లించే గ్రాట్యూటీ పొందడానికి ఇప్పుడున్న ఐదు సంవత్సరాల అర్హత కాలాన్ని ఒక సంవత్సరానికి' కుదించామని చెప్పేది. ఈ ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రతిపాదన ద్వారా భవిష్యత్తులో ఏ ఒక్కరికీ 2 లేదా 3 సంవత్సరాలకు మించి అగ్నివీరుల్లా ఉపాధి ఉండదు! ఇంతటి క్రూరత్వాన్ని కప్పిపెట్టుకోవడానికి ఒక సంవత్సరం పనిచేసినా సరే గ్రాట్యూటీ పొందవచ్చు అనే మాయమాట చెబుతున్నారు. గ్రాట్యూటీ పేమెంట్ అనేది ఉద్యోగి పొందే వేతనాన్ని, చేసిన సర్వీస్ కాలాన్ని బట్టి ఉంటుంది. అలాంటప్పుడు ఒక సంవత్సరం పనిచేసిన ఉద్యోగి పొందే బేసిక్ ఎంత, దానికి సరిపడా ఒక సంవత్సరానికి లభించే గ్రాట్యూటీ ఎంత? నామమాత్రం! నియామక పత్రాలు పొందిన సంఘటిత రంగంలోని కొందరికి మాత్రమే గ్రాట్యూటీ చెల్లిస్తారు. 97శాతం అసంఘటితరంగ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలంటే ఏం చేయాలో ఈ కోడ్‌లలో ఎక్కడా లేదు.


కనీసం 100 మంది వర్కర్లు పనిచేస్తున్న సంస్థలో లే ఆఫ్ లేదా రిట్రెంచ్‌మెంట్ ప్రకటించాలంటే ప్రభుత్వ అనుమతి అవసరం. ఇప్పుడు ఆ సంఖ్యను 300 చేశారు. అదే విధంగా ప్రభుత్వం ప్రకటించే స్టాండింగ్ ఆర్డర్లు కూడా కనీసం 100 మంది వర్కర్లు ఉన్న సంస్థలకు వర్తిస్తాయి, ప్రస్తుతం దీనిని 300కి పెంచారు. మరి దీని ద్వారా యాజమాన్యాలకు లాభమా, వర్కర్లకు లాభమా? ఎవరైనా యజమాని నిర్దేశిత పనికోసం ఎవరినైనా నియామక పత్రం ఇచ్చి మరీ నియమించుకున్నప్పుడు వారిని తొలగించేటప్పుడు ఎలాంటి వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు.

ఇక కార్మిక సంఘాల పరిధి నామమాత్రమై పోతుంది. కార్మిక సంఘాన్ని రిజిస్టర్ చేసుకోవాలంటే కనీసం 10శాతం సభ్యులు గానీ లేదా వందమంది గానీ ఉంటే తప్ప సాధ్యపడదు. వంద మందికి మించి వర్కర్లున్న చోట వర్కర్స్ కమిటీ ఏర్పడనున్నది. ఈ వర్కర్స్ కమిటీలో యాజమాన్యం, కార్మిక సంఘాల ప్రతినిధులు సమాన సంఖ్యలో ఉంటారు. 20 మంది కన్నా ఎక్కువ కార్మికులు ఉన్న చోట 'గ్రీవెన్స్ రెడ్రెసల్ కమిటీ' ఏర్పాటు చేస్తారు. చైర్మన్ మాత్రం యజమాన్యం వైపు నుంచే ఉంటారు. దీన్ని బట్టి ఎవరి ప్రయోజనాల కోసం కార్మిక చట్టాల సవరణ జరిగింది? సమ్మెలను నివారించడమే లక్ష్యంగా ఈ కోడ్‌లు తయారయ్యాయి.


అసంఘటితరంగ కార్మిక సంఘాలకు నాయకత్వం వహించడానికి కనీసం 50శాతం ఆ సంస్థలో పనిచేస్తున్నవారై ఉండాలి. సంఘటితరంగం గురించి స్పష్టత లేదు. ఇలా ఏ సంఘాలకు ఎవరు నాయకులు ఉండాలో కూడా అంతిమ నిర్ణయం ప్రభుత్వమే చేస్తే ఇక కార్మికుల, వారి సంఘాల ప్రజాస్వామ్యమెక్కడ! ఇలాంటి నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 స్ఫూర్తికి విరుద్ధం.

గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫాం వర్కర్లకు కూడా పర్మనెంట్ ఉద్యోగుల మాదిరిగా అన్నీ సమకూరుతాయని ప్రకటించారు. కానీ గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫాం వర్కర్లకు సంబంధించిన యజమాని – ఉద్యోగి అనే అంశంపై స్పష్టత లేదు. వారికి ఇవ్వాల్సిన నియామక పత్రాల గురించి కూడా స్పష్టత లేదు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలి అని ఒక వైపు ప్రకటిస్తూనే 14 సంవత్సరాలు నిండిన వారందరూ కార్మిక సంఘంలో చేరవచ్చు అని కూడా ప్రస్తుతించారు. వెరసి ఈ కోడ్‌ల ద్వారా ప్రశ్నించకుండా స్వీయ ధృవీకరణ ద్వారా పరిష్కరించుకోవాలి. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ మాదిరిగా కన్సిలియేటరీ, ట్రిబ్యునల్, గ్రీవెన్స్ రిడ్రెస్సల్, ఆర్బిట్రేటర్ వ్యవస్థలన్నీ దాటితే తప్ప కోర్టు పరిధి అందుబాటులోకి రాదు. కార్మిక సంక్షేమానికి నీళ్ళొదిలితే సమాజంలోని అని వ్యవస్థలూ తిరోగమనంలో పయనిస్తాయి.

> **విపులంగా ఉన్న చట్టాలను కుదిస్తే వాటి పరిధి పెరుగుతుందా తగ్గుతుందా? 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా సంక్షిప్తీకరించి వాటిని కార్మికుల సంక్షేమం కోసమే అని ప్రకటించడం ఎవరూ ప్రశ్నించరు అన్న ధీమాతోనే! అంతేకాక, కార్మికుల హక్కుల పట్ల నిర్లక్ష్యం, కార్మిక సంఘాల పట్ల లెక్కలేనితనం, పెట్టుబడిదారులకు దోపిడీ మార్గాలను సుగమం చేయాలన్న దృఢ సంకల్పంతో మాత్రమే.**



■ జి. తిరుపతయ్య





● బ్యాంక్ ఆఫ్ ఇండియా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, పెమ్మసాని, నారాయణ, శ్రావణ్‌కుమార్



ఇన్సూరెన్స్ కార్యాలయాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, కేశవ్

ఆర్థిక నగరానికి.. అంకురార్పణ





ఇక ఆర్థిక కేంద్రంగా అమరావతి

- ఒకేచోట 13 బ్యాంకులు కొలువుదీరేలా ప్రణాళిక
- రాజధానిలో బ్యాంక్ కార్యాలయాలకు శంకుస్థాపన
- భూమిపూజ చేసిన నిర్మలాసీతారామన్, చంద్రబాబు
- ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో అట్టహాసంగా కార్యక్రమాలు



చంద్రబాబుకే సాధ్యం

దేశంలో తొలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను సైబరాబాద్‌లో చంద్రబాబు నిర్మించారు. అమరావతిలో ఆర్థిక రాజధానిగా ఫైనాన్షియల్ స్ట్రీట్‌ను నిర్మించే అవకాశం ఆయనకే రావడం అసాధారణం. నాడు హైదరాబాద్ లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అమలు చేసిన కార్యక్రమాలు నేడు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చి ఆర్థిక ఫలాలు అందిస్తున్నాయి. ఎంతో క్లిష్టమైన ఈ బాధ్యతని ఆయన తన భుజాలపై మోసి విజయం సాధిస్తారు. - నిర్మలా సీతారామన్

ప్రజా రాజధానిగా పరుగులు పెడుతున్న అమరావతి.. ఇక ఆర్థిక కేంద్రంగా మారనున్నది. ప్రధాన బ్యాంకులు అమరావతి కేంద్రంగా కార్యకలాపాలకు అంకురార్పణ జరిగింది. రాజధానిలో ఆయా బ్యాంకులకు కేటాయించిన స్థలాల్లో శుక్రవారం భూమిపూజ జరిగింది. ముంబై నుంచి వచ్చిన ఆర్థిక దిగ్గజ సంస్థల ప్రతినిధులు, బ్యాంకుల ప్రధాన అధికారులు, రాజధాని రైతులు, ఉపముఖ్యమంత్రి, మంత్రుల సమక్షంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఈ వేడుక కోసం ఆర్థికశాఖకు సంబంధించిన ప్రముఖులు అమరావతిలో కొలువుదీరారు. రాజధానిలో బ్యాంకింగ్ రంగం బలోపేతం కావడంతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం చేరువ కానుందని వారు ప్రకటించారు.

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతిలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధాని నగరం అమరావతిలో ఒకే చోట 13 బ్యాంకులు కొలువుదీరేలా ఆర్థిక నగరానికి శుక్రవారం అంకురార్పణ జరిగింది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రుల సమక్షంలో అట్టహాసంగా బ్యాంకు కార్యాలయాలకు శంకుస్థాన జరిగింది. రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయంలోని బ్లాక్ 1 వద్ద ఏర్పాటు చేసిన 13 జాతీయ, (మిగతా 8వ పేజీలో)





మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, హాజరైన వివిధ బ్యాంకుల ప్రతినిధులు

టెండర్లు ఖరారు!

తాగునీటి పథకాల విస్తరణ పనుల టెండర్లు ఖరారయ్యాయి. నెల రోజుల్లో పనులు ప్రారంభించేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీంతో గుంటూరు కార్పొరేషన్, పిడుగురాళ్ల, మాచర్ల మునిసి పాల్టీల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. రూ.501.07 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ నిధి (యూఐడీఎఫ్) నుంచి నిధులు విడుదలయ్యాయి. ఈ ప్రాజెక్టును నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్ బీ) ద్వారా నిర్వహిస్తున్నారు. రానున్న 30 ఏళ్ల వరకు తాగు నీటి అవసరాలకు తగ్గట్టుగా తాగునీటి పథకాలను అభివృద్ధి చేస్తారు. వైసీపీ పాలనలో ఐదేళ్లు అటెక్కించిన నీటి పథకాల విస్తరణను కూటమి ప్రభుత్వం పట్టాలెక్కిస్తోంది.

- నెలలో నీటి పథకాల పనులు ప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న పబ్లిక్ హెల్త్ శాఖ
- రూ.501.07 కోట్ల వ్యయంతో విస్తరణ



పిడుగురాళ్లలో వైసీపీ హయాంలో నిలిచిపోయిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం



బుగ్గవాగు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

మెగా సంస్థ దాఖలు చేసిన టెండర్లు ఖరారు చేసినట్లు పబ్లిక్ హెల్త్ శాఖ చీఫ్ ఇంజనీరు ఎం ప్రభాకరరావు తెలిపారు. నీటి పథకాల నిర్మాణం పూర్తయిన అనంతరం ఏడు సంవత్సరాలు వాటి నిర్వహణ బాధ్యతలు కూడా సదరు సంస్థకు అప్పగిస్తూ టెండర్‌లో పేర్కొన్నారు. నిర్వహణకు సంబంధించి గుంటూరు కార్పోరేషన్, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలతో అగ్రిమెంట్ చేసుకోవాలని సదరు సంస్థకు సూచిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బుగ్గవాగు నుంచి పైపులైన్ నిర్మాణం

మాచర్ల, పిడుగురాళ్ల మునిసిపాల్టీల్లో ఏడాది పొడవునా తాగునీటిని సరఫరా చేసే దిశగా నీటి పథకాలను అభివృద్ధి చేస్తున్నారు. బుగ్గవాగు నుంచి నీటిని ఆయా మునిసిపాలిటీలకు సరఫరా చేసేందుకు (మిగతా 8వ పేజీలో)



దిత్వా.. అలర్ట్

- తుఫాన్‌తో జిల్లాకు వర్ష సూచన
- నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

దిత్వా రూపంలో మరో తుఫాన్ దూసుకువస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో బలపడిన దిత్వా తుఫాన్ ప్రభావం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలపై ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. తుఫాన్ ప్రభావంతో శనివారం నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరికలు జారీ చేసింది. దక్షిణకోస్తా తీరం వెంబడి గంటకు 50 నుంచి 70 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని ప్రజలు చెట్ల కింద నిలబడరాదని విపత్తుల నిర్వహణ సంస్థ తెలియ జేసింది. మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. రైతులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో వరి సాగు చేసిన రైతు కంట కునుకు కరువైంది. మొన్నటి దాకా మొంథా తుఫాన్ ప్రభావం వల్ల అల్లాడిపోయిన రైతుల్లో దిత్వాతో ఆందోళన నెలకొంది. చాలా చోట్ల కోసిన ధాన్యం చేలల్లోనే ఉంది. కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిస్తే మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బర్లీ.. బంద్

- అదనపు కొనుగోళ్లు లేనట్లే
- మార్క్‌ఫెడ్ నిర్ణయంతో రైతుల్లో నిరాశ
- బకాయిలు విడుదల.. ప్రాసెసింగ్‌కు టెండర్లు



(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

రైతుల వద్ద ఇంకా బర్లీ పొగాకు నిల్వలు గణనీయంగానే ఉన్నాయి. రైతుల వినతి మేరకు అదనపు కొనుగోళ్లకు అనుమతి ఇవ్వాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. మొంథా తుఫాన్ ధాటికి బర్లీ పొగాకుకు కూడా నష్టం జరిగిందని, అదనపు కొనుగోళ్లకు కొన్ని మినహాయింపులతో అనుమతి ఇవ్వాలని రైతులు అభ్యర్థించారు. ఈ పరిస్థితుల్లో త్వరలో అదనపు కొనుగోళ్లకు అనుమతి వస్తుందని రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే వారిని నిరాశ పరుస్తూ మార్క్‌ఫెడ్ నిర్ణయం తీసుకుంది. బర్లీ కొనుగోళ్ల అంకం ముగిసినట్లేనని, అదనపు సేకరణ లేదని రాష్ట్రస్థాయి అధికారులు స్పష్టం చేశారు. కానీ ఇంకా క్షేత్రస్థాయిలో దాదాపు 40,000 క్వింటాళ్ల బర్లీ పొగాకు నిల్వలు ఉన్నట్లు అధికారులే చెబుతున్నారు. అయినా ఇకపై కొనేది లేదనే మార్క్‌ఫెడ్ నిర్ణయంపై రైతుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ప్రభుత్వం పునరాలోచించి కనీసం మరో 20,000 క్వింటాళ్ల బర్లీ పొగాకును సేకరించడానికి అనుమతి ఇవ్వాలనే అభ్యర్థనలు రైతుల నుంచి వస్తున్నాయి. మార్క్‌ఫెడ్ తీసుకున్న నిర్ణయం పట్ల స్థానికంగా ఉండే నేతల్లోనూ అసంతృప్తే కనబడుతుండడం గమనార్హం.

కేటాయించిన నిధుల సంగతేంటి..

బర్లీ పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం ఆరంభంలోనే మార్క్‌ఫెడ్ రూ.273 కోట్లను కేటాయించింది. ఈ నిధులన్నీ బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాలోని బర్లీ రైతుల మేలు కోసం కేటాయించినవే. అయితే కేటాయించిన నిధుల్లో ఇంకా రూ.123 కోట్లు మిగులు ఉన్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. బర్లీ (మిగతా 8వ పేజీలో)

రెండో విడతకు.. సై

- అమరావతి భూసమీకరణకు అనుమతి
- రాజధానిలో ఏడు గ్రామాలు నోటిపైకి ఆమోదం 16,666.57
- ఎకరాల విస్తీర్ణంలో ఎల్‌పీఎస్ అమలు
- సీఆర్‌డీఏ ప్రతిపాదనలను ఆమోదించిన మంత్రి వర్గం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని విస్తరణ నిమిత్తం రెండో విడత భూసమీకరణకు సీఆర్డీఏ సిద్ధమైంది. సీఆర్‌డీఏ అందజేసిన ప్రతిపాదనపై రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం చర్చించి ఆమోదించింది. దీంతో ఏడు గ్రామాల్లో 16,666.57 ఎకరాల భూమిని రాజధాని అవసరాలకు సమీకరిస్తారు. వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి కలిపి 7,562 ఎకరాలు, వడ్డమాను, హరిశ్చంద్రాపురం, పెదపరిమి కలిపి 9,104.57 ఎకరాలు భూసమీకరణ విధానంలో తీసుకోనున్నారు. ఇది కాకుండా ప్రభుత్వ భూమి ఈ ఏడు గ్రామాల్లో మరో 3,828 ఎకరాల వరకు ఉన్నది. వీటిల్లో ఎక్కువగా కొండలు ఉన్నట్లు గుర్తించారు. ల్యాండ్ పూలింగ్ స్కీమ్(ఎల్‌పీఎస్)కు క్యాబినెట్ ఆమోదం నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ పరిపాలన శాఖ నుంచి ఎల్‌పీఎస్ జీవోలు విడుదల కానున్నాయి. ఆ వెంటనే ఏడు గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, సర్వేయర్లు తదితర సిబ్బందిని నియమిస్తారు. రాజధానిలో ఎలాగైతే రైతులకు ప్యాకేజి ఇచ్చారో అదే రీతిన రెండో విడతలోనూ అమలు చేస్తారు. రాజధానిలో వచ్చే 30 ఏళ్లకు సరిపడా ప్రజలకు మెరుగైన జీవన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. అమరావతిలో ప్రస్తుతం ఉన్న భూముల ధరలు పెరగాలన్నా, వృద్ధి రేటు సాధించాలన్నా కచ్చితంగా స్మార్ట్ పరిశ్రమలు ఉండాలి. అలానే అంతర్జాతీయ విమానాశ్రయం లేనిదే రాజధాని అభివృద్ధి చెందదు. దీనిని దృష్టిలో పెట్టుకునే 5000 ఎకరాల్లో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మించాలని సీఎం ఇప్పటికే నిర్ణయించారు. అలానే అమరావతి చుట్టూ ఇన్నర్ రింగురోడ్డు, రైలుమార్గం, అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీకి సంబంధించి భూములు అవసరం ఏర్పడింది. ఇప్పటికే ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో చేసిన తీర్మానాలను క్యాబినెట్ ఆమోదించింది.

నేడో రెండో విడత సమావేశం

రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఏపీ సీఆర్‌డీఏ అధికారులు శనివారం తాడేపల్లిలోని పెమ్మసాని నివాసంలో సమావేశం కానున్నారు. తొలి విడత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుకు సంబంధించి పురోగతిని కూడా ఈ సమావేశంలో వారు సమీక్షిస్తారు.

ఎల్‌పీఎస్ గ్రామాలు:

- పెదపరిమి
- హరిశ్చంద్రాపురం
- వడ్డమాను
- కర్లపూడి
- యండ్రాయి
- పెదమద్దూరు
- వైకుంఠపురం



రెండో విడత ఎల్‌పీఎస్ అమలు చేయనున్న గ్రామాలు (సర్కిల్‌లోనివి)

మూఢం.. శుభకార్యాలకు విరామం



ఫిబ్రవరి 17 వరకు ముహూర్తాలు లేవు



ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలల పాటు శుభ కార్యాలకు మంచిరోజులు లేవు. శుక్రమౌఢ్యం వల్ల ఒక్క శుభ ముహూర్తం ఉండదు. శుభకార్యాలతో పాటుగా గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలు కూడా చేసుకోకూడదు.

- తుర్లపాటి ఉమామహేశ్వరశర్మ, కోటప్పకొండ

తెనాలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రహాల స్థితిని బట్టి కర్మ కాలాలు లేదా మూఢమి లాంటివి జ్యోతిష శాస్త్రం ద్వారా వినిపించే మాటలు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలకు విరామం రానుంది. ఈ నెల 26న మార్గశిర మాసం శుద్ధ సప్తి నుంచి ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో 83 రోజుల పాటు శుభకార్యాలకు ముహూర్తాలు లేవు.

- ఫిబ్రవరి 17 వరకు శుక్ర మౌఢ్యమి
- మూడు నెలల పాటు ముహూర్తాలు నిల్
- 82 రోజుల తర్వాతే శుభ ముహూర్తాలు
- పలు రంగాలపై ఆర్థిక ప్రభావం

పవిత్ర తిథులు

మార్గశిర, మాఘ, పాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈ సారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలు ఉండగా.. పుష్యమాసం శూన్య మాసం అవుతుంది. ఇక (మిగతా 8వ పేజీలో)

సాధ్యమైనంత త్వరలో..

అమరావతి నుంచే కార్యకలాపాలు

● ఏపీ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో కేటాయించిన రెండు ఎకరాల స్థలంలో శంకుస్థాపన కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు. జాతీయ బ్యాంకుల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రాష్ట్ర వ్యాప్తంగా 1,351 శాఖలున్నట్లు తెలిపారు. కోటి మందికి పైగా ఖాతాదారులకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తూ.. రాష్ట్రంలో అగ్రగామి బ్యాంకుగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రధాన కార్యాలయం గుంటూరు బ్రాడీపేటలో పనిచేస్తోందని, అమరావతిలో కేటాయించిన స్థలానికి నిర్మాణ అనుమతులు లభించిన వెంటనే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సాధ్యమైనంత త్వరలో ప్రధాన కార్యాలయాన్ని గుంటూరు నుంచి అమరావతికి మార్చే దిశగా చర్యలు వేగవంతం చేస్తున్నామని చైర్మన్ పేర్కొన్నారు. ఆధునికంగా కొత్త భవనం పూర్తయిన తరువాత బ్యాంకులోని అన్ని కీలక కార్యకలాపాలు అమరావతి నుంచే పర్యవేక్షించబడతాయని ఆయన స్పష్టం చేశారు.



బ్యాంకు ప్రధాన కార్యాలయ శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, పక్కన చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

జడ్పీకి శఠగోపం

● నాదెండ్ల క్వారీ భూమి లీజులో చిత్రాలు
● వసూలు చేసుకునేది అద్దె నెలకు రూ.లక్ష
● జిల్లా పరిషత్‌కు చెల్లించేది రూ.14,583
● ఏ పార్టీ అధికారంలో ఉన్నా వారికే టెండర్

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి): రాజుల సొమ్ము రాళ్లపాలు అన్న నానుడి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ విషయంలో నిజమవుతోంది. వంద కంటే విలువైన భూములు ఉన్నా వాటి ద్వారా వచ్చే ఫలసాయం మాత్రం పరులపాలవుతోంది. ఇందుకు నాదెండ్ల మండలంలోని గణపవరం గ్రామంలోని క్వారీ భూమి చక్కని ఉదాహరణ. మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న ఈ భూమికి నెలకు అద్దె రూపేణా రూ.లక్ష వరకు ఆదాయం చేకూరుతోంది. కానీ జిల్లా పరిషత్‌కు వచ్చేది మాత్రం రూ.14,583 మాత్రమే. మిగిలిన సొమ్మంతా ప్రయివేట్ వ్యక్తులు హాయిగా అనుభవిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యింది. సదరు స్థలాన్ని ఎప్పటి నుండో పాడుకుంటూ అద్దెను అప్పనంగా అనుభవిస్తున్న వ్యక్తికి కొందరు అధికారులు వంతపాడటం వివాదాస్పదమైంది.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా

నాదెండ్ల మండలంలోని గణపవరం గ్రామంలో సర్వే నంబరు 528/సీ/1లో జిల్లా పరిషత్‌కు 1.12 ఎకరాల భూమి ఉంది. అందులోని 30 సెంట్లకు సెప్టెంబరు 4న వేలం నిర్వహించారు. దానికి సంవత్సరం అద్దె రూ.1.75 లక్షలు చొప్పున చెల్లించేందుకు ముందుకు వచ్చిన వారికి లీజు ఖరారు చేసినట్లు జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశంలో 703 తీర్మానం ప్రవేశ పెట్టారు. వాస్తవానికి సదరు స్థలాన్ని ప్రస్తుతం పాడుకున్న వ్యక్తులే దశాబ్దాలుగా లీజు పొందుతూ వస్తున్నారు.



గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయం

గతంలో కేవలం రూ. 10 వేల నుంచి రూ.15 వేల వరకు మాత్రమే అద్దె చెల్లించే వారు. గడచిన మూడేళ్లలో మాత్రమే అద్దె పెంచుతూ వచ్చారు. జిల్లా పరిషత్ స్థలం వెనుక లీజు దారుని ఆరు ఎకరాల పొలం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. అందులో రెండు ఎకరాల్లో కళాశాల ఉండగా, మిగిలిన నాలుగు ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ వేసినట్లు సమాచారం. ఆ మొత్తం స్థలంలోకి జడ్పీ స్థలం దాటి వెళ్లాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఏ పార్టీ అధికారంలో ఉన్నా జిల్లా పరిషత్ స్థలాన్ని వారికే లీజుకు ఇచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

అన్నీ వ్యాపార దుకాణాలే

వివాదాస్పదమైన గణపవరం జడ్పీ స్థలంలో క్యాటరింగ్ పాయింట్, చికెన్ స్టాల్స్, టీ కొట్లు, మెకానిక్ షాపులు ఉన్నాయి. వారిలో ఒకరు రూ.40 వేలు, మరికొందరు రూ. 20 వేలు నుంచి రూ. 10 వేల వరకు అద్దెలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద నెలకు రూ.లక్ష తగ్గకుండా అద్దె వసూలు అవుతున్నట్లు సమాచారం. అయినా జడ్పీకి వచ్చేది మాత్రం నామ మాత్రమే.

ఎవరినీ రానివ్వకుండా

సాధారణంగా ప్రభుత్వ స్థలాలు లీజు ప్రక్రియ అంటే అందరికీ టెండర్ వేసే అవకాశం కల్పించాలి. కానీ, వివాదాస్పద స్థలం వేలానికి మాత్రం.. మండలస్థాయి అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. టెండర్లు వేసేందుకు ఎవర్నీ రానివ్వకుండా.. అడ్డుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జడ్పీ స్థాయీ సంఘం సమావేశంలోనూ సదరు స్థలం టెండర్ ప్రక్రియ సంబంధించిన తీర్మానం ఆమోదించిన లేదని జడ్పీటీసీలు భీష్మించారు. ఇదే విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. మరి ఈ విషయంలో జడ్పీ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

ఏసీబీ, విజిలెన్స్ కేసులు సత్వరమే పరిష్కరించాలి

● బీసీ సంక్షేమ శాఖ చీఫ్ సెక్రటరీకి విజ్ఞప్తి

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ అయిన ఉద్యోగుల ఏసీబీ, విజిలెన్స్ కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడంతో పెన్షన్, పదవీ విరమణ ప్రయోజనాలేవీ అందక ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే ఆయా కేసులను పరిష్కరించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ చీఫ్ సెక్రటరీ సత్యనారాయణకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ విజ్ఞప్తి చేశారు. వెలగపూడిలోని సచివాలయంలో ఈ మేరకు చీఫ్ సెక్రటరీకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బీసీ హాస్టళ్ల లో ఖాళీగా ఉన్న 384 గ్రేడ్ -2 హాస్టల్ అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ముఖ్యంగా బీసీ సంక్షేమ శాఖలో పనిచేసిన ఉద్యోగులకు సంబంధించి దాదాపు 74 ఏసీబీ/విజిలెన్స్ కేసులు వివిధ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిలో ఏసీబీ వద్ద 7, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ వద్ద రెండు, గవర్నమెంట్ వద్ద 33, డైరెక్టర్ బీసీ సంక్షేమ శాఖ వద్ద 4, వివిధ జిల్లా అధికారుల స్థాయిలో 26, అలానే కోర్టులలో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విధంగా వివిధ స్థాయిలలో దీర్ఘకాలికంగా కేసులు పెండింగ్‌లో ఉండడం వల్ల ఉద్యోగులు ఎంతో మానసిక వేదన చెందుతున్నారన్నారు. వీరిలో కొంతమంది ఉద్యోగులు ఇప్పటికే పదవీ విరమణ పొంది, పూర్తిస్థాయి పెన్షన్ గాని ఇతర ఆర్థిక ప్రయోజనాలు పొందలేకపోతున్నారన్నారు. సంబంధిత శాఖల పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



బీసీ సంక్షేమశాఖ చీఫ్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న కేసన

మద్యం సేవించి ప్రభుత్వాస్పత్రికి రావడం సరికాదు!

●రోగుల సహాయకులతో సూపరింటెండెంట్ రమణ

గుంటూరు మెడికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొందరు రోగుల సహాయకులు, బంధువులు మద్యం సేవించి ప్రభుత్వాస్పత్రికి వస్తున్నారని, ఇలా రావడం సరికాదని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. శుక్రవారం మీ కోసం కార్యక్రమంలో రోగులు, వారి సహాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కొందరు విజిటర్లు ఆసుపత్రి లోపలే బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారని, ఆసుపత్రి అంతటా సీసీ కెమెరాలు ఉన్న విషయం వారు గుర్తించాలని తెలిపారు. ఆసుపత్రి దేవాలయం, రోగులే దేవుళ్లు అని భావించి వైద్యులు సేవలు అందిస్తున్నారన్నారు. రోగుల సహాయకులు, బంధువులు కూడా వైద్యులకు సహకరించాలని ఆయన కోరారు. రోగులు, వారి బంధువుల ఓర్పు, సహనం, వైద్యుల పనిని సులభతరం చేయడంతో పాటు రోగులు త్వరగా కోలుకొనేలా చేస్తుందని డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. రోగుల సహాయకుల కోసం ఆసుపత్రిలో మధురాన్నం.. ఉచిత భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. శారదా పీఠం ద్వారా కూడా అందజేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జాగృతి సేవా సంస్థ ప్రతినిధి నాగరాజుకుమారి పండ్లు పంపిణీ చేశారు.

ఏఎన్‌యూ పురుషుల వాలీబాల్ జట్టు ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు మూడు రోజులుగా కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వర్సిటీ పురుషుల వాలీబాల్ జట్టుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల ఆటతీరు, ఫిట్‌నెస్, నైపుణ్యాలను పరిగణలోకి తీసుకున్నట్లు తెలిపారు. నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కాలేజీ క్రీడాకారులు కల్యాణ్ కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, ఎం.మణికంఠరెడ్డి, జె నితిన్‌కుమార్, యూసీపీఈఎస్ఎస్‌కు చెందిన బి.మనోజ్, పి.శ్రీను, సీహెచ్ కోటి, వి.శంకర్, బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి బి.విజయ్‌కుమార్‌రెడ్డి, డి.బాలరెడ్డి, ముప్పాళ్ళ ధనలక్ష్మి కాలేజ్ పిజికల్ ఎడ్యుకేషన్ నుంచి ఎస్‌కే ఉస్మాన్, ఏపీఆర్‌డీసీ నుంచి కె.శేఖర్‌బాబు, నరసరావుపేట కేబీఆర్ డిగ్రీ కాలేజ్ నుంచి బి.వెంకటేష్, వేద పార్మసీ కాలేజ్ నుంచి వై.అశోక్‌బాబును ఎంపిక చేశారు. స్టాండ్ బైగా కృష్ణవేణి కళాశాల నుంచి వై.కుమార్, వర్సిటీ నుంచి ఎన్.సబీర్, సీహెచ్ఐపీఎస్ నుంచి ఎస్‌డీ అబ్బాస్, ముప్పాళ్ల ధనలక్ష్మి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నుంచి కె.భాను ప్రకాశ్‌లను ఎంపిక చేశారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా డాక్టర్ పి.గౌరి శంకర్, డాక్టర్ వి.శ్రీనివాస్, జె.ప్రేమ్ కుమార్, వర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ డి.సూర్యనారాయణ వ్యవహరించారు. డిసెంబరు 10 నుంచి 14వ తేదీ వరకు వరకు కాకినాడ జేఎన్‌టీయులో నిర్వహించే సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీల్లో జట్టు పాల్గొంటొందని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈదర ఆదిబాబు తెలిపారు.



వర్సిటీ వాలీబాల్ జట్టుతో సెలెక్షన్ కమిటి సభ్యులు, ప్రిన్సిపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి చర్యలు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అన్ని విధాల చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డేలో పాల్గొని వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న వివిధ విభాగాల పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత, సర్వీసు సంబంధిత, బదిలీలకు సంబంధించిన, ఇతర పరిపాలనా సమస్యలపై వినతులు సమర్పించారు. ఎస్పీ మొత్తం 15 వినతులను స్వీకరించి, వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును పరిగణించి, సమయాను కూలంగా పరిష్కారం లభించేలా చూడాలని ఆయన సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

టెండర్లు ఖరారు!

(5వ పేజీ తరువాయి)

పైపులైన్‌లను నిర్మించనున్నారు. బుగ్గవాగు నుంచి మాచర్ల చెరువుకు నీటి తరలించేందుకు 27 కిలోమీటర్లు పైపు లైన్ ఏర్పాటు చేయనున్నారు. అయితే మాచర్ల పట్టణానికి సాగర్ నుంచి పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న వాటర్ గ్రిడ్ పైపు లైను నుంచి మాచర్ల చెరువుకు నీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రతిపాదన చేశారు. ఐదు కిలోమీటర్లు పైపులైను నిర్మిస్తే చెరువుకు నీరు చేరుతుంది. బుగ్గవాగు నుంచి దూరం కావడంతో పాటు వ్యయం కూడా భారీగా పెరగనుంది. బుగ్గవాగు నుంచి మోటార్ల ద్వారా పంపింగ్ చేయాల్సి ఉంటుంది. వాటర్ గ్రిడ్ లైన్‌ను అనుసంధానం చేస్తే గ్రావిటీపై మాచర్ల చెరువుకు నీటిని సరఫరా చేసే అవకాశం ఉంది. జలజీవన్ మిషన్ కింద వాటర్ గ్రిడ్, యూఐడీఎఫ్ కింద మాచర్ల పైపులైన్ నిర్మాణం చేపడుతున్నారు. రెండు పథకాలను అనుసంధానం చేయాలంటే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతులు లభించాల్సి ఉండటంతో ఇది సాధ్యపడదనే అధికారుల వాదనతో బుగ్గవాగు నుంచి మాచర్లకు పైపులైన్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు టెండర్ కూడా ఖరారైంది.

మాచర్లకు రూ.109.34 కోట్లు

మాచర్లలో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం నీటి పథకం విస్తరణకు రూ.109.34 కోట్లు వెచ్చిస్తోంది. ప్రస్తుతం క్వారీ పిట్‌ను నీటి నిల్వ చెరువుగా వినియోగిస్తున్నారు. బుగ్గవాగులో ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేసి మోటార్ల ద్వారా మాచర్లకు తాగు నీటిని తరలిస్తారు. మునిసిపాల్టీలో గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఓవర్ హెడ్ ట్యాంక్ పనులను చేపట్టారు. దీంతో పాటు పైపు లైన్లను కూడా నిర్మించనున్నారు. ఈ పనుల చేపట్టేందుకు టెండర్ ఖరారైంది.

పిడుగురాళ్లకు..

. కృష్ణా నది నుంచి పిడుగురాళ్లకు తాగునీటి తరలించేందుకు గతంలో పైపు లైన్ నిర్మించారు. అయితే ఈ పైపు లైన్‌పై తరచూ లీకులు ఏర్పడుతూ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఏడాది పొడవునా గ్రావిటీపై నీటిని తరలించేందుకు బుగ్గవాగు నుంచి పైపు లైన్ నిర్మిస్తారు. బుగ్గవాగులో ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేస్తారు. అక్కడే ఓహెచ్‌బీఆర్ నిర్మించి వాగు నుంచి నీటిని పంపు చేస్తారు. ఓహెచ్‌బీఆర్ నుంచి పైపు లైన్ ద్వారా గ్రావిటీపై పిడుగురాళ్లకు నీటిని తరలించే విధంగా పబ్లిక్ హెల్త్ శాఖ డిజైన్ చేసింది. 30 ఎంఎల్‌డీ నీటిని తరలించేందుకు 700 ఎంఎం సామర్థ్యం గల పైపులైన్‌ను నిర్మిస్తారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో పిడుగురాళ్ల మునిసిపాల్టీలో మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టింది. దీంతో పాటు పాటు డిస్ట్రిబూషన్ లైన్‌లు, 14 ఎంఎల్‌డీ నీటి శుద్ధి ప్లాంట్‌కు మరమ్మతులు చేస్తారు. రూ.177.67 కోట్ల వ్యవయంతో పనులు చేపడుతున్నారు.

గుంటూరుకు రూ.214.06 కోట్లు

గుంటూరు కార్పొరేషన్‌లో తాగు నీటి పథకం విస్తరణకు రూ.214.06 కోట్లు కేటాయించారు. కార్పొరేషన్‌లో విలీనం చేసిన 10 గ్రామాల ప్రాంతాలకు నీటి సరఫరా చేయనున్నారు. ఆయా ప్రాతాలను కలుపుతూ ప్రధాన పైపు లైన్ నిర్మిస్తారు. దీనిని నుంచి డిస్ట్రిబ్యూషన్ లైన్‌లు ఏర్పాటుచేస్తారు. ఈ ప్రాంతాలకు సరఫరా చేసే నీటిని శుద్ధి చేసేందుకు 53 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను నిర్మించనున్నారు.

30,872 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 24,794 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 30,872 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,632 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	11000	15000
273	----	-----
341	10500	17000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15600
షార్క్-1	----	---
బ్యాడిగి	10500	17600
దేవనూరు డీలక్స్	11000	16800

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	10000	13500
ఏసీ కామన్ వెరైటీ		
334	11000	17000
నెంబరు. 5	10500	15800
273	---	----
341	12000	17000
4884	12000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	15300
బ్యాడిగి	11000	17700
దేవనూరు డీలక్స్	10500	16200
తాలుకాయలు	5000	8200

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


సభలో మాట్లాడుతున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు గాంధీ సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు(తూర్పు), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులతో తిరిగిన వట్టికూటి వెంకటసుబ్బయ్యని గుంటూరు గాంధీగా పిలుచుకోవడం నగర ప్రజల అదృష్టమని, ఆయన జీవితం ఆదర్శప్రాయమని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. స్థానిక స్తంభాలగరువు మహాప్రస్థానంలోని మామిళ్లపల్లి మాలకొండయ్య, నాగమ్మ సమావేశ మందిరంలో శుక్రవారం వట్టికూటి వెంకటసుబ్బయ్య 24 వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎవరికి వారు వారి ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని క్రమంలో గుంటూరు గాంధీని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన మహాప్రస్థానం సేవా సమితి అధ్యక్షుడు వెలగపూడి లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలలో నైతిక విలువలు పెంచేందుకు గాంధీజీ ఆత్మకథ పుస్తకాలను నగర ప్రజలకు 25 వేలకు పైగా వెంకట సుబ్బయ్య పంచారని గుర్తు చేసుకున్నారు. తొలుత లక్ష్మీపురంలోని ఆయన విగ్రహానికి మేయర్‌తో కలిసి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, దాసరి హనుమంతరావు, నూతలపాటి తిరుపతయ్య, నన్నపనేని శేషగిరిరావు, యార్లగడ్డ వెంకన్న చౌదరి, వల్లూరి తాండవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో...


వెంకటసుబ్బయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్, శివరామిరెడ్డి తదితరులు

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుంటూరు గాంధీ నిస్వార్థ ప్రజా సేవకుడని, ఆయన నొక సామాజిక చైతన్యమని, ఆయన అందించిన సేవలు, ఆయన జీవిత విలువలతో కూడిన చరిత్రను నేటితరం అధ్యయనం చేయాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వట్టికూటి వెంకట సుబ్బయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో గుంటూరు గాంధీ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసలు, సిసలైన గాంధేయవాది వట్టికూటి వెంకట సుబ్బయ్య అని అన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు గడ్డ గర్వించదగిన వ్యక్తి వట్టికూటి వెంకట సుబ్బయ్య అన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త నూతలపాటి అరవింద, పాటిబండ్ల విష్ణు, సీనియర్ సిటిజన్స్ నాయకులు దాసరి హనుమంతరావు, గుంటూరు గాంధీ కుటుంబ సభ్యులు నన్నపనేని శేషగిరిరావు, రైతు నాయకుడు ఆత్మేట సుబ్బారావు, రేట్ పేయర్స్ సభ్యుడు వి.సదాశివరావు, ఆలోచనా వేదిక కార్యదర్శి మేదూరి రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.


ఖాళీ స్థలాల జాబితాను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్,నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. విజయపురి కాలనీ, పాండురంగ నగర్, ఇన్నర్ రింగ్ రోడ్, ఆర్టీసి కాలనీ, ఐపిడి కాలనీ, పొన్నూరు రోడ్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలపై పలు ఫిర్యాదులు కూడా అందుతున్నాయని, వార్డు సచివాలయాల వారీగా వాటిని గుర్తించి యజమానులకు శుభ్రం చేసుకోవాలని నోటీసులు అందించాలని ఆదేశించారు. పాండురంగ నగర్‌లో సెట్ బ్యాక్‌లు లేకుండా నిర్మాణం చేస్తున్న భవనాన్ని గమనించి, ప్లానింగ్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసి, తక్షణ నోటీసులు ఇచ్చి, చట్టపరంగా తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

గుంటూరు(విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పరిరక్షణ, వ్యాధులపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కృషి చేయాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆటలా రితేట, పీకలవాగు డ్రెయిన్ పరిసర ప్రాంతాల్లో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. డెంగీ, మలేరియా, బోదకాలు వంటి వ్యాధులపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ టైఫాయిడ్, కలరా, ఫ్లూ, బోదకాలు, డయేరియా వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వివరించాలన్నారు. డోర్ టు డోర్ సర్వే నిర్వహించి ప్రచారం చేయాలన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యంపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం సంతోషకుమారి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఎన్‌టీఏ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రక్రియ

గుంటూరు (విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో నేషనల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహించినట్లు రాష్ట్ర కార్యదర్శి బి.పౌహారావు, జిల్లా అధ్యక్షుడు సాయి విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాభిపురం, జాన్ విల్, దేవాపురం, అశోక్ నగర్, ఓరియంటల్ హైస్కూల్, బ్రాడీపేటలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల, శారదానికేతన్ ప్రాథమిక పాఠశాల, శారదానికేతన్ హైస్కూల్, బండ్లమూడి హనుమాయమ్మ ఎయిడెడ్ పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. ఎంఈఓ ఆఫీసులో సర్వీస్ రిజిస్టర్లు అప్డేట్ కావడం లేదని, ఎలక్షన్ డ్యూటీకి సంబంధించిన ఐఎలీజన్ వేయటం లేదని, అదేవిధంగా ఈ ఫైలింగ్‌కు సంబంధించి టీడీఎస్ తదితర సమస్యలు ఉపాధ్యాయులు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు లలితబాబు తదితరులు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో కూటమి పాలన

● తూర్పు ఎమ్మెల్యే నసీర్


పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు నసీర్, రామాంజనేయులు

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు మేలు చేస్తోందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక హిందూ కాలేజీ సెంటర్ లోని పూలే విగ్రహానికి తూర్పు ఎమ్మెల్యే నసీర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ దేశంలో తొలిసారి బాలికా విద్యకు శ్రీకారం చుట్టారని తెలిపారు. మహిళా సాధికారత కోసం పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో సామాజిక సంస్కరణల చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన నేత పూలే అని కొనియాడారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే : డీఆర్వో


పూలే వర్ధంతి సభలో మాట్లాడుతున్న డీఆర్వో ఖాజావలీ, పాల్గొన్న అధికారులు

గుంటూరు(తూర్పు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది మహాత్మ జ్యోతిరావు పూలే అని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలీ కొనియాడారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జ్యోతిరావు పూలే వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యే సమానత్వానికి అసలు మూలం అనేది ఆయన చిన్నవయస్సులోనే గుర్తించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గాబాయి, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మార్పు కోసం జీవితాన్ని త్యాగం చేసిన పూలే : కేసన


పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేసన శంకరరావు తదితరులు

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శతాబ్ధం కిందటే దేశంలో సామాజిక మార్పు కోసం మహాత్మా జ్యోతిరావు పూలే తన జీవితాన్ని త్యాగం చేశారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. పూలే 135వ వర్ధంతి సందర్భంగా ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హిందూ కళాశాల సెంటర్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ దేశంలోనూ ఓబీసీల కులగణనన చేసి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కన్నా మాష్టారు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కోలా అశోక్, డి రామకృష్ణ, బాదినేడి వంశీ తదితరులున్నారు.

● ఏపీ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో...

ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలే వర్ధంతి సందర్భంగా హిందూ కళాశాల సెంటర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు జీఆర్ భగత్‌సింగ్, వట్టికూటి సాంబయ్య, ఉగ్గం సాంబశివరావు, ముత్తయ్య, కొణిద మురళీకృష్ణ, నల్లపు నీలాంబరం, సాదు సత్యనారాయణ యాదవ్, రవిబాబు, పెనుమాక రమాదేవి, రవిబాబు, దుర్గారావు తదితరులున్నారు.

బీజేపీ నాయకుల నివాళి

గుంటూరు(తూర్పు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులు హక్కుల కోసం సత్యశోధక్ సంఘాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని బీజేపీ నాయకులు కొనియాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం హిందూ కళాశాల కూడలిలోని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా వ్యాప్తికి, కుల నిర్మూలనకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తోట శ్రీనివాసరావు, దేసు సత్యనారాయణ, మోతే శేషగిరి, కామేపల్లి వెంకటేశ్వర్లు, జితేంద్ర గుప్తా, మల్లాల లక్ష్మణ్, సురేష్ జైన్, శ్రీనివాసరావు, బాబురావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతి కమిటీ స్కూల్లో రెడ్ కలర్స్ డే వేడుకలు

గుంటూరు(విద్య),నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో ఉండే రంగుల విశేషాలను విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతో ఉందని శ్రీ సరస్వతి కమిటీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల కార్యదర్శి డీవీ సుబ్బారావు అన్నారు. మంగళగిరి రోడ్డులోని సీతారామనగర్‌లో ఉన్న శ్రీ సరస్వతి కమిటీ పాఠశాలలో శుక్రవారం రెడ్ కలర్స్ డే వేడుకల ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాఠశాల కార్యదర్శి డివి సుబ్బారావు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు రంగుల విశిష్టతను, ప్రాముఖ్యతను తెలియజేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఎం.వరలక్ష్మి, డి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు వి.మానసవీణ, ఉపాధ్యాయులు అరుణకుమారి, సంగీత, నాగ మేరీ, జయరాం తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

గుంటూరు(తూర్పు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాసాంతపు తనిఖీల్లో భాగంగా ఆర్డీవో కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోడౌన్‌ను శుక్రవారం డీఆర్వో ఖాజావలీ తనిఖీ చేశారు. గోడౌన్‌కు ఉన్న తాళాలు, అగ్నిమాపక పరికరాలు, ఇతర ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. గోడౌన్ వద్ద పటిష్ట బందోబస్తు ఉండాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి సెక్షన్ సూపరింటెండెంట్ మల్లీశ్వరీ, పశ్చిమ తహసీల్దారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఫిరంగిపురం, రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌ను ఆర్డీవో కే.శ్రీనివాసరావు తనిఖీ చేశారు.


ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేస్తున్న డీఆర్వో ఖాజావలీ

పెంచిన ఫిట్‌నెస్ చార్జీల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భారీగా పెంచిన వాహన ఫిట్‌నెస్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. స్థానిక పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఫిట్నెస్ చార్జీలను పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం అన్యాయమన్నారు. ముఖ్యంగా పదేళ్లు దాటిన వాహనాలపై చార్జీలను గతంలో కంటే మూడు రెట్లుకు పైగా పెంచారని, దీంతో వాహన యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బి.లక్ష్మణరావు, మస్తాన్‌వలి, జి.శంకరరావు, టి.శ్రీరాములు, కే.కుమార్, మహేంద్ర, రవి, మరియబాబు, సలాం, శ్రీకాంత్, గోపి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

నేడు దివ్యాంగుల క్రీడా పోటీలు

గుంటూరు(క్రీడలు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి.దుర్గా భాయి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, "సామాజిక పురోగతికి వికలాంగులకు సమగ్ర సమాజం నిర్మాణం" అనే థీమ్‌తో డిసెంబరు 3వ తేదీన దివ్యాంగుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే జిల్లాలో పనిచేస్తున్న అన్ని శాఖల దివ్యంగ ఉద్యోగులకు ఆన్ డ్యూటీగా పరిగణిస్తూ అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు


ప్రవచనం చేస్తున్న సువీరానందస్వామి

గుంటూరు(తూర్పు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో జరుగుతున్న శ్రీమద్భగవద్గీత అష్టాదశ అధ్యాయంలోని మోక్షసన్యాసయోగం ఆధ్యాత్మిక ప్రవచనాలు శుక్రవారంతో ముగిసాయి. చివరి రోజు కార్యక్రమాన్ని ఆలయ పాలకమండలి వారు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిన్మయమిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచనం చేస్తూ శ్రీమద్భవద్గీత ఇతివృత్తం, కురుక్షేత్ర యుద్ధం మధ్యలో అర్జునుడికి కృష్ణుడు బోధించిన జ్ఞానమన్నారు. ప్రవచనం ముగింపు సందర్భంగా దేవాలయ పాలకమండలి వారు సువీరానందస్వామిని ఘనంగా సత్కరించారు.


వైద్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్న చిత్రం

వైద్యుల అయ్యప్ప పడిపూజ

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వైద్యుల ఆధ్వర్యంలో లక్ష్మీపురంలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్డియాలజిస్టు డాక్టర్ ఆర్.మురళీ బాబురావు, సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బీవీ సుధీర్ బాబు, స్పైన్, ఆర్థో నిపుణుడు డాక్టర్ వంశీకృష్ణ మరికొంతమంది వైద్యులు పాల్గొన్నారు. అయ్యప్పకు 9 రకాల అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఏ శ్రీనివాసన్ నాయర్ గురుస్వామి నేతత్వంలో పడి పూజలు జరిగాయి. సంతోష్ స్వామి తమ బృందంతో నిర్వహించిన భజన కార్యక్రమం అయ్యప్ప భక్తులను తన్మయత్వంలో ముంచెత్తింది. ఈ కార్యక్రమంలో ప్రైవేటు ల్యాబ్స్ సంఘం నేత ఆనం సంజీవరెడ్డి, బాలబాణి, డాక్టర్ ఆనం గోపాల్ రెడ్డి, డాక్టర్ నర్మదా సాయి లక్ష్మిరెడ్డి, ఆర్.అంకమ్మ రెడ్డి, వంగ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు తదితరులు

జేవీవీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

గుంటూరు (విద్య) నంబరు 28 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించనట్లు రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణ్ రావు వెల్లడించారు యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం పోస్టర్స్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు డిసెంబర్ 7వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు మారిన సిలబస్, బోధనలో మెరుగైన నైపుణ్యాలు పెంపొందించేలా శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు కార్యక్రమంలో జేవీవీ నాయకులు బి.ప్రసాద్, టిఆర్ రమేష్, ఎస్ఎం సుభాని గురవయ్య, బి.అనిల్ కుమార్, వెన్నా రెహమాన్, శివ పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య భద్రతకు పెద్దపీట

● ఎమ్మెల్యే గళ్లా మాధవి
● 'సఖి రక్ష- సఖి సురక్ష' కార్యక్రమం ప్రారంభం

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యం కోసం, ప్రతి డ్వాక్రా మహిళ ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలోని చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'సఖి రక్ష- సఖి సురక్ష' కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో 35 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు, 55 ఏళ్ళు పైన వయసున్న మహిళలకు ప్రత్యేకంగా, మూడు రోజుల పాటు విస్తృత స్థాయి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కింద ప్రతి మహిళకు 5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. డ్వాక్రా మహిళల స్వయం సాధికారత కోసం ఈ పథకం మరో భారీ అడుగుగా నిలుస్తుందని, ప్రతిరోజూ కనీసం 600 మందికి పరీక్షలు, వైద్యం అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఒక సంవత్సరం పాటు కొనసాగుతుందని చెప్పారు.


'సఖి రక్ష- సఖి సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ఆర్థిక చోదక శక్తిగా సీఎం చంద్రబాబు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ఆర్థిక చోదకశక్తిగా నిలుస్తున్నారని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పాత గుంటూరుకు చెందిన బంకా మహాలక్ష్మికి రూ.3,02,316 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే నసీర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అమరావతి రాజధానికి ఆర్థిక మణిహారంగా బ్యాంకింగ్ రంగం నిలవబోతుందని చెప్పారు. అమరావతి రాజధానిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. సీఐఐ సమ్మిట్‌లో 46 కంపెనీలు రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చా యని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అమరావతి రాజధాని దేశానికే రోల్ మోడల్‌గా మారబోతుందని అన్నారు. ఇప్పటి వరకు తూర్పు నియోజకవర్గంలో రూ.6.50 కోట్లకుపైగా సీఎంఆర్ఎఫ్ నిధులు అందించామని తెలిపారు. నిరుపేదలకు ఏ సమస్య వచ్చినా తమ కార్యాలయంలో సంప్రదించాలని ఎమ్మెల్యే నసీర్ సూచించారు.

పిల్లల సభను చూసైనా జగన్ అసెంబ్లీకి రావాలి : కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిల్లలు నిర్వహించిన సభను చూసైనా జగన్ రెడ్డి అసెంబ్లీకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీపై గోబెల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శలు చేయటం సిగ్గుచేటని విమర్శించారు. సభలో వెన్నుపోటు గురించి చర్చిస్తే బాగుండేదని అంబటి వ్యంగ్యంగా మాట్లాడటం అవివేకమని, తల్లి, చెల్లెళ్లను తరిమేయటమే కాక సొంత బాబాయిని తమ్ముళ్ల చేత అతి కిరాతకంగా చంపించిన జగన్ రెడ్డి చరిత్ర గురించి కూడా చర్చిస్తే ఇంకా బాగుండేదని కనపర్తి ఎద్దేవా చేశారు. లక్షల కోట్లు దోచుకొని 16 నెలలు జైల్లో చిప్పకూడుతిన్న నాయకుడెవరో చెప్పండని క్విజ్ పోటీ పెడితే, పిల్లలు పోటీ పడి బహుమతులు గెలుచుకునేవారన్నారు. తనను దత్తపుత్రుడని ఎవరైనా అంటే చెప్పుతో కొడతానని పవన్ కల్యాణ్ పదే పదే హెచ్చరించినా అంబటికి బుద్దిరాలేదని మండిపడ్డారు. అంబటి జీవితం ఆ పార్టీలో పిట్టలదొరలా ముగిసిపోవాల్సిందేనని కనపర్తి జోస్యం చెప్పారు.

పోలీసు సిబ్బంది కుటుంబాలకు కార్పస్ ఫండ్

● జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు కార్పస్ ఫండ్ ఆర్థిక చేయూతనిస్తుందని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఈ మేరకు మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు శుక్రవారం ఆయన కార్పస్ ఫండ్ చెక్కులు అందించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన హెడ్‌కానిస్టేబుల్ ఇంద్రరావు, తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్ఐ ఎల్. రవీంద్రబాబు అనారోగ్య కారణాల వల్ల ఇటీవల మరణించారు. ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున కార్పస్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆయా కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏఓ వెంకటేశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 110 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఎస్‌బి సీఐ అళహరి శ్రీనివాస్ పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ సీఐ మార్గదర్శకత్వంలో 26న సాయంత్రం లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరు రోడ్డు మేనకా గాంధీ నగర్ ప్రాంతంలోని ఒక ఇంటి ప్రథమ అంతస్తులో లిక్విడ్ గంజాయి నిల్వ చేసి, విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం టాస్క్ ఫోర్స్ బృందానికి అందింది. దీంతో టాస్క్ ఫోర్స్ సిబ్బంది లాలాపేట పోలీస్‌స్టేషన్ సిబ్బందితో కలిసి అక్కడ దాడి నిర్వహించి, దాది షణ్ముఖ (21) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 110 గ్రాముల లిక్విడ్ గంజాయి సీజ్ చేశారు. స్వాధీనం చేసిన గంజాయి మొత్తం విలువ సుమారు రూ.49,500 ఉంటుందని సీఐ తెలిపారు. లాలాపేట సీఐ శివప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు పంపించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్ర వ్యాల వినియోగం, విక్రయం, రవాణా, సరఫరా వంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఏ ఒక్కరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

రేపు జిల్లా స్థాయి వెటర్న్ క్రీడా పోటీలు

గుంటూరు(తూర్పు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి వెటర్న్ క్రీడల పోటీలను నిర్వహిస్తున్నట్లు వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. 30 నుంచి 90 సంవత్సరాల వయసు మధ్య మహిళలకు, పురుషులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాకింగ్, త్రో, రన్నింగ్, జంపింగ్, ఇతర విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 90009 79056, 99495 26697 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విత్తనాభివృద్ధిలో వినూత్న ఒరవడి

● పాడి నుంచి పంటల సాగుపై దృష్టిసారించిన సంగం డెయిరీ.. ● నూతన ఆవిష్కరణలతో మార్కెట్‌లోకి విత్తనాలు..

పొన్నూరు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా వెలుగొందుతున్న సంగం డెయిరీ.. విత్తనాభివృద్ధిపై దృష్టిసారించింది. పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార దిశగా పరిశోధనలు మొదలు పెట్టింది. రైతులకు అవసరమైన, అధిక దిగుబడులిచ్చే.. చీడపీడలు సమర్థంగా తట్టుకునే విత్తనాలను అభివృద్ధి చేస్తూ.. మార్కెట్‌లోకి ప్రవేశ పెడుతోంది. సాగును లాభసాటిగా మార్చే ప్రక్రియలో.. సంగం సీడ్ ప్రాజెక్టును ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ 2021లో ప్రారంభించి.. అనతి కాలంలోనే అనేక పరిశోధనలతో వరి, అపరాల విత్తనాల్లో మేలైన రకాలను రైతులకు అందజేస్తున్నారు. విత్తన రంగంలో జీవితకాలం వివిధ ప్రయోగాలు, పరిశోధనలు జరిపి విజయవంతమైన ప్రముఖ విత్తన శాస్త్రవేత్త డాక్టర్ ఆలపాటి సత్యనారాయణను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఈ ప్రాజెక్టుకు నియమించారు. ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆశయాలకు అనుగుణంగా డాక్టర్ సత్యనారాయణ వరి, మినుము, పెసర, చిక్కుడు, టమోటో, బెండ వంటి హైబ్రీడ్ విత్తనాలను అభివృద్ధి చేసి రైతులకు అందించడం ప్రారంభించారు. 53 ఏళ్ల అనుభవంలో ఆయన ఇప్పటి వరకు 109 రకాల విత్తనాలను అభివృద్ధి చేశారు.

అపరాల అభివృద్ధి

కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీలో రెండవ పంటగా అపరాల పంటలైన మినుము, పెసర పైర్లను రైతులు అధికంగా సాగు చేస్తుంటారు. సంగం సీడ్ ప్రాజెక్ట్‌లో మినుము, పెసర విత్తనాలను సైతం అభివృద్ధి చేశారు. రైతులు ఎక్కువగా కోరుకునే పాలిష్ రకం మినుములు, ఎస్ఎస్‌బీ-2 అలాగే సాధా రకం ఎస్ఎస్‌బీ-1 అభివృద్ధి చేసి రైతులకు అందిస్తున్నారు. ఈ రకం మినుము పల్లాకు తెగులను సమర్థంగా తట్టుకొనే ప్రత్యేక రోగ నిరోధక శక్తిని కలిగి ఉంటుంది. గతేడాది ఎస్ఎస్‌బీ-2 రకం సాగు చేసిన రైతులు అత్యధికంగా 13.25 క్వింటాళ్ల దిగుబడి పొందారు. పెసర విత్తనాలు ఎస్ఎస్ జీ-3 బీమ్ రకం అభివృద్ధి చేశారు. ఈ రకం గింజ లావుగాను, అధిక బరువుతో దిగుబడి ఇచ్చే విధంగా అభివృద్ధి చేశారు. ఈ విత్తనాలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. చిక్కుడు సాగు చేసే రైతుల కోసం ఎస్ఎస్‌డీబీ-1 చెట్టు చిక్కుడు రకాన్ని అభివృద్ధి చేశారు. మిరప, బెండ, మొక్కజొన్న వంటి అనేక రకాల కూరగాయలు విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సంగం సీడ్స్ ప్రాజెక్టు నిరంతరం పనిచేస్తుంది.

రుద్ర టమోటాకు డిమాండ్



సంగం సీడ్ ప్రాజెక్టు రూపొందించిన రుద్ర టమోటా హైబ్రీడ్ విత్తనాలకు అత్యధిక డిమాండ్ ఉంది. చిత్తూరు, మదనపల్లి, కుప్పం వంటి ప్రాంతాల్లోనే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోనూ టమోటాను అధికంగా పండిస్తారు. రుద్ర టమోటా విత్తనం చీడపీడలను తట్టుకొని, అత్యధిక రోజులు నిల్వ ఉండే సామర్థ్యంతో.. ఆకర్షణీయమైన రంగుతో అధిక దిగుబడులు ఇస్తుండటంతో డిమాండ్ ఉంది. గతేడాది టమోటా పంటను కాయ కుళ్ళు తెలుగుల ఆశించి రైతులను నష్టపరిస్తే.. రుద్ర పంట మాత్రం తెగుళ్ల సమర్థంగా తట్టుకుంది. రైతులకు అధిక దిగుబడులు ఇచ్చి లాభాలను చూపింది. ఎకరాకు 80 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. చిత్తూరు జిల్లాతో పాటు రాయలసీమ ప్రాంతంలో కూడా ఈ రకం అధికంగా సాగవుతోంది.

రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యం



రైతులు పాడి పరిశ్రమతో పాటు వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించే లక్ష్యంతో నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సంగం సీడ్ ప్రాజెక్టును ప్రారంభించాం. అనతి కాలంలోనే రైతుల ఆదరాభిమానాలు చూరగొనడం హర్షణీయం.

- ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, ఛైర్మన్ సంగం డెయిరీ

అధిక దిగుబడులు



చీడపీడలు తట్టుకుని అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను అందించడమే సంగం సీడ్ ప్రాజెక్టు లక్ష్యం. విత్తన రంగంలో 53 ఏళ్ల అనుభవంతో రైతులకు లాభాలు ఇచ్చే విత్తనాలను అందిస్తున్నాం. ఇప్పటికే డెల్టా ప్రాంతంలో సంగం సీడ్ ప్రాజెక్టు రూపొందించిన వరి విత్తనాలు రైతుల ఆదరాభిమానాలు పొందుతున్నాయి. ఇటీవల తుఫానును సైతం తట్టుకొని.. అధిక దిగుబడులు ఇచ్చే అవకాశం ఉంది.

- డాక్టర్ సత్యనారాయణ, శాస్త్రవేత్త

వరిలో దిగుబడి విప్లవం



సంగం సీడ్ ప్రాజెక్టు రూపొందించిన ఎస్ఎస్ఆర్-2, ఎస్ఎస్ఆర్-4 వరి విత్తనాలు రైతుల మన్ననలు పొందుతున్నాయి. ఎస్ఎస్ఆర్-2 రకం పంట 135 రోజుల్లో చేతికి వస్తుంది. కంకి పెద్దదిగాను, గింజ నాణ్యతతోను, బీపీటీలను పోలి ఉంటుంది. అంతేకాకుండా చీడపీడలను, పురుగులను సమర్థంగా తట్టుకొని రైతులకు తక్కువ పెట్టుబడితో పంట చేతికి వస్తుంది. ఈ రకం ధాన్యంలో గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్న వారు కూడా తినవచ్చు.

● ఎస్ఎస్ఆర్-4 రకం పంట 140 రోజుల వ్యవధిలో చేతికి వస్తుంది. కంకి పెద్దదిగాను, దృఢమైన పిలకలు, దుబ్బుతో ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకొని నిలబడుతుంది. కింకిలో 400 గింజలు ఏర్పడటం దీని ప్రత్యేకత. ఒక్కో దుబ్బులో 25 పిలకలు ఉండి.. అధిక దిగుబడి వచ్చేలా ఈ విత్తనం అభివృద్ధి చేశారు. డెల్టా ప్రాంతంలో ఈ రెండు రకాల వరి విత్తనాలను రైతులు సాగు చేసి.. ఈ ఏడాది ఖరీఫ్‌లో 45 నుంచి 50 బస్తాల దిగుబడి సాధిస్తామని చెబుతున్నారు.

'బర్లీ'.. బంద్

(5వ పేజీ తరువాయి)

పొగాకు కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ చేపట్టినప్పుడు రైతుల్లో హర్షం వ్యక్తమైంది. కానీ అంకం ముగింపుకొచ్చేసరికి సేకరణ ప్రక్రియపై బర్లీ రైతుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో పెండింగ్ బకాయిలతో సహా నాలుగు జిల్లాల పరిధిలో మొత్తం రూ.150 కోట్ల వరకు బర్లీ రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. బకాయి ఉన్న రూ.38 కోట్లను గురువారం బర్లీ రైతుల ఖాతాల్లో జమ చేశామని, బర్లీ పొగాకు కొనుగోళ్లలో మార్క్‌ఫెడ్ పాత్ర దాదాపుగా ముగిసిందనే స్పష్టతను అధికారులు ఇచ్చారు.

గిడ్డంగుల ఖాళీపై దృష్టి..

ఖరీఫ్ ధాన్యం దిగుబడులు పెద్దఎత్తున వస్తుండడంతో గోడౌన్లలో నిల్వ ఉన్న బర్లీ పొగాకును ఖాళీ చేయించడంపై మార్క్‌ఫెడ్ దృష్టి పెట్టింది. నాలుగు జిల్లాల పరిధిలో ఉన్న ఏఎంసీ గోడౌన్‌లతో పాటు వేర్‌హౌసింగ్ గోదాములను కూడా బర్లీ నిల్వల కోసం మార్క్‌ఫెడ్ తీసుకున్న విషయం తెలిసిందే. బాపట్ల జిల్లాలో 66 ఏఎంసీ గోదాములు ఉండగా, 18 చోట్ల బర్లీ నిల్వలే ఉన్నాయి. గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 12 చోట్ల బర్లీ నిల్వలను ఉంచారు. ధాన్యం దిగుబడులు మరో వారం రోజుల్లో ఊపందుకోనున్నాయి. ఆ సమయానికే గోడౌన్లను ఖాళీ చేయించడంపై యంత్రాం గం దృష్టి సారించింది. బర్లీ పొగాకును ప్రొసెసింగ్ ప్రక్రియ కోసం టెండర్లను ఆహ్వానించాలనే నిర్ణయానికి మార్క్‌ఫెడ్ వచ్చింది.

మూఢం..శుభకార్యాలకు విరామం

(5వ పేజీ తరువాయి)

మాఘంలోనూ ఒక్క మూహూర్తం లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథ సప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘిగా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులు ఈసారి మూఢంలోనే కలిసిపోతాయి.

మూఢం అంటే

జ్యోతిష శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి.. వాడుక భాషలో మూఢమి(చీకటి) అంటారు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడుతాయని జ్యోతిషులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభ సూచికం కాదని సూచిస్తున్నారు.

వ్యాపారులపై ప్రభావం

శుభకార్యాలు లేకపోతే.. వివాహ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, వస్త్ర, ఆభరణాల దుకాణాలు, స్వర్ణకారులు, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూల దుకాణాలు, లైటింగ్, డీజేలు, అద్దె కార్లు, బస్సులు, సన్నాయి మేళం ఇలా సంబంధిత వర్గాలు నెలల కొద్ది నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 581.60 అడుగులు ఉంది. ఇది 287.62 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3972 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 15,272 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 15,272 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

కార్తికం తర్వాత తగ్గిన బంతిపూల కాంతి

● కేజీ రూ.70 నుంచి రూ.30కి ధర పతనం
● లాభాలు లేవంటున్న రైతులు



నరసరావుపేట మండలం ఇసప్పాలెం గ్రామంలో బంతిపూలతోట

నరసరావుపేట రూరల్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): కార్తిక మాసం కాంతులు తగ్గగానే మార్కెట్లో రోజుకో రకంగా బంతిపూల ధర మారిపోతూ వస్తోంది. కార్తిక మాసంలో కిలో రూ.70 నుంచి రూ.80 వరకు ధర పలికింది. ప్రస్తుతం రూ.30 నుంచి రూ.40 కంటే ఎక్కువ ధర పలకడం లేదు. కార్తికం తర్వాత కాంతినివ్వని బంతిపూల కారణంగా రైతు మోమున కళ తప్పింది. నరసరావుపేట మండలంలోని ఇసప్పాలెం, నరసరావుపేట, గురవాయపాలెం, ములకలూరు, అగ్రహారం, జొన్నలగడ్డ తదితర గ్రామాల్లో పలువురు రైతులు బంతిపూల సాగు చేశారు. వాణిజ్య పంటల్లో స్తోమతకు మించి పెట్టుబడులు పెట్టి ఇబ్బంది పడేకన్నా.. పూల సాగులో తక్కువ పెట్టుబడితో ఎంతైనా పర్వా లేదు లాభం దక్కుతుందనే ఆశ పలువురు రైతులను బంతిసాగు వైపునకు మళ్లించింది. పెట్టుబడి తక్కువే అయినా తీరా అమ్మకం మొదలయ్యాక ధరల హెచ్చు తగ్గుల కారణంగా ఆశించిన ఫలితం రాదని పలువురు రైతులు చెప్తున్నారు. కార్తిక మాసంలో క్వింటాల్ రూ.6 వేల వరకు వెళ్లినా రూ.5 వేలకు తగ్గకుండా బంతి అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం కొంత మంది అయ్యప్పలు దీక్ష విరమణకు శబరిమలకు తరలి వెళ్లడంతో బంతిపూలకు కొంతమేర డిమాండ్ తగ్గింది. ఇసప్పాలెం గ్రామానికి చెందిన ఒక రైతు కేవలం 50 సెంట్ల పొలంలో బంతిసాగు చేసి 5 టన్నుల పూలు అమ్మినట్లు చెప్తున్నారు. కార్తీకం తరువాత పూసిన పూలకు మాత్రం ఇప్పుడు క్వింటా రూ.3 వేలకు (కిలో రూ.30) దిగజారిపోయింది. బంతి సాగులో ధరల దోబూచులాట కారణంగా ఆశించిన లాభాలు రావడం లేదని రైతులు చర్చించుకుం టున్నారు.

అర ఎకరాలో బంతి సాగు



కొన్నేళ్లుగా వాణిజ్య పంటలకు స్వస్తి పలికి బంతిపూల తోటను అర ఎకరం పొలంలో సాగు చేశాను. ఇప్పవరకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. నెల రోజులుగా బంతిపూలు కోతకు వస్తున్నాయి. ఇప్పటి వరకు పెట్టుబడి వచ్చేసింది. మరో నెల రోజుల పాటు పూలు కోతకు వస్తాయి. ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. కేజీ పూల కోతకు రూ.10 కూలి అవుతోంది.

- అల్లూరి కోటేశ్వరరావు, రైతు

ఎస్సీ లంక భూముల రైతులకు రిజిస్ట్రేషన్లు

తుళ్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా బోరుపాలెం, రాయపూడి పెద లంక, పూర్ణయ లంక, ఉద్దండ్రాయునిపాలెం, వెంకటపాలెం, మందడం లంక భూములకు సంబంధించిన అసైన్డ్ ల్యాండ్ భూములకు కేటాయించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ల పక్రియ ప్రారంభమయినట్టు మంత్రి నారాయణ చెప్పారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో లంక అసైన్డ్ ల్యాండ్‌ను పెండింగ్‌లో పెట్టారని దానిని కూటమి ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. లంక భూముల సమస్యలను పరిష్కరించమని రైతులు కోరిన మీదట సీఎం ప్రత్యేక దృష్టి సారించటంతో విషయం కొలిక్కి వచ్చిందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

ఆర్థిక నగరానికి.. అంకురార్పణ

(5వ పేజీ తరువాయి)

ప్రాంతీయ బ్యాంకు కార్యాలయాల శిలాఫలకాలు, 2 ఇన్స్యూరెన్స్ సంస్థల శిలాఫలకాలను ఆమె శుక్రవారం ఆవిష్కరించారు. తొలుత రాయపూడిలో ఇటీవల ప్రారంభించిన ఏపీసీఆర్డీఏ కార్యాలయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, బ్యాంకు ఉన్నతాధికారులతో కలిసి ఆమె సీఆర్డీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన తొలి పైలాన్‌ను ఆమె ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు మరో పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా బ్యాంకు అధికారులు అక్కడ నిర్మించబోయే భవనాల నమూనాలను వారికి వివరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, పొంగూరి నారాయణ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మంత్రి పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజులు వరుసగా మిగిలిన పైలాన్లను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో కేంద్ర ఆర్థిక మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు ప్రసంగించారు.

రైతులకు అండగా నిలవాలి : చంద్రబాబు

బ్యాంకులు కిసాన్ క్రెడిట్ రుణాలు ఇస్తే చాలదని, భూములిచ్చిన రైతుల త్యాగాలను గుర్తించి తగు రీతిలో వారికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి కోరారు. ఐదేళ్ల తమకు అన్ని విధాలా తోడ్పాటు ఇవ్వాలని, ఆ తర్వాత దేశ ఆర్థిక ప్రగతిలో ప్రధాన భూమిక పోషిస్తామని నిర్మలా సీతారామన్‌ను కోరారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్ర పునర్నిర్మాణానికి, అమరావతి అభివృద్ధికి అన్నివిధాలుగా తోడ్పాటు అందిస్తున్న కేంద్రం బ్యాంకు స్ట్రీట్ నిర్మాణంతో ఆర్థిక ప్రగతికి పునాదులు పడ్డాయన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, సీఆర్డీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వే పూర్తయినా.. పాట్లు తప్పడం లేదు!

● సుమోటో కరెక్షన్స్‌లో నెలల తరబడి జాప్యం ● తహసీల్దార్ల ప్రతిపాదనలు ● కలెక్టరేట్‌లో నో క్లియరెన్స్
● లాక్ అవుతున్న ఎల్‌పీ నంబర్లు ● అడంగల్‌కు దరఖాస్తు చేసుకోలేక రైతుల ఇబ్బందులు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూముల రీ-సర్వే పూర్తి అయిన గ్రామాల్లో సుమోటో కరెక్షన్స్(ల్యాండ్ పార్సిల్ మ్యాప్) జరగడం లేదు. దీని వలన రైతులు అనేక సమస్యలను జిల్లాలో ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భూమి లే అవుట్ పర్మిషన్(ఎల్‌పీ) నంబరు మీ భూమి ఆన్‌లైన్ పోర్టల్‌లో లాక్ అయి ఉంటోంది. ఈ కారణంగా అడంగల్ కోసం కనీసం దరఖాస్తు కూడా చేసుకోలేని దుస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని సంబంధిత రైతులు పలుమార్లు తహసీల్దార్లు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి సమస్యని పరిష్కరించడంలో జాప్యం జరుగుతోంది. గత కొన్ని నెలల నుంచి రెవెన్యూకి సంబంధించిన అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష జరగకపోవడంతో ఇలాంటి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో సంతృప్తి శాతం తెలుసుకొనేందుకు ప్రభుత్వం నిర్వహిస్తోన్న ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌లో రైతులు అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు.

సర్వే తీరు ఇలా..

జిల్లాలోని 17 మండలాల్లో నెట్ ఏరియా 1882.05 చదరపు కిలోమీటర్లు ఉంది. మొత్తం 212 గ్రామాలకు గాను, 62 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. 101 గ్రామాల్లో సర్వే కొనసాగుతుండగా 49 గ్రామాల్లో అసలు సర్వేనే ప్రారంభించ లేదు. అర్బన్, అటవీ భూముల్లో రీ-సర్వే మొదలు కాలేదు. ఏ ఒక్క మండలంలోనూ అన్ని గ్రామాల సర్వేని పూర్తి చేయలేదు. రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో నైసర్గిక విస్తీర్ణం ప్రకారం ఫైనల్ ఆర్‌వోఆర్‌ని కూడా ప్రకటించారు. అయితే చాలా గ్రామాల్లో డీఎల్ఆర్, నైసర్గిక విస్తీర్ణాలతో ఎల్‌పీ నంబర్ల విస్తీర్ణం మధ్య వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు పెదనందిపాడు మండలంలోని అనపర్రు గ్రామమే తీసుకొంటే మొత్తం 25 ఎల్‌పీ నంబర్లలో ఈ వ్యత్యాసం కనిపించింది. ఎస్ఎఫ్ఈ(షేప్ ఫైల్ ఎక్స్‌టెంట్), డీఎల్ఆర్, ఫైనల్ ఆర్‌వోఆర్ విస్తీర్ణాలు ఒకలా ఉంటే భూనక్ష ఎల్‌పీఎం విస్తీర్ణం మరోలా ఉంది. దీని వల్ల రైతులు అడంగల్ కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఇందుకు కారణం వాళ్ల ఎల్‌పీ నంబరు ఆన్‌లైన్‌లో లాక్ అయి ఉండడం.. దీంతో కొన్ని మండలాల తహసీల్దార్లు డీఎల్ఆర్ విస్తీర్ణంలో సవరణల కోసం ప్రతిపాదనలను ఆర్‌డీవో/సబ్ కలెక్టర్ ద్వారా కలెక్టరేట్‌కు పంపించారు.

అడంగల్ పొందలేక..

ఈ ప్రతిపాదనలకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో లాక్ అయిన ఎల్‌పీఎం నంబర్లు, మండల, గ్రామ సర్వేయర్ల రిపోర్టులు, ఇతరత్రా పత్రాలను కూడా నివేదించారు. అయితే కలెక్టరేట్‌లో నెలల తరబడి వీటిని క్లియర్ చేయడంలో జాప్యం జరుగుతోంది. వీటికి సంబంధించి సర్వే ఏడీ, ఆర్‌డీవో/సబ్ కలెక్టర్ రిమార్కులను పొందుపరచాల్సి ఉంది. అప్పుడే జాయింట్ కలెక్టర్ వద్ద ఫైల్ క్లియర్ అయి సుమోటో కరెక్షన్స్ వెబ్ ల్యాండ్‌లో జరుగుతాయి. నెలల తరబడి కలెక్టరేట్‌లో ఫైళ్లు పెండింగ్‌లో ఉండటంతో సుమోటో కరెక్షన్స్ జరగని రైతులు అడంగల్ పొందలేక అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు కూడా తీసుకోలేని పరిస్థితి. అలానే భూములు విక్రయించుకోవాలన్నా కుదరడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ రెవెన్యూకి సంబంధించిన సమస్యలపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతోన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతం..ఆర్థిక అంతరాలకు పరిష్కారం

● ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ ఆచార్య నన్నపనేని

బాపట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజు రోజుకు పెరుగుతున్న ఆర్థిక అంతరాల తగ్గింపునకు సహకార వ్యవస్థ బలోపేతమే పరిష్కార మార్గమని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ ఆచార్య నన్నపనేని అంజయ్య అన్నారు. బ్యాంక్ బాపట్ల బ్రాంచ్, ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025.. సదస్సును శుక్రవారం బాపట్ల డాక్టర్ ఎన్టీఆర్ కాలేజి ఆఫ్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ ఆడిటోరియం నందు అసోసియేట్‌డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అచార్య నన్నపనేని అంజయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 13 ఏళ్ళల్లో రెండోవసారి సహకార సంస్థగా ప్రకటించడం సహకార వ్యవస్థ ప్రధాన్యతను మరింత విస్తృత చేస్తుందన్నారు. బ్రాంచ్ ఇన్‌చార్జి డైరెక్టర్, బ్యాంక్ చార్టెడ్ అకౌంట్ పి.వెంకటమల్లికార్జునరావు మాట్లాడుతూ విశాఖ నగరంలో 1916 ఫిబ్రవరి 5వ తేదిన కార్యక్రమాలు ప్రారంభించిన బ్యాంక్ నేడు తెలుగు రాష్ట్రాలలో 57 బ్రాంచ్‌ల ద్వారా బహుళ రాష్ట్రాల అర్బన్ బ్యాంక్‌గా ప్రజలకు సేవలందిస్తుందని తెలిపారు. అనంతరం భారత అర్థిక వ్యవస్థలో సహకార సంఘాల పాత్ర, సమాజంలో సహకార సంఘాలపాత్ర అనే రెండు అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి.. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్ అంజయ్య

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

● ఏఎన్‌యూలో పూలేకు ఘన నివాళి

ఏఎన్‌యూ, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని పూలే అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఆచార్య ఎం.త్రిమూర్తిరావు ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్థంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య గంగాధరరావు, రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్, ప్రిన్సిపాళ్లు సురేష్‌కుమార్, వీరయ్య, సమన్వయకర్త త్రిమూర్తిరావు స్థానిక పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వీసీ గంగాధరరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే ఎంతో కృషి చేశారన్నారు. నేటి యువత పూలే మార్గంలో పయనించాలని కోరారు. రెక్టార్ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ పూలే సేవలు ఏనలేనివన్నారు. సమన్వయకర్త త్రిమూర్తిరావు మాట్లాడుతూ పూలే కేంద్రం ఆధ్వర్యంలో పలు సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తూ ఆయన ఆశయాలను సమాజంలోకి తీసుకెళుతు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ, రెక్టార్

మాదక ద్రవ్యాల నివారణ పోరులో..భాగమవుతాం

● ఏఎన్‌యూ సీఎస్ఆర్ డైరెక్టర్ భవిత

ఏఎన్‌యూ నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ డైరెక్టర్ డాక్టర్ బి. భవిత ఆధ్వర్యంలో మంగళగిరిలోని 6వ బెటాలియన్ కమాండెంట్ ఆఫీసులో.. ఈగల్ టీం ఎస్పీ కె.నగేష్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా డాక్టర్ భవిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యువతను మాదక ద్రవ్యాల మహమ్మారి నుంచి బయటకు తెచ్చేందుకు చేస్తున్న కృషిలో భాగమవుతామని చెప్పారు. వర్సిటీ ఉన్నతాధికారుల సూచనలతో వివిధ కళాశాలలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి ఈగల్ టీంకు, ప్రభుత్వానికి.. సీఎస్ఆర్ ద్వారా తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఎస్పీ నగేష్ స్పందిస్తూ.. సమాజంలో నెలకొన్న మాదక ద్రవ్యాల నియంత్రణకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో సంయుక్తంగా కార్యక్రమాల నిర్వహణకు తమ సిబ్బందికి సూచనలు చేస్తామని చెప్పారు. సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, ఫైన్ ఆర్ట్స్ విభాగపు కో-ఆర్డినేటర్ పి.దేవకాంత్, ఈగల్ టీం గుంటూరు ఎస్ఐ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ నగేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎస్ఆర్ బృందం

వేర్వేరు ప్రాంతాల మధ్య 41 ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు ఆయా ప్రాంతాలకు 41 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. డిసెంబరు 1 నుంచి 2026 మార్చి 30 వరకు (సోమ)చర్లపల్లి - షాలిమార్(07225) 18 ట్రిప్పులు, డిసెంబర్ 2నుంచి 2026 మార్చి31 వరకు(మంగళ) షాలిమార్-చర్లపల్లి(07226) 18 ట్రిప్పులు,డిసెంబర్2 నుంచి 9వరకు (మంగళ) రామేశ్వరం-తిరుపతి (06080) 2ట్రిప్పులు. డిసెంబర్3నుంచి 10వరకు (బుధ) తిరుపతి - రామేశ్వరం (06079) 2ట్రిప్పులు, నవంబర్29 శనివారం ఛప్రా-ఎంజీఆర్ చెన్నై (05081) మధ్య ప్రత్యేక రైలు నడుస్తుందని అధికారులు తెలియజేశారు.

విశాఖపట్టణం మార్గంలో కొన్ని రైళ్ల రద్దు

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం మార్గంలో భద్రత, ఆధునికీ కరణ పనుల కారణంగా కొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఈస్టు కోస్టు రైల్వే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. నంబరు. 17239 గుంటూరు - విశాఖపట్టణం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ జనవరి 28వ తేదీ నుంచి 30 వరకు, 17240 విశాఖపట్టణం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ జనవరి 29 నుంచి 31 వరకు, 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ జనవరి 29, 30, 12805 విశాఖ పట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ జనవరి 28, 29 తేదీల్లో రద్దు చేశామని పేర్కొన్నది. అలానే 22707 విశాఖపట్టణం - తిరుపతి ఏసీ డబుల్ డెక్కర్ రైలుని జనవరి 29వ తేదీన, 22708 తిరుపతి - విశాఖపట్టణం డబుల్ డెక్కర్ రైలుని జనవరి 28వ తేదీన, 22876 గుంటూరు - విశాఖపట్టణం, 22875 విశాఖపట్టణం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ లను జనవరి 31వ తేదీన రద్దు చేస్తున్నామని తెలియజేసింది. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని అధికారులు కోరారు.

ఆంధ్రజ్యోతి 9
నవ్య
కుటుంబ కదంబం
శనివారం
29 నవంబరు 2025



వినోదాల్లో వెలిగిపోవాలంటే

విందులు, వినోదాలు మన జీవితంలో భాగాలు. అలాంటి వేడుకలకు హాజరయ్యేటప్పుడు సహజసిద్ధ అందం ఉట్టిపడే మేకప్‌ను ఎంచుకోవాలి. అందుకోసం ఇదిగో ఇలాంటి చిట్కాలు అనుసరించాలి.

మిరుమిట్లు గొలిపే లైట్లకు తగ్గట్టు...

మేకప్ ముందు మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్‌లను అప్లై చేసుకోవాలి. ఈ రెండింటితో చర్మం పొడిబార కుండా ఉండడంతో పాటు, వేడుకల్లో లైట్ల వెలుగుకు కమిలిపోకుండా చర్మానికి రక్షణ దక్కుతుంది.

ఫ్లాష్ వెలుగుల్లో...

వేడుకల్లో తీసే ఫ్లాష్ ఫొటోల్లో ముఖం అవసరానికి మించి వెలిగిపోకుండా ఉండాలంటే, రెండు భిన్నమైన ఫౌండేషన్లు...మ్యాట్, సాఫ్ట్ గ్లోయీ ఫౌండేషన్లను కలిపి అప్లై చేసుకోవాలి. జిడ్డు చర్మమైతే, నుదురు, ముక్కు, చుబుకం మీద మ్యాట్ ఫౌండేషన్, మిగతా ముఖం మొత్తం డ్యూయీ ఫౌండేషన్ అప్లై చేసుకోవాలి. తర్వాత లూజ్ పౌడర్ అద్దుకోవాలి.

బ్లష్ కీలకం

పగటి వేళ వేడుకలకు హాజరయ్యేటప్పుడు ముదురు రంగు బ్లష్‌లకు బదులుగా, సహజసిద్ధంగా కనిపించే న్యాచురల్ లేదా రోజీ బ్లష్ ఎంచుకోవాలి. బుగ్గలతో పాటు, కొద్దిగా ముక్కు, చుబుకం మీద కూడా లైట్‌గా బ్లష్‌ను అద్దుకోవాలి.

ఐ షాడో ఇలా...

ముఖం మొత్తంలో కళ్లు, పెదవులే ఎక్కువగా ఆకట్టుకుంటాయి. కాబట్టి వాటి మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. పగలైనా, రాత్రైనా ముదురు రంగు షాడోలకు దూరంగా ఉండాలి. పేస్టెల్, సాఫ్ట్ మెటాలిక్ ఐ షాడోలనే ఎంచుకోవాలి.

ముడతలు పడకుండా ఉండడం కోసం క్రీమీ షాడోలకు బదులుగా పౌడర్ ఐ షాడోలనే ఎంచుకోవాలి. పౌడర్ ఐ షాడోలు మేకప్‌లో చక్కగా కలిసిపోయి, ఎక్కువ సమయం పాటు నిలిచి ఉంటాయి.

లవ్లీ లిప్‌స్టిక్

ఎరుపు, ప్లమ్, మెరూన్ మొదలైన రంగు లిప్‌స్టిక్స్ వేడుకలకు బాగుంటాయి. అలాగే ఐ షాడోకు మ్యాచ్ అయ్యే లిప్‌స్టిక్ ఎంచుకోవడం మర్చిపోకూడదు. గ్లిట్టర్, పేస్టెల్, మోనోటోన్ రంగు లిప్‌స్టిక్స్ పగటి వేడుకలకు సూటవుతాయి. మెటాలిక్, ముదురు రంగు షేడ్స్ రాత్రి వేడుకలకు మ్యాచ్ అవుతాయి.



ఆకలి బాధలు తట్టుకుంది. అవమానాలను భరించింది. అంధురాలనే వెక్కిరింతలు.. హేళనలకు భయపడి ఆగిపోకుండా ముందడుగు వేసింది. కష్టాలను అధిగమించి, కన్నీళ్లను దిగమింగి తనకు ఆసక్తి ఉన్న క్రికెట్‌ను కెరీర్‌గా మార్చుకుంది. 'అంధురాలివి నీకెందుకు ఆటలు ఒక మూలన కూర్చోక' అని వెక్కిరించిన వాళ్లకు తానేంటో నిరూపించింది. దేశానికి తొలి మహిళల అంధుల వరల్డ్‌కప్‌ను అందించి సామాన్యుల నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వరకు అందరి ప్రశంసలను అందుకుంటున్న భారత జట్టు కెప్టెన్, రాయలసీమ అమ్మాయి దీపిక 'నవ్య'తో పంచుకున్న విశేషాలు.

విజయ దీపిక

"**మా**ది సత్యసాయి జిల్లా, మడకశిరలోని తంబలహట్టి అనే చిన్న గ్రామం. అమ్మ చిట్టమ్మ, నాన్న తిమ్మప్ప వ్యవసాయ కూలీలు. ముగ్గురు సంతానంలో నేను పెద్దమ్మాయిని. నాకు ఇద్దరు తమ్ముళ్లు. మాకు రెండెకరాల భూమి ఉంది కానీ, నీళ్ల సదుపాయం లేక పోవడంతో సాగు చేసే అవకాశం లేక అమ్మనాన్న కూలీలుగా మారారు. నాకు ఐదు నెలలప్పుడు కంటిలో నా చేతి వేలితో పొడుచుకోవడంతో బొబ్బ వచ్చింది. అది తగ్గకపోవడంతో నాన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు చూసి ఇప్పుడు సర్జరీ చేయడం కుదరదు. పదేళ్లు నిండాక శస్త్రచికిత్స చేద్దామని చెప్పారు. నా వయసుతో పాటు కుడి కంటిలో ఆ బొబ్బ కూడా పెరిగి చూపు పోయింది.

బడిలో కలవనిచ్చేవారు కాదు..

బడిలో నన్ను అందరితో పాటు కలవనిచ్చేవారు కాదు. ఆటలు ఆడనిచ్చే వారు కాదు. "గుడ్డిదానివి. పోయి ఒక పక్కన కూర్చో" అనేవారు. ఇంటికి వచ్చి అమ్మకు చెప్పేదాన్ని. "బాధ పడకు. బాగా చదువుకో. దేవుడే నీకు దారి చూపిస్తాడు" అని అమ్మ ఓదార్చేది, ధైర్యం చెప్పేది. మా పొలంలో బోర్లు వేసేందుకు, కూలీ పనులు లేకపోవడంతో కుటుంబాన్ని పోషించేందుకు నాన్న అప్పులు చేశారు. అవి తిరిగి చెల్లించలేకపోవడంతో అప్పు ఇచ్చిన వారు మా ఇంటిపైకి వచ్చి గొడవ చేసేవారు. వారి మాటలు భరించలేక నాన్న పక్క ఊరిలో పగలంతా పని చేసేవారు. రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చి, మాకు తినడానికి రాగులు, బియ్యం ఇచ్చేవారు. మళ్లీ ఆ చీకట్లోనే వెళ్లిపోయే వారు. నాన్న ఇంటికి రాని రోజు మేము పస్తులు ఉండాల్సి వచ్చేది. మా ఊర్లో పండ్ల చెట్లు వెతుక్కొనే వాళ్లం. ఆకలి భరించలేక సగం కుళ్లిన పండ్లు కూడా తినేవాళ్లం. అన్నం వండిన రోజు కూడా సరిపోక నేను, తమ్ముడు కొట్టుకొనేవాళ్లం. సరైన దుస్తులు లేక చిరిగినవి, పాడైనవి వేసుకొనేవాళ్లం. పదేళ్లు నిండాక నాకు ఆపరేషన్ చేయించేందుకు నాన్న రూ.2 లక్షలు అప్పు చేశారు. వైద్యులు సర్జరీ చేసినా చూపు వస్తుందని హామీ ఇవ్వలేమన్నారు. అప్పుడు "ఆపరేషన్ చేయించి డబ్బులు వృధా చేయొద్దు నాన్నా... నాకు ఇలా బతకడం అలవాటు అయిపోయింది" చెప్పా. ఆ మాటలకు నాన్న గుండెలు పగిలేలా రోదించారు. అంత దయనీయమైన జీవితం గడిపిన నాకు క్రికెట్ కొత్త బతుకును ఇచ్చింది.

క్రికెట్ మలుపు తిప్పింది..

కర్ణాటకలోని తుమ్ముకూర్‌లో ఉన్న శివకుమార్ స్వామిజీ స్కూల్‌లో అంధులకు ఉచితంగా చదువు చెబుతారని తెలిసి.. అమ్మా నాన్నా నన్ను అక్కడ చేర్పించారు. స్కూల్‌లో మంచి భోజనం పెట్టి, బాగా చూసుకొనే వారు. అయితే, అన్నం తింటున్నప్పుడల్లా తమ్ముళ్లు ఏం తింటున్నారోనని గుర్తొచ్చి బాగా ఏడ్చేదాన్ని.. స్కూల్‌లో టీచర్ల ప్రోత్సాహంతో పదో తరగతి నుంచి క్రికెట్ ఆడడం ప్రారంభించా. అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌కు అంధ మహిళల జట్టు ఉండేది కాదు. దాంతో కర్ణాటక జట్టు తరఫున ఆడడం ప్రారంభించా.

> ### ప్రధాని తండ్రిలా మాట్లాడారు
>
> **ప్ర**ధాని నరేంద్ర మోదీతో గత గురువారం జరిగిన 45 నిమిషాల ఇష్టాగోష్ఠిలో ఆయన ఒక కుటుంబ పెద్దలా, తండ్రిలా మాట్లాడారు. మా వ్యక్తిగత నేపథ్యాలను, జీవిత విశేషాలను అడిగి తెలుసుకున్నారు. నేను పాటలు బాగా పాడతానని తెలిసి, నన్ను పాడమని అడిగారు. నేను శివుడి భక్తి గీతం ఒకటి పాడి వినిపిస్తే. బాగా పాడావని అభినందించారు. వరల్డ్‌కప్‌లో ఎదురైన సవాళ్ల గురించి, పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో మా ఆట గురించి అడిగి తెలుసుకున్నారు. మా అందరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.
>
> 

2019లో జాతీయ అంధుల క్రికెట్ బోర్డు ఏర్పడిన తర్వాత మాకు ఆడేందుకు ఒక వేదిక దొరికింది. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటడంతో 2023లో జాతీయ జట్టులో స్థానం లభించింది. అదే ఏడాది బర్మింగ్‌హామ్‌లో జరిగిన అంధుల వరల్డ్ గేమ్స్‌లో క్రికెట్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో నేను సభ్యురాలిని. సమర్థానం ట్రస్టు వారి డిగ్రీ కళాశాలలో పరిచయమైన సీనియర్ అన్న మోహన్ నన్ను బాగా ప్రోత్సహించారు. రెండేళ్లు తిరిగేసరికి నా ప్రతిభను గుర్తించి టీమిండియాకు కెప్టెన్ చేశారు. నా సారథ్యంలో భారత జట్టుకు తొలి మహిళల టీ-20 వరల్డ్‌కప్ అందించడం చాలా గర్వంగా ఉంది. ఒక మారుమూల గ్రామంలో మొదలైన నా ప్రయాణం, ఈ స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉంది.

ప్రభుత్వం చేయూత ఇవ్వాలి..

నేను ప్రస్తుతం ముంబైలో ఇన్‌కమ్‌టాక్స్ విభాగంలో రూ.25 వేలకు ఉద్యోగం చేస్తున్నా. నా ఖర్చులకు కూడా ఆ డబ్బు సరిపోవడం లేదు. ఇప్పటికీ మా కుటుంబం కోసం చేసిన అప్పులను నాన్న తీరుస్తూనే ఉన్నారు. ఇన్ని కష్టాల్లో కూడా క్రికెట్ పైన ఉన్న మక్కువ, దేశంపై ఉన్న ప్రేమతో కష్టాలను దిగమింగి వరల్డ్‌కప్ సాధించా. నాలాంటి అంధ క్రికెటర్లను ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు ప్రోత్సహిస్తే మాకు జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల మరింత పెరుగుతుంది."

● ఎస్.ఎస్.బి.సంజయ్

భోజన కుతూహలం

అవిసెపూలతో అన్నీ అద్భుతాలే

అవిసె చెట్లు మనకు అరుదుగా కనిపిస్తూ ఉంటాయి. కానీ అవిసె పూలు ఆరోగ్యాన్ని మేలు చేసేవని చాలా మందికి తెలియదు. అవిసెకు ఉన్న మరో పేరు 'అగస్త్య'. అగత్యం అంటే తప్పనిసరి అని అర్థం. అందుకే అవిసె పూలను ఏదో ఒక రూపంలో తీసుకోవటం అగత్యమనే చెప్పాలి. శరీర ధాతువుల్ని పోషించి, వృద్ధాప్యం కలగకుండా ఆయుష్షని పెంచే రసాయన చికిత్సా విధానానికి పితామహుడు అగస్త్యుడు. ఆయన పేరుతో పిలిచిన మొక్కే అవిసె. ఈ పూలు పెద్దవిగా, మృదువుగా, చిలక ముక్కు ఆకారంలో ఉంటాయి. కొద్దిగా వగరుగా తియ్యగా ఉంటాయి. అవిసె మొక్కలు వేగంగా పెరిగి పూతకొస్తాయి. ఇంట్లో పూలకుండీల్లో కూడా పెంచుకోవచ్చు. ఇంటి ముందు అవిసెమొక్క నాటితే చెడు దృష్టి పోతుందని చాలామంది నమ్ముతారు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ ఏకాదశి వ్రతం చేసి ద్వాదశి నాడు అవిసె పూలతో వంటలు చేసుకుంటారు.



- బాగా వికసించిన అవిసె పూలు మైగ్రేన్ తలనొప్పిని తగ్గించటంలో కీలకపాత్ర పోషిస్తాయి.
- కఫంవల్ల వచ్చే జ్వరాలు.. ఒకసారి పట్టుకుంటే వదలని పడిసెభారాలను వదిలిస్తాయి.
- కడుపు నొప్పిని, పేగుపూతను తగ్గిస్తాయి. కాలేయ సమస్యలకు అవిసె పూలు మంచి మందు. కడుపులో పెరిగే నులి పురుగులను వెళ్లగొడతాయి.
- రక్తహీనతను పోగొట్టడంలో ఇవి మేలు చేస్తాయి. విషదోషాలను తరిమేస్తాయి.
- అవిసె పూలకు వేడిని తగ్గించే గుణం ఉంది.
- అవిసెపూలని ఏదైనా కూరగాయతో కలిపి కలగూరగా వండుకోవచ్చు. పప్పుగా వండుకోవచ్చు. రోటి పచ్చడిగా కూడా చేయవచ్చు.
- ఉడికించిన అవిసెపూలని నానిన మినపప్పు లేదా పెసరపప్పుతో కలిపి కలిపి రుబ్బి దోసెలు, మసాలా వడల్లాంటివి వేసుకోవచ్చు. పకోడీలు కూడా చేసుకోవచ్చు. వీటిని కొబ్బరితో కలిపి వండితే చాలా రుచికరంగా ఉంటాయి.
- థాయ్‌లాండ్‌లో వీటితో సూప్ కూడా చేసుకుంటారు.

● గంగరాజు అరుణాదేవి

పాలు పొంగకుండా ఇలా

పాలను వేడిచేసేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ ఒక్కోసారి అవి పొంగిపోతుంటాయి. దీంతో పాలు వృథా కావడమే కాదు స్టవ్, ప్లాట్‌ఫామ్ శుభ్రం చేయాల్సి వస్తుంది. అలాకాకుండా ఉండాలంటే.. పాలు కాచేటప్పుడు కొన్ని టిప్స్ పాటిస్తే సరి.

- పాలు కాచడానికి వెడల్పాటి గిన్నె లేదా లోతు ఎక్కువగా ఉన్న గిన్నెను తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది.
- చాలామంది గిన్నెలో పాలు పోసిన తరువాత అందులో నీళ్లు కలుపుతూ ఉంటారు. అలా కాకుండా స్టవ్ మీద గిన్నె పెట్టి కొన్ని నీళ్లు పోసి అవి వేడెక్కిన తరువాత అందులో పాలు పోయాలి. దీనివల్ల పాలు పొంగకుండా చక్కగా మరుగుతాయి.
- స్టవ్ మీద పాల గిన్నె పెట్టిన తరువాత దాని అంచులకు కొద్దిగా వెన్న లేదా నెయ్యి రాస్తే పాల పొంగు కిందికి జారదు.
- పాలు కాస్తున్నప్పుడు నురగ వేగంగా పైకి వస్తూ ఉంటే దాని మీద కొన్ని నీళ్లు చిలకరిస్తే సరిపోతుంది.



- పాలను మరిగించేటప్పుడు.. గిన్నె మీద అడ్డంగా చెక్క గరిటె పెట్టినా, అందులో ఒక పెద్ద స్టీల్ చెంచా లేదా గరిటె పెట్టినా పాలు పొంగవు.
- పాలు మరుగుతున్నప్పుడు పైన మందపాటి పొర ఏర్పడుతూ గిన్నె అంచుల వరకూ వచ్చేస్తూ ఉంటుంది. అలాంటప్పుడు ఒక చెంచాతో పాలను కలిపితే అవి పొంగకుండా ఉంటాయి. ఈ పొర మీద ఒక చుక్క నెయ్యి వేసినా కూడా ప్రయోజనం కనిపిస్తుంది.
- పాలు మరుగుతున్నప్పుడు అందులో చిటికెడు వంటసోడా కలిపితే అవి పొంగవు. ఎక్కువ సేపు తాజాగా ఉంటాయి కూడా.
- పాలను కాచేటప్పుడు పెద్ద మంట కాకుండా మధ్యస్థాయి లేదా చిన్న మంట ఉండేలా చూసుకుంటే ఈ సమస్య రాదు.

వంటిల్లు



బాగా చలిగా ఉన్నప్పుడు వేడివేడిగా ఓ కప్పు సూప్ తాగితే హాయిగా అనిపిస్తుంది. శరీరాన్ని వెచ్చగా ఉంచడంతోపాటు చలికాలంలో ఏర్పడే ఎన్నో ఆరోగ్య సమస్యలను నివారించడంలో సూప్‌లు ప్రధాన పాత్ర పోషిస్తాయి. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే విభిన్నమైన సూప్‌ల తయారీ మీకోసం.

చలికాలంలో వేడి వేడిగా

బ్రోకలీ ఆల్మండ్ సూప్

కావాల్సిన పదార్థాలు: ఆలివ్ ఆయిల్- రెండు చెంచాలు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, కొత్తిమీర కాడలు- నాలుగు, వేడినీళ్లు- ఆరు కప్పులు, ఉప్పు- తగినంత, బాదం పలుకులు- 20, బ్రోకలీ ముక్కలు- రెండు కప్పులు, మిరియాల పొడి- ఒక చెంచా, ఫ్రెష్ క్రీమ్- రెండు చెంచాలు

తయారీ విధానం : స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి ఆలివ్ ఆయిల్ వేసి వేడిచేయాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి తరుగు వేసి కలపాలి. ఆపైన కొత్తిమీర కాడలను సన్నగా తరిగి వేయాలి. వీటిని పెద్దమంట మీద రెండు నిమిషాల పాటు వేయించాలి. తరువాత వేడి నీళ్లు పోసి, ఉప్పు వేసి మరిగించాలి. అందులో బాదం పలుకులు, బ్రోకలీ ముక్కలు వేసి గిన్నె మీద మూత పెట్టి అయిదు నిమిషాలు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. గిన్నెలో మిశ్రమం చల్లారిన తరువాత మిక్సీలో వేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని స్టయినర్‌తో మరో గిన్నెలోకి వడబోయాలి. ఈ గిన్నెను స్టవ్ మీద పెట్టి అందులోని మిశ్రమం వేడయ్యేవరకూ గరిటెతో తిప్పుతూ ఉండాలి. చివరగా మిరియాల పొడి వేసి కలిపి ఉప్పు సరిచూసుకుని స్టవ్ మీద నుంచి దించాలి. ఈ బ్రోకలీ ఆల్మండ్ సూప్‌ను ఫ్రెష్ క్రీమ్‌తో వేడిగా సర్వ్ చేసుకోవాలి.

గాజర్ జీరా సూప్




కావాల్సిన పదార్థాలు: జీలకర్ర- ఒక చెంచా, అల్లం తరుగు- ఒక చెంచా, ధనియాల పొడి- అర చెంచా, గాజర్ తరుగు- రెండు కప్పులు, క్యాలీఫ్లవర్ తరుగు- ఒక కప్పు, మంచి నీళ్లు- నాలుగు కప్పులు, ఉప్పు- రెండు చెంచాలు, మిరియాల పొడి- అర చెంచా, బిర్యానీ ఆకు- ఒకటి, కొబ్బరి పాలు- ఒక కప్పు, కొత్తిమీర తరుగు- కొద్దిగా, పుదీనా తరుగు- కొద్దిగా

తయారీ విధానం : స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో జీలకర్ర, అల్లం తరుగు, ధనియాల పొడి వేసి వేయించాలి. తరువాత గాజర్ తరుగు, క్యాలీఫ్లవర్ తరుగు, బిర్యానీ ఆకు వేసి అయిదు నిమిషాలపాటు కలుపుతూ ఉండాలి. ఆపైన నీళ్లు పోసి అరగంటసేపు ఉడికించాలి. తరువాత గిన్నెలోని మిశ్రమాన్ని మెత్తగా బ్లెండ్ చేయాలి. తరువాత ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. చివరగా కొత్తిమీర తరుగు, పుదీనా తరుగు వేసి స్టవ్ మీద నుంచి దించాలి. తరువాత కొబ్బరిపాలు కలిపి వేడిగా సర్వ్ చేసుకోవాలి.

చికెన్ మాంచౌ సూప్

కావాల్సిన పదార్థాలు: నూనె- చెంచా, అల్లం తరుగు- ఒక చెంచా, వెల్లుల్లి తరుగు- రెండు చెంచాలు, సన్నగా తరిగిన చికెన్ ముక్కలు- పావు కేజీ, టమాటా తరుగు- పావు కప్పు, కేరట్ తరుగు- పావు కప్పు, క్యాబేజీ తరుగు- పావు కప్పు, క్యాప్సికమ్ తరుగు- పావు కేజీ, వేడినీళ్లు- అయిదు కప్పులు, సోయా సాస్- రెండు చెంచాలు, వెనిగర్- చెంచా, పంచదార- చిటికెడు, పచ్చిమిర్చి పేస్టు- ఒక చెంచా, మిరియాల పొడి- పావు చెంచా, ఉప్పు- తగినంత, కార్న్‌ఫ్లోర్- రెండు చెంచాలు, కోడి గుడ్డు- ఒకటి, కొత్తిమీర తరుగు- కొద్దిగా, ఉల్లికాడల తరుగు- కొద్దిగా, ఉడికించి వేయించిన నూడుల్స్- ఒక కప్పు.

తయారీ విధానం : ఒక గిన్నెలో కార్న్ ఫ్లోర్‌ను తీసుకుని అందులో కొన్ని నీళ్లు పోస్తూ ఉండలు రాకుండా జారుగా కలపాలి. చిన్న గిన్నెలో కోడిగుడ్డును పగులగొట్టి సొనలను నురుగు వచ్చేలా బీట్ చేయాలి. స్టవ్ మీద వెడల్పాటి పాన్ పెట్టి నూనె వేసి వేడి చేయాలి. అందులో అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. తరువాత చికెన్ ముక్కలు వేసి మెల్లగా కలుపుతూ పొడిపొడిగా అయ్యేవరకూ వేయించాలి. ఆపైన టమాటా, కేరట్, క్యాబేజీ, క్యాప్సీకమ్ తరుగు వేసి కలపాలి. తరువాత అందులో వేడినీళ్లు పోసి అయిదు నిమిషాలపాటు మరిగించాలి. వెంటనే సోయాసాస్, వెనిగర్, పంచదార, మిరియాల పొడి, పచ్చిమిర్చి పేస్టు, ఉప్పు, కార్న్ ఫ్లోర్ మిశ్రమం వేసి కలపాలి. తరువాత కోడిగుడ్డు సొనల మిశ్రమాన్ని పైపైన పోస్తూ మెల్లగా కలపాలి. రెండు నిమిషాల తరువాత కొత్తిమీర తరుగు, ఉల్లికాడల తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ సూప్ పైన క్రిస్పీ నూడుల్స్ వేసి వేడివేడిగా సర్వ్ చేసుకోవాలి.





శిరోజాలు రాలుతుంటే...

చలికాలంలో శిరోజాలు ఎక్కువగా రాలిపోతూ ఉంటాయి. అలాంటప్పుడు శిరోజాలను శ్రద్ధగా సంరక్షించుకోవాలని అంటున్నారు నిపుణులు.

- వారానికి మూడుసార్లు తలకు కొబ్బరి నూనె లేదా బాదం నూనె రాసుకుని సున్నితంగా మర్దన చేసుకోవాలి.దీనివల్ల కుదుళ్లు గట్టిపడి జుట్టు రాలడం ఆగుతుంది.
- రోజూ కాకుండా వారానికి మూడుసార్లు మాత్రమే తలస్నానం చేయాలి. తలస్నానానికి గంట ముందు తలకు కొద్దిగా నూనె పట్టించడం మంచిది. వేడి వేడి నీళ్లను లేదంటే చల్లటి నీళ్లను తలమీద పోసుకోకూడదు. గోరువెచ్చని నీళ్లను మాత్రమే తలస్నానానికి ఉపయోగించాలి. సల్ఫేట్ లేని తేలికపాటి షాంపూను, జుట్టుకు బలాన్నిచ్చే కండిషనర్‌ను వాడాలి. అప్పుడే మాడు మీద చర్మం పొడిబారకుండా ఉంటుంది. శిరోజాలు కూడా బలంగా పెరుగుతాయి.
- తలస్నానం చేసిన తరువాత తలకు మెత్తని పలుచని తువాలుని చుట్టి ఉంచాలి. నీళ్లన్నీ ఇంకిన తరువాత తువాలును తీసివేసి శిరోజాలను గాలికి ఆరనివ్వాలి. తడి జుట్టును దువ్వకూడదు. హెయిర్ స్ట్రయిట్‌నర్లు, బ్లో డ్రైయర్లు, హీట్ స్టయిలింగ్ సాధనాలను వాడకూడదు.
- శిరోజాలకు పోషణను అందించే కోడిగుడ్లు, చేపలు, వాల్‌నట్‌లు, బాదాం, జీడిపప్పు, గుమ్మడి గింజలు, పాలకూర, కేరట్, బీట్‌రూట్, అవిశె గింజలను విధిగా ఆహారంలో చేర్చుకోవాలి.
- రోజూ ఉదయాన్నే పావుగంటసేపు శరీరానికి సూర్యకాంతి అందేలా చూసుకోవాలి. దీనివల్ల చర్మం పొరల్లో డి విటమిన్ ఉత్పత్తి పెరిగి మాడు మీద జుట్టు కుదుళ్లు బలపడతాయి. డి విటమిన్ సహాయంతో శరీరంలో కాల్షియం శోషణ కూడా పెరగడంతో శిరోజాలు రాలడం తగ్గుతుంది.
- చలికాలంలో ఎక్కువగా దాహం వేయదు. అయినా కానీ తరచూ మంచినీళ్లు తాగడం మంచిది. కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పలుచని మజ్జిగ, వేడి వేడి సూప్‌లు తాగుతూ ఉంటే తగినంత తేమ, పోషణ అంది జుట్టు రాలడం ఆగుతుంది.
- ఇంటి నుంచి బయటికి వెళ్లేటప్పుడు శిరోజాలకు చల్లటి గాలి తగులకుండా తలకు స్కార్ఫ్ చుట్టుకోవాలి.

స్పోర్ట్స్

మరో కప్‌నకు సై
రో-కో



రాబోయే వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా.. లేదా అనే విషయమై కొనసాగుతున్న సందిగ్ధానికి దాదాపు తెరపడినట్టే. ఇప్పటికే టీ20లు, టెస్టులకు గుడ్‌బై చెప్పిన రో-కో 2027లో జరిగే వన్డే ప్రపంచ కప్‌లో ఆడే విషయమై ఎంతో కాలంగా పుకార్లు వెల్లువెత్తుతున్నాయి. పైగా గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తదుపరి వన్డే వరల్డ్ కప్‌నకు యువ జట్టును రూపొందించే ప్రయత్నంలో ఉన్నారని, ఈ క్రమంలో రో-కో ద్వయం కెరీర్ ఇక ముగిసినట్టేనని విస్తృతంగా చర్చలు జరిగాయి. కానీ దక్షిణాఫ్రికాతో వైట్‌వాష్ దెబ్బకు పరిస్థితి మొత్తం మారిపోయింది. ఇప్పుడు గౌతీ, అగార్కర్‌ల పదవులకే ప్రమాదం వచ్చే పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో రోహిత్, విరాట్ స్థానాలపై కఠిన నిర్ణయం తీసుకొనే అవకాశాల్లేవని అంటున్నారు. పైగా..ఆస్ట్రేలియాలో జరిగిన గత వన్డే సిరీస్‌లో రో-కో ద్వయం సత్తా చాటింది. దక్షిణాఫ్రికాతో ఆడే వన్డే సిరీస్‌తో పాటు.. వన్డే వరల్డ్ కప్ వరకూ జరగబోయే సిరీస్‌ల వరకూ ఫిట్‌నెస్ కాపాడుకోవడంతోపాటు మంచి స్కోర్లు చేయగలిగితే మెగా టోర్నమెంట్‌లో రోహిత్, కోహ్లీలను తప్పక చూడగలుగుతాం.

వారికి ఆ సత్తా ఉంది: మోర్కెల్

రోహిత్, కోహ్లీలకు రాబోయే వన్డే ప్రపంచ కప్‌లో ఆడే సత్తా ఉందని భారత జట్టు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. అపార అనుభవజ్ఞులైన వారు అత్యున్నతస్థాయిలో టోర్నీలలో ఎన్నోసార్లు సత్తా చాటారని గుర్తు చేశాడు.

అగార్కర్‌పైనా అసంతృప్తి?



గంభీర్, అగార్కర్‌ల హయాంలో టెస్టుల్లో భారత జట్టు నిలకడ ప్రశ్నార్థకమైంది. జట్టు ఎంపికలో వీరిద్దరు అనుసరిస్తున్న విధానాలను మాజీ ఆటగాళ్లు విమర్శిస్తున్నారు. ఇంకా.. రంజీట్రోఫీ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా తిలకించకపోవడంపై అగార్కర్‌ను తప్పుబడుతున్నారు. భారత జట్టు ఆడే అంతర్జాతీయ మ్యాచ్‌లను చూడడంతో బిజీగా ఉండే అగార్కర్‌కు దేశవాళీ పోటీలకు హాజరయ్యే తీరిక లేదంటూ సెటైర్లు వేస్తున్నారు. అలాంటి అగార్కర్..అంతర్జాతీయ పోటీలు లేనప్పుడు రంజీట్రోఫీలో ఆడాలని జాతీయ జట్టు క్రికెటర్లను ఆదేశించే హక్కు ఎక్కడిదని ప్రశ్నిస్తున్నారు. మొత్తంగా సఫారీల చేతిలో ఘోర పరాభవం తర్వాత విమర్శల దాడి పెరగడంతో..సెలెక్టర్లతో మాట్లాడాలని బీసీసీఐ పెద్దలు భావిస్తున్నారని సమాచారం.

బీసీసీఐ గరం..గరం

దక్షిణాఫ్రికాతో కోల్‌కతాలో జరిగిన తొలి టెస్ట్ పిచ్‌పై గంభీర్ ప్రశంసల వర్షం కురిపించడం బీసీసీఐ పెద్దలను ఆగ్రహానికి గురిచేసిందని సమాచారం. ఈడెన్‌గార్డెన్స్ నల్లమట్టి వికెట్‌పై క్రికెట్ పండితులు కూడా పెదవి విరిచారు. ఈ తరుణంలో పిచ్‌పై గంభీర్ వ్యాఖ్యలు బీసీసీఐకి కూడా రుచించలేదట. విపరీతంగా టర్న్ అయిన వికెట్‌పై భారత జట్టు నాలుగో ఇన్నింగ్స్‌లో 93 పరుగులకే కుప్పకూలింది.

టీ20 ప్రపంచ కప్ తర్వాత..?

పెద్ద ఎత్తున విమర్శలు ఎదుర్కొంటున్న కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. అయితే వారిద్దరి పదవులకు ప్రస్తుతానికి ఢోకా లేదని తెలిసింది. వచ్చే ఫిబ్రవరి-మార్చి నెలల్లో టీ20 వరల్డ్ కప్ జరగనుంది. అందులో టీమిండియా కనబరచే ప్రదర్శనను బట్టి అగార్కర్, గంభీర్‌ల భవితవ్యంపై నిర్ణయం తీసుకోవాలని బీసీసీఐ భావిస్తోందని సమాచారం.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

మెస్సీ ఈవెంట్ టిక్కెట్ల విక్రయం షురూ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ హైదరాబాద్ ఈవెంట్ టిక్కెట్ల విక్రయం ప్రారంభమైంది. వచ్చే నెల 13వ తేదీన ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ ఈవెంట్‌కు సంబంధించి డిస్ట్రిక్ జొమాటో యాప్, వెబ్‌సైట్‌లో గురువారం టిక్కెట్ల అమ్మకాలు మొదలయ్యాయి. ఉప్పల్ స్టేడియంలో సెలబ్రెటీ ఫుట్‌బాల్ మ్యాచ్, మెస్సీకి సన్మానం, సంగీత విభావరి నిర్వహించనున్నారు. టిక్కెట్ల ధరల విషయానికొస్తే రూ.1750 నుంచి రూ.30 వేల శ్రేణి వరకు ఉన్నాయి. రూ.2 వేలు, 3,250, 5 వేలు, 7 వేలు, 8 వేలు, 13,500 రకాల టిక్కెట్లను ప్రస్తుతం అమ్మకానికి ఉంచారు. ఇందులో రూ.30 వేల శ్రేణి టిక్కెట్లకు హాస్పిటాలిటీ సదుపాయం ఉంది.

సీఎంకు రవి నాయుడు కృతజ్ఞతలు



అమరావతి (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో స్పోర్ట్స్ హబ్ నిర్మాణం కోసం 28.30 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నందుకు శాప్ చైర్మన్ ఎ. రవి నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. తిరుపతిలో అంతర్జాతీయ స్థాయిలో క్రీడా మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు శాట్‌కు భూమి కేటాయించాలని కొద్ది నెలల కిందట చంద్రబాబు నాయుడుకి, మంత్రులు నారా లోకేష్, అనగాని సత్య ప్రసాద్‌కు వినతిపత్రాలు ఇచ్చామని రవి నాయుడు తెలిపారు. క్రీడాంధ్రప్రదేశ్ రూపకల్పనలో భాగంగా మంత్రి మండలి సమావేశంలో శాట్‌కు భూమి కేటాయించాలని నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర క్రీడారంగానికి శుభ పరిణామమని అన్నారు.

ఆంధ్ర రెండో గెలుపు

లఖ్‌నవూ: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఎలీట్ గ్రూప్-ఎలో భాగంగా శుక్రవారం ఇక్కడ జరిగిన పోరులో ఆంధ్ర 66 పరుగుల తేడాతో ఒడిశాను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర 20 ఓవర్లలో 7 వికెట్లకు 184 పరుగులు సాధించింది. కెప్టెన్ రికీ భుయ్ (47), శ్రీకర్ భరత్ (42), అశ్విన్ హెబ్బర్ (39), షేక్ రషీద్ (24) రాణించారు. బిప్లాబ్ సమంత్రే 3, రాజేశ్ మొహంతి 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఆంధ్ర బౌలర్ పృథ్వీ రాజ్ (2.2-0-4-3) అద్భుత గణాంకాలు నమోదు చేయడంతో ఒడిశా 17.2 ఓవర్లలో 118 పరుగులకే కుప్పకూలింది. మరో బౌలర్ సౌరభ్ కుమార్ 3 వికెట్లు పడగొట్టాడు. ఇక, ఎలీట్ గ్రూప్-బిలో భాగంగా కోల్‌కతాలోని జాదవ్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో మహారాష్ట్ర చేతిలో పరాజయం పాలైంది.

ఆయుష్‌కు పగ్గాలు

- భారత జట్టులో వైభవ్ సూర్యవంశీ
- అండర్-19 ఆసియా కప్



ఆయుష్

న్యూఢిల్లీ: ఆయుష్ మాత్రే అండర్-19 ఆసియా కప్‌లో పాల్గొనే యువ భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వచ్చేనెల 12 నుంచి దుబాయ్ వేదికగా 50 ఓవర్ల ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీకి 15 మంది సభ్యులతో భారత జట్టును శుక్రవారం ప్రకటించారు. టీనేజ్ సంచలనం, 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి కూడా జట్టులో చోటు కల్పించారు. ఆయుష్ ఇటీవల ఆస్ట్రేలియాతో సిరీస్‌లో భారత జట్టును ముందుండి నడిపించాడు. ఇక, విహాన్ మల్హోత్రాను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

జట్టు: ఆయుష్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా (వైస్ కెప్టెన్), వేదాంత్, అభిగ్యాన్ (వికెట్ కీపర్), హర్వంశ్ సింగ్ (వికెట్ కీపర్), గోహిల్, కనిష్క్, ఖిలాన్ పటేల్, నమన్ పుష్పక్, దీపేశ్, హెనిల్ పటేల్, కిషన్, ఉధవ్ మోహన్, ఆరోన్ జార్జ్. **స్టాండ్‌బై:** రాహుల్, హేమ్‌చందేశన్, కిషోర్, ఆదిత్య రావత్.

సెమీస్‌కు తన్వి, శ్రీకాంత్

- గాయత్రి జోడీ కూడా



తన్వీ శర్మ

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు తన్వీ శర్మ, ఉన్నతి హుడా, కిడాంబి శ్రీకాంత్ సింగిల్స్‌లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. తన్వి 21-13, 21-19తో లో సిన్ యాన్ (హాంకాంగ్)పై, ఉన్నతి 21-15, 13-21, 21-16తో భారత్‌కే చెందిన రక్షితపై నెగ్గారు. పురుషుల క్వార్టర్‌ఫైనల్స్‌లో శ్రీకాంత్ 21-14, 11-4తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి, భారత షట్లర్ ప్రియాన్షు రజావత్ గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. శ్రీకాంత్ సెమీస్‌లో మరో భారత షట్లర్ మిథున్ మంజునాథ్‌తో తలపడనున్నాడు. మంజునాథ్ 21-18, 21-13తో సహచర షట్లర్ మన్‌రాజ్ సింగ్‌ను ఓడించాడు. మహిళల డబుల్స్‌లో టాప్‌సీడ్ గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 21-15, 21-16తో టర్కీ ద్వయం బెన్‌గిసు ఎర్సెటిన్/నాజ్‌లికాన్ ఇన్సిపై గెలిచి సెమీస్ చేరింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో హరిహరన్/ట్రీసా జాలీ జంట 21-18, 21-14తో ఆస్ట్రేలియా ద్వయం అండికా/నొజొమిను ఓడించి సెమీస్‌లో అడుగుపెట్టింది.

కుర్రాళ్ల ఘన బోణీ

చిలీపై భారత్ గెలుపు ● జూ. హాకీ ప్రపంచ కప్



మధురై: ఎఫ్‌ఐహెచ్ పురుషుల జూనియర్ హాకీ ప్రపంచ కప్‌లో ఆతిథ్య భారత్ తనదైన స్టయిల్లో బోణీ చేసింది. శుక్రవారం మొదలైన ఈ టోర్నీలో ఫేవరెట్ భారత్ 7-0 తేడాతో చిలీని చిత్తుచేసింది. గ్రూప్-బిలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్ ఆరంభం నుంచే అద్భుత జోరు చూపిన భారత ఆటగాళ్లు.. ఆద్యంతం ప్రత్యర్థిని దీటుగా కట్టడి చేశారు. చిలీకి ఒక్క గోల్‌కు కూడా అవకాశమివ్వకుండా చెలరేగారు. రోషన్ కుజుర్ (16వ, 21వ నిమిషాల్లో), దిల్‌రాజ్ సింగ్ (25వ, 34వ) చెరో రెండు గోల్స్‌తో విజృంభించగా.. అజీత్ యాదవ్ (35వ), అన్మోల్ ఎక్కా (48వ), కెప్టెన్ రోహిత్ (60వ) తలో గోల్ చేశారు. భారత్ తన రెండో మ్యాచ్‌ను శనివారం ఒమన్‌తో ఆడనుంది. ఇక, మరో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జర్మనీ 4-0తో దక్షిణాఫ్రికాపై గెలిచింది. అంతకుముందు జరిగిన టోర్నీ ప్రారంభ మ్యాచ్ పూల్-ఎలో ఐర్లాండ్ 4-3తో కెనడాపై విజయం సాధించింది. ఓ దశలో 1-4తో వెనుకంజలో నిలిచినా, ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకొన్న కెనడా.. రెండు గోల్స్ చేసి ప్రత్యర్థి ఆధిక్యాన్ని కొంతైనా తగ్గించింది. పూల్-డిలో స్పెయిన్ 8-0తో ఈజిప్టుపై, బెల్జియం 12-1తో నమీబియాపై గెలుపొందాయి.

భారత్-శ్రీలంక టీ20 సిరీస్
విశాఖలో రెండు మ్యాచ్‌లు


న్యూఢిల్లీ: భారత్-శ్రీలంక మహిళల జట్లు ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనున్నాయి. డిసెంబరు 21 నుంచి 30 వరకు ఈ సిరీస్ జరగనుంది. 21, 23 తేదీల్లో జరిగే తొలి రెండు మ్యాచ్‌లకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. 26, 28, 30 తేదీలలో చివరి మూడు టీ20లు తిరువనంతపురంలో జరగనున్నాయి.

భారత మహిళల బాక్సింగ్ కోచ్‌గా శాంటియాగో



న్యూఢిల్లీ: గతంలో భారత పురుషుల బాక్సింగ్‌కు హై పెర్‌ఫార్మెన్స్ డైరెక్టర్‌గా వ్యవహరించిన 50 ఏళ్ల శాంటియాగో నివా ఇప్పుడు మహిళల జట్టుకు చీఫ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. అర్జెంటీనాకు చెందిన శాంటియాగో 2017 నుంచి 2022 వరకు భారత పురుషుల జట్టుతో కలిసి పని చేశాడు. అతని హయాంలో 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు రెండు పతకాలు సాధించారు.

బిజినెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,28,460 ▲	1,17,750 ▲	1,83,000 ▲
విజయవాడ	1,30,500 ▲	1,20,500 ▼	1,68,800 ▲
విశాఖపట్నం	1,30,680 ▲	1,17,100 ▼	1,83,000 ▲
రాజమండ్రి	1,28,450 ▲	1,17,750 ▲	1,67,000 ▲
ప్రొద్దుటూరు	1,25,900 ▲	1,15,830 ▲	1,68,000 ▲
ముంబై	1,26,591 ▲	1,15,957 ▲	1,64,359 ▲

రోజుకి రెండు స్టోర్లు తెరుస్తాం

అపోలో ఫార్మసీ సీఈఓ జయకుమార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రాబోయే ఐదేళ్ల కాలంలో ప్రతి రోజూ రెండు కొత్త స్టోర్లు ప్రారంభించడం, కస్టమర్ల సంఖ్యను 10 కోట్లకు పెంచుకోవడం తమ లక్ష్యమని అపోలో ఫార్మసీ సీఈఓ పి.జయకుమార్ ప్రకటించారు. శుక్రవారం యూపీలోని అయోధ్యలో కొత్త స్టోర్‌ను ప్రారంభించడంతో అపోలో ఫార్మసీ నెట్‌వర్క్ 7,000 స్టోర్ల మైలురాయిని దాటిందన్నారు. అత్యున్నత నాణ్యత గల ఔషధాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచడం తమ లక్ష్యమన్నారు. అపోలో ఫార్మసీ ప్రస్తుతం 19,000 పిన్‌కోడ్‌లకు ఔషధాలు సరఫరా చేస్తోంది. రోజూ 10 లక్షల ఆర్డర్లకు సరఫరా విస్తరించగలిగినట్టు అపోలో హెల్త్‌కో ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభన కామినేని చెప్పారు.

భళా భారత్..



6 త్రైమాసికాల గరిష్ఠానికి దేశ జీడీపీ వృద్ధి రేటు

- సెప్టెంబరు త్రైమాసికంలో 8.2 శాతంగా నమోదు
- అమెరికా సుంకాల నేపథ్యంలోనూ అంచనాలను మించిన ఆర్థిక ప్రగతి
- తయారీ, సేవల రంగాల జోరు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు నేపథ్యంలోనూ భారత ప్రగతి చక్రం అంచనాలను మించిన పరుగుతో అందరినీ అబ్బుర పరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో జీడీపీ వృద్ధి రేటు ఆరు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 8.2 శాతానికి ఎగబాకింది. జీఎస్‌టీ రేట్ల తగ్గుదలతో వినియోగం భారీగా పుంజుకోవచ్చన్న అంచనాలతో దేశంలో వస్తు తయారీ జోరందుకోవడంతో పాటు సేవల రంగమూ అద్భుత పనితీరును కనబరచడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. ఈ క్యూ2లో ప్రస్తుత ధరల ఆధారిత లేదా నామినల్ జీడీపీ 8.7 శాతానికి చేరుకుంది. అమెరికా మనపై సుంకాల భారాన్ని ఈ ఆగస్టులో 50 శాతానికి పెంచిన తరుణంలోనూ ఈ స్థాయి వృద్ధి నమోదు కావడం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (క్యూ1)లో వృద్ధి రేటు 7.8 శాతంగా నమోదు కాగా.. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో 5.6 శాతంగా ఉంది. కాగా, గత గరిష్ఠమైన 8.4 శాతం వృద్ధి రేటు 2023-24 ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి త్రైమాసికం (క్యూ4)లో నమోదైంది.

శరవేగ భారత్

ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ మరోసారి తన అగ్ర కిరీటాన్ని నిలబెట్టుకుంది. ఈ జూలై-సెప్టెంబరు కాలానికి చైనా జీడీపీ వృద్ధి రేటు 4.8 శాతానికి పరిమితమైంది. చైనాను మించిన వృద్ధిని సాధిస్తుండటంతో పాటు భారత్ ప్రపంచ ఆర్థిక వృద్ధికీ ప్రధాన చోదకంగా మారింది.

స్థిర ధరల ఆధారిత జీడీపీ లేదా వాస్తవ జీడీపీ

	2025-26 (రూ.లక్షల కోట్లు)	2024-25 (రూ.లక్షల కోట్లు)	వృద్ధి (%)
జూలై-సెప్టెంబరు	48.63	44.94	8.2
ఏప్రిల్-సెప్టెంబరు	96.52	89.35	8.0

ప్రస్తుత ధరల ఆధారిత జీడీపీ లేదా నామినల్ జీడీపీ

	2025-26 (రూ.లక్షల కోట్లు)	2024-25 (రూ.లక్షల కోట్లు)	వృద్ధి (%)
జూలై-సెప్టెంబరు	85.25	78.40	8.7
ఏప్రిల్-సెప్టెంబరు	171.30	157.48	8.8

ప్రథమార్ధం వృద్ధి రేటు 8 శాతం

జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి (ఏప్రిల్-సెప్టెంబరు) జీడీపీ వృద్ధి రేటు 8 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వృద్ధి రేటు 6.1 శాతంగా ఉంది. ఈ ప్రథమార్ధం ట్రెండ్‌ను బట్టి చూస్తే, పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు ఆర్థిక సర్వే నివేదికలో అంచనా వేసిన 6.3-6.8 శాతాన్ని మించిపోయే అవకాశాలున్నాయి.

క్యూ2లో వాస్తవ స్థూల విలువ జోడింపు (జీవీఏ)

రంగం	వృద్ధి (%)
వ్యవసాయం సంబంధిత రంగాలు	3.5
మైనింగ్ అండ్ క్వారీయింగ్	-0.04
మాన్యుఫాక్చరింగ్	9.1
ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవలు	4.4
నిర్మాణం	7.2
వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్	7.4
ఆర్థిక సేవలు, రియల్టీ, వృత్తి నైపుణ్య సేవలు	10.2
ప్రజా పాలన, రక్షణ, ఇతర సేవలు	9.7

సంస్కరణలు కొనసాగిస్తాం

"క్యూ2లో 8.2 శాతం వృద్ధి రేటు చాలా ప్రోత్సాహకరంగా ఉంది. వృద్ధి సానుకూల విధానాలు, సంస్కరణల ప్రభావాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. ప్రజల కష్టాన్ని, వ్యాపారతత్పరతకూ ప్రతిబింబమిది. మా ప్రభుత్వం సంస్కరణలను కొనసాగించడంతో పాటు ప్రజల జీవనాన్ని మరింత సులభతరం చేసే దిశగా కృషి చేస్తుంది.

- నరేంద్ర మోదీ, ప్రధాని

ఆర్థికం జోరుకు నిదర్శనం

తాజా వృద్ధి గణాంకాలు బలమైన ఆర్థిక వృద్ధితో పాటు ఆర్థిక వ్యవస్థ జోరును కనబరుస్తున్నాయి. ఆర్థిక స్థిరీకరణ, లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ పెట్టుబడులు, పలు సంస్కరణలు దేశంలో పారిశ్రామికోత్పత్తిని పెంచడంతో పాటు వ్యాపార నిర్వహణను సులభతరం చేశాయి.

- నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి

4 లక్షల కోట్ల డాలర్లకు ఎకానమీ

క్యూ2లో అంచనాలను మించిన వృద్ధి నమోదైన నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 7 శాతం లేదా ఆపై స్థాయికి చేరవచ్చు. ప్రస్తుత వృద్ధి ట్రెండ్‌ను బట్టి చూస్తే, భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం ఈ ఆర్థిక సంవత్సరంలోనే 4 లక్షల కోట్ల డాలర్లు దాటిపోవచ్చు. ఈ మార్చి నాటికే భారత ఎకానమీ 3.9 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంది."

- వీ అనంత నాగేశ్వరన్, ప్రధాన ఆర్థిక సలహాదారు

ద్రవ్య లోటు రూ.8.25 లక్షల కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరుతో ముగిసిన 7 నెలల్లో కేంద్ర ప్రభుత్వ ద్రవ్య లోటు రూ.8,25,144 కోట్లకు పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సర లక్ష్యంలో 52.6 శాతానికి సమానమిది. గత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-అక్టోబరు కాలానికి ద్రవ్య లోటు బడ్జెట్ అంచనాలో 46.5 శాతంగా నమోదైంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు రూ.15.69 లక్షల కోట్లు లేదా జీడీపీలో 4.4%గా నమోదు కావచ్చని ఈసారి బడ్జెట్లో కేంద్రం అంచనా వేసింది.

వజ్రాభరణాలకూ హాల్‌మార్కింగ్

పరిశీలిస్తున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ: మన దేశంలో నయా సంపన్నులకు వజ్రాల మీద ఎనలేని ప్రేమ. అయితే ప్రస్తుత మార్కెట్లో ఏవి సహజ వజ్రాలో, ఏవి ల్యాబ్స్‌లో అభివృద్ధి చేసిన వజ్రాలో తెలుసుకోవడం అందరికీ సాధ్యం కాదు. నగల వ్యాపారులకు మాత్రమే ప్రస్తుతం ఇది సాధ్యం. సామాన్యులకైతే వీటి మధ్య తేడాను కనిపెట్టడం దాదాపు అసాధ్యం. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యాపారులు చౌకగా వచ్చే ల్యాబ్ డైమండ్స్‌నే.. సహజ వజ్రాలుగా చెబుతూ భారీగా దండుకుంటున్నారు. దీనికి తెరదించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఏవి సహజ వజ్రాలు, ఏవి ల్యాబ్ డైమండ్స్ లేదా వాటితో చేసిన నగలో కొనుగోలుదారులే స్వయంగా తెలుసుకునేలా ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయాలని యోచిస్తోంది. కేంద్ర వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి నిధి ఖరే ఢిల్లీలో జరిగిన ఒక సదస్సులో ఈ విషయం వెల్లడించారు. ఈ మార్గదర్శకాలు బంగారం, వెండి లేదా వాటితో తయారు చేసిన నగల స్వచ్ఛతను తెలుసుకునేందుకు వినియోగిస్తున్న 'హాల్‌మార్క్' ప్రామాణికాల తరహాలోనే ఉంటాయని ఆమె చెప్పారు.

పసిడి ధరల నిర్ణేతలమవుతాం: వచ్చే పదేళ్లలో అంతర్జాతీయ పసిడి మార్కెట్లో ధరల నిర్ణేతగా భారత్ మారుతుందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యుజీసీ) ఇండియా సీఈఓ సచిన్ జైన్ తెలిపారు. దేశీయ పసిడి ఉత్పత్తి పెద్దగా లేకపోవడంతో ప్రస్తుతం మన దేశానికి పసిడి ధరల నిర్ణయంలో ఎలాంటి పాత్ర లేదన్నారు. అయితే వచ్చే పదేళ్లలో దేశీయ పసిడి గిరాకీలో 20 శాతం దేశీయంగా ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నందున ధరల నిర్ణయంలోనూ మన దేశం నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతుందన్నారు.

లాభాల స్వీకరణతో మార్కెట్లు డౌన్

- సెన్సెక్స్ 14 పాయింట్లు పతనం

ముంబై: గురువారం ఇంట్రాడేలో జీవితకాల గరిష్ఠ స్థాయిలకు దూసుకుపోయిన ఈక్విటీ మార్కెట్ సూచీ లు వారాంతపు రోజైన శుక్రవారం నాడు నీరసపడ్డాయి. జీడీపీ గణాంకాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దూరంగా ఉండడం మార్కెట్‌ను కుంగదీసింది. శుక్రవారం రెండు రోజుల ర్యాలీకి తెర దించిన సెన్సెక్స్ 13.71 పాయింట్ల నష్టంతో 85,706.67 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 392 పాయింట్ల మేరకు పెరిగి 85,969.89 గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. మరోవైపు నిఫ్టీ 12.60 పాయింట్లు నష్టపోయి 26,202.95 వద్ద ముగిసింది. గరిష్ఠ స్థాయిల్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి పాల్పడ్డారు. దీనికి తోడు విదేశీ నిధుల తరలింపు, ప్రపంచ మార్కెట్లలో ఊగిసలాట ధోరణి సూచీల కదలికలను ప్రభావితం చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 474.75 పాయింట్లు, నిఫ్టీ 134.8 పాయింట్లు లాభపడ్డాయి.

డిసెంబరు 3న మీషో ఇష్యూ: ఈ-కామర్స్ కంపెనీ మీషో తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) డిసెంబరు 3వ తేదీన మార్కెట్ తలుపు తట్టనుంది. షేరు ధర శ్రేణిని రూ.105-111గా కంపెనీ నిర్ణయించింది. 5వ తేదీన ఇష్యూ ముగుస్తుంది. ఇష్యూలో భాగంగా రూ.4,250 కోట్ల విలువ గల తాజా షేర్లు మార్కెట్లో విడుదల చేయనున్నారు. 10.55 కోట్ల షేర్లను ఓఎఫ్ఎస్ బాటలో విక్రయిస్తారు.

డిజిటల్ బ్యాంకింగ్‌కు ఆర్‌బీఐ మార్గదర్శకాలు

జనవరి 1 నుంచి అమలు

ముంబై: బ్యాంకులు అందించే డిజిటల్ బ్యాంకింగ్ సేవలకు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం ఏడు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. తన నియంత్రణ పరిధిలోకి వచ్చే వాణిజ్య బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు, లోకల్ ఏరియా బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, పట్టణ, గ్రామీణ సహకార బ్యాంకులు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందించాలి. బ్యాంకులు ఖాతాదారులకు అందించే డిజిటల్ బ్యాంకింగ్ సేవల విధి విధానాలు ఈ మార్గదర్శకాలకు లోబడి ఉంటాయి. బ్యాంకులు ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా తమ డిజిటల్ బ్యాంకింగ్ సేవల సమగ్ర విధి విధానాలను రూపొందించుకోవాలని ఆర్‌బీఐ కోరింది. ఖాతాదారులకు భద్రత, పారదర్శకతతో కూడిన డిజిటల్ బ్యాంకింగ్ సేవల కోసం ఆర్‌బీఐ ఈ మార్గదర్శకాలు జారీ చేసిందని భావిస్తున్నారు.

సీఎంఈ ఫ్యూచర్స్‌లో సాంకేతిక లోపం

బెంబేలెత్తిన ప్రపంచ స్టాక్ మార్కెట్లు

న్యూయార్క్: శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ, ఫారెక్స్, బాండ్స్, కమోడిటీస్ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) మార్కెట్లు బెంబేలెత్తిపోయాయి. ఈ మార్కెట్లకు మార్గదర్శిగా భావించే చికాగో మర్కెంటైల్ ఎక్స్ఛేంజీ (సీఎంఈ)లో ట్రేడింగ్ దాదాపు 10 గంటల పాటు నిలిచి పోవడం ఇందుకు ప్రధాన కారణం. ఈ ఎక్స్ఛేంజీకి డేటా సేవలు అందించే డేటా సెంటర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడమే ఇందుకు కారణంగా ఉంది. దీంతో ప్రపంచ మార్కెట్లు ఒక్కసారిగా బెంబేలెత్తిపోయాయి. మరోవైపు వరుసగా రెండు రోజుల పాటు లాభాల బాట పట్టిన భారత స్టాక్ మార్కెట్ శుక్రవారం ఫ్లాట్‌గా ముగియడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణంగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

సోషల్ మీడియా హోం పేజీపై రిజిస్ట్రేషన్ నంబర్, పేరు ఉండాలి : సెబీ

న్యూఢిల్లీ: తన నియంత్రణలోని కంపెనీలు, వాటి ఏజెంట్లు సోషల్ మీడియా వేదికల్లో హోమ్ పేజీపై తమ రిజిస్టర్డ్ పేరు, రిజిస్ట్రేషన్ నంబరు ప్రముఖంగా డిస్‌ప్లే చేయాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ప్రతిపాదించింది. రిజిస్టర్ కాని కంపెనీలు, రిజిస్టర్ అయిన కంపెనీలు ప్రచురించే సమాచారంలో స్పష్టత ఉండాలని భావిస్తున్న నేపథ్యంలో సెబీ ఈ చర్య తీసుకుంటోంది. ఇన్వెస్టర్లు మోసపోకుండా ఉండేందుకు ఇలాంటి తేడా తప్పనిసరి అని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	630	విజయవాడ	640
వరంగల్	632	గోదావరి	620
చిత్తూరు	663	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	108
వరంగల్	100	గుంటూరు	111
కరీంనగర్	100	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	102
కర్నూలు	100	నెల్లూరు	107
విశాఖపట్నం	105	అనంతపురం	107
గోదావరి	108		

అన్న క్యాంటీన్లకు సలహా కమిటీలు

- కమిటీ చైర్‌పర్సన్‌గా కార్పొరేటర్ లేక కౌన్సిలర్
- ఆహార నాణ్యత, పరిసరాల శుభ్రతపై దృష్టి
- వారానికి రెండు రోజులు క్యాంటీన్ల తనిఖీ



అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోని అన్న క్యాంటీన్ల నాణ్యతను పరిశీలించేందుకు రాష్ట్ర స్థాయి సలహా సంఘంతో పాటు ఆయా క్యాంటీన్లవారీగా సలహా కమిటీలను ని యమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీకి చైర్‌పర్సన్‌గా మునిసిపాలిటీ కార్పొరేటరు/కౌన్సిలరు (మునిసిపాలిటీ చైర్మన్ లేక జిల్లా ఇన్‌చార్జి మంత్రి నియమిస్తారు), సభ్యులుగా వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, వార్డు ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్స్ ప్రొటెక్షన్ సెక్రటరీ, స్థానిక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, స్వయం సహాయక సంఘం ప్రతినిధి, సభ్య కన్వీనర్‌గా అన్న క్యాంటీన్ల నోడల్ అధికారిని నియమించాలంటూ ఆదేశాలిచ్చారు. వారంలో రెండు రోజులు ఈ కమిటీ అన్న క్యాంటీన్లను తనిఖీ చేస్తుంది. వంటగదిని, భోజన తయారీ విధానాన్ని పరిశీలిస్తుంది. వడ్డించే కౌంటర్లు, డైనింగ్ ప్రాంతం, చెత్త నిర్వహణ, ఆహార నిల్వ ఏర్పాట్లు మున్సిపల్ ఆరోగ్య ప్రమాణాల ప్రకారం ఉన్నాయా? లేదా అనేది కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీలోని ఒక సభ్యుడు రోజూ అక్కడి భోజనం నాణ్యతను పరిశీలిస్తారు.

అర్బన్ చాలెంజ్ ఫండ్ నిర్వహణకు నోడల్ ఏజెన్సీ

కేంద్రం మంజూరు చేసిన అర్బన్ చాలెంజ్ ఫండ్ నిర్వహణకు నోడల్ ఏజెన్సీగా ఏపీయూఎఫ్ఐడీసీ ని (ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులిచ్చింది. బ్యాంకబుల్ ప్రాజెక్టుల వ్యయంలో 25శాతం వరకు నిధులను అర్బన్ చాలెంజ్ ఫండ్ ద్వారా, 50 శాతం బాండ్లు, బ్యాంకు రుణాల ద్వారా సమకూరితే, పీపీపీల ద్వారా మిగిలిన 25శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ఈ ఏడాది జూలై నుంచి 37 అదనపు కేంద్ర ప్రాయోజిత పథకాలను అన్ని రాష్ట్రాలు 'స్పర్శ' ద్వారా అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో అర్బన్ చాలెంజ్ ఫండ్ కూడా ఉంది.

జనవరి 1న అంతా లొంగిపోతాం

ఆయుధాలు కూడా అప్పగిస్తాం.. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి

- ఎలాంటి అరెస్టులు, ఎన్‌కౌంటర్లు చేయకండి
- మాకు భరోసానిచ్చే రాష్ట్రంలో లొంగుబాటు
- మూడు రాష్ట్రాల స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్ పేరిట మావోయిస్టుల లేఖ



చర్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల ఏరివేత అంశంలో కేంద్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోన్న వేళ మావోయిస్టుల నుంచి కీలక ప్రకటన విడుదలైంది. ఒక్కొక్కరుగా కాకుండా మావోయిస్టులంతా ఒకేసారి.. 2026 జనవరి 1న ఆయుధాలు వదిలి లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నామని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్(ఎంఎంసీ) స్పెషల్ జోన్ కమిటీ ప్రకటించింది. అయితే, జనవరి 1 దాకా కాల్పుల విరమణ పాటించాలని షరతు పెట్టింది. అలాగే, తమ భద్రతకు, పునరావాస ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు ఆయా రాష్ట్రాలు తమకు స్పష్టమైన హామీ ఇస్తే లొంగిపోతామని స్పష్టం చేసింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ స్పెషల్ జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్ పేరిట శుక్రవారం ఓ లేఖ విడుదలైంది. "మూడు రాష్ట్రాల సీఎంలకు ఈ లేఖ రాస్తున్నాం. జనవరి 1న సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించుకుని, ఆయుధాలు వదిలి పెట్టి జనజీవన స్రవంతిలో కలుస్తాం. అప్పటి దాకా కూంబింగ్‌లు నిలిపివేయాలి. అరెస్టులు, ఎన్‌కౌంటర్లు వంటివాటికి పాల్పడవద్దు. మేమే పెద్ద సంఖ్యలో లొంగిపోతాం. సతీశ్‌దాదా, సోనూ దాదాలు సీఎంల సమక్షంలో లొంగిపోయినట్లు మేం కూడా ఆయుధాలతో సహా వచ్చి మాకు భరోసానిచ్చే ప్రభుత్వం వద్ద లొంగిపోతాం. మా లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి స్పందన వచ్చింది. ఇంకా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల నుంచి స్పందన రాలేదు. మేం లొంగుబాటు ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎలాంటి ఘటనలకు పాల్పడబోం. మావోయిస్టులు అందరూ లొంగిపోవడానికి బావొ ఫెంగ్ యొక్క ఫ్రీక్వెన్సీ నంబరును 435.715 జారీ చేస్తున్నాం. జనవరి 1లోపు ఉదయం 11 నుంచి 11:15గంటల మధ్య ఒకరితో ఒకరు కనెక్టు అయి చర్చించాలి" అని ఆ లేఖలో పేర్కొన్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో శుక్రవారం పది మంది మావోయిస్టులు లొంగిపోయారు.

పొంతనలేని లేఖలతో గందరగోళం..

కొన్నిరోజుల క్రితం ఇదే అనంత్ పేరిట మావోయిస్టుల లేఖ విడుదలైంది. ఫిబ్రవరి 15 వరకు సమయం ఇవ్వాలని అందులో కోరారు. తర్వాత మూడు రోజులకే అనంత్ పేరిటే మరో లేఖ విడుదలైంది. మరోవైపు హిడ్మా ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈనెల 30న ఛత్తీస్‌గఢ్ బంద్‌కు పిలుపునిస్తూ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పేరిట శుక్రవారం మరో లేఖ విడుదలైంది. ఇలా వరుసగా మావోయిస్టుల పేరిట లేఖలు వస్తుండం, పొంతన లేకుండా ఉంటుండటంతో గందరగోళం నెలకొంది.

దేవా లొంగిపో.. తల్లి అభ్యర్థన

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో.. తర్వాత ఆ స్థాయి నాయకుడు బర్సె దేవా అని సమాచారం. దేవా పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. హిడ్మా, దేవా తల్లులు ఇద్దరూ అక్కాచెల్లెళ్లని మీడియాకు గ్రామస్తులు తెలిపారు. దేవా లొంగిపోవాలని ఆయన తల్లి సింఘే కోరారు.

లొంగిపోయే మావోయిస్టులకు భారీ రివార్డులు

భువనేశ్వర్, నవంబరు 28: రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని తుడిచిపెట్టడమే లక్ష్యంగా ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టుల లొంగుబాటు, పునరావాస పాలసీని సవరించింది. లొంగిపోవడానికి సిద్ధపడే మావోయిస్టు క్యాడర్‌ను బట్టి గరిష్ఠంగా 1.20 కోట్లు అందజేయనున్నట్లు ప్రకటించింది. గురువారం ఏడీజీ(యాంటీ నక్సల్స్ ఆపరేషన్) సంజీవ్ పాండ మీడియాతో మాట్లాడుతూ సవరించిన పాలసీలోని కీలక అంశాలను వివరించారు. కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలటరీ కమిషన్ సభ్యులెవరైనా ఒడిశాలో లొంగిపోతే తక్షణ ఆర్థిక సాయం కింద ఇచ్చే రూ.10 లక్షలతో కలిపి మొత్తం రూ.1.20 కోట్లు రివార్డును అందజేస్తామని తెలిపారు. క్యాడర్ స్థాయిలను బట్టి రూ.65 లక్షలు, రూ.33 లక్షలు, రూ.28.50 లక్షలు, రూ.22 లక్షలు, రూ.11 లక్షలు, రూ.5.50 లక్షలు, రూ.2.75 లక్షలు, రూ.1.65 లక్షలు రివార్డు కింద ఇస్తామని వివరించారు. ఆయుధాలతో లొంగిపోయే వారికి అదనంగా మరికొంత ఇవ్వనున్నట్లు తెలిపారు. గురువారం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం రూ.5 లక్షలకు మించి రివార్డును అందుకునే మావోయిస్టు పేరుతో రూ.10 లక్షలు అదనంగా బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. మూడేళ్ల తరువాత ఆ వ్యక్తి ప్రవర్తన సంతృప్తికరంగా ఉందని జిల్లా ఎస్పీ అధ్యక్షత ఉన్న కమిటీ నిర్ధారిస్తే రూ.10 లక్షలు ఆ వ్యక్తికి ఇచ్చేస్తారు. కొన్ని నిబంధనలకు లోబడి వారికి అంత్యోదయ గృహ యోజన పథకం కింద నివాసాన్ని, రూ.25,000 వివాహ ప్రోత్సాహక బహుమతిగా ఇస్తారు. కోర్టు కేసుల విషయంలో నేర తీవ్రతను బట్టి ఆరోపణలను వెనుక్కు తీసుకోవాలా వద్దా అనే విషయాలను నిర్దేశిత కమిటీ పరిశీలిస్తుంది. అలాగే కోర్టుల్లో వాదనలను వినిపించడానికి అవసరమైన న్యాయ సహాయాన్ని కూడా ప్రభుత్వం అందిస్తుంది. మావోయిస్టు సమాచారాన్ని ఇచ్చిన వారికి కూడా రివార్డులు అందజేస్తామని, వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని ఏడీజీ పాండ తెలిపారు.

'దిత్వా'.. తీరం దాటేదెక్కడ?!

- తుఫాన్‌పై నిపుణుల తర్జనభర్జన
- నేడు స్పష్టత వచ్చే అవకాశం
- దక్షిణ కోస్తా, సీమలపై ఎక్కువ ప్రభావం
- నేటి నుంచి తీరంలో గాలుల ఉధృతి
- రేపు నాలుగు జిల్లాల్లో కుంభవృష్టి
- ఓడరేవుల్లో 2వ నంబరు భద్రతా సూచిక
- తమిళనాడును కకావికలం చేసిన 'దిత్వా'

విశాఖపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీలంకను కకావికలం చేసి 56 మంది ప్రాణాలను బలిగొన్న 'దిత్వా' తుఫాన్ తమిళనాడు, దక్షిణ కోస్తా తీరం వైపు దూసుకొస్తోంది. అయితే తుఫాన్ ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా వైపు వస్తుందని చెబుతున్న భారత వాతావరణ శాఖ.. ఎక్కడ తీరం దాటుతుందనేది చెప్పలేదు. పలు అంతర్జాతీయ మోడళ్లు కూడా తీరం దాటే విషయంలో అంచనాలు వేస్తున్నాయి తప్ప స్పష్టత ఇవ్వడంలేదు. అయితే తుఫాన్ తీరం దాటే ప్రాంతాన్ని బట్టి కోస్తాంధ్రకు నష్టం ఉంటుందని మాత్రం వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

తుఫాన్ ప్రభావం ఇలా..

శ్రీలంక.. దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉన్న 'దిత్వా' తుఫాన్ శుక్రవారం గంటకు ఐదు నుంచి పది కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్యంగా పయనించింది. తుఫాన్ ప్రభావంతో శ్రీలంకలో కుంభవృష్టిగా వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ శుక్రవారం సాయంత్రానికి చెన్నైకు దక్షిణంగా 510 కి.మీ.దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి ఈనెల 30వ తేదీ ఉదయానికి ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర వైపు వస్తుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం శనివారం నుంచి మూడు రోజులపాటు కోస్తాంధ్ర, రాయలసీమలపై ఉండే అవకాశం ఉందని పేర్కొంది. తుఫాన్ ప్రభావంతో శనివారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల, ఉత్తరకోస్తాలో ఒకటి, రెండుచోట్ల వర్షాలు కురుస్తాయి. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ, ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయి. తుఫాన్ కోస్తా వైపు వచ్చే క్రమంలో శనివారం రాత్రి నుంచి వర్షాలు పెరగనున్నాయి. ఈనెల 30న కోస్తా, రాయలసీమల్లో విస్తారంగా, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో కుంభవృష్టిగా, ప్రకాశం, కడప జిల్లాల్లో అక్కడక్కడా అతిభారీ, బాపట్ల, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురవనున్నాయి. సోమవారం రాయలసీమ, దక్షిణ కోస్తాలో విస్తారంగా, ఉత్తర కోస్తాలో పలుచోట్ల వర్షాలు, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్, తిరుపతి, కడప జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయి. రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో రెండో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. శనివారం నుంచి కోస్తాలో తీరం వెంబడి గంటకు 50 నుంచి 60, అప్పుడప్పుడు 70 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. శనివారం అర్ధరాత్రి నుంచి గాలులు తీవ్రత మరింత పెరుగుతుంది.

ఏయే ప్రాంతాలపై ప్రభావం?

తుఫాన్ తీరం దాటే ప్రాంతాన్ని బట్టి కోస్తాంధ్రకు, చెన్నై, నెల్లూరు మధ్యన తీరం దాటితే నెల్లూరు, దానికి ఆనుకుని ఉమ్మడి చిత్తూరు, కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో కొంతభాగంపై ఎక్కువ ప్రభావం చూపుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. చెన్నైకు సమీపంగా వచ్చిన తరువాత తుఫాన్ కోస్తాంధ్రకు సమాంతరంగా వచ్చి కాకినాడ, మచిలీపట్నం మధ్య తీరం దాటితే ఉత్తరకోస్తాలో విశాఖపట్నం జిల్లా నుంచి నెల్లూరు వరకూ, దానికి ఆనుకుని రాయలసీమ జిల్లాల్లో వర్షాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. తుఫాన్ తీరం దాటే విషయంలో శనివారం స్పష్టత వస్తుందని మరికొందరు నిపుణులు చెబుతున్నారు. అయితే తుఫాన్ కోస్తా, రాయలసీమల్లో అనేక ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

'దిత్వా' తుఫాన్‌పై అప్రమత్తం

- హోం మంత్రి అనిత



అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'దిత్వా' తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హోంశాఖ మంత్రి అనిత స్పష్టం చేశారు. ఈ మేరకు తుఫాన్ ఎక్కువగా ప్రభావం చూపే తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. 'ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి. ప్రమాదకరమైన హోర్డింగ్‌లను వెంటనే తొలగించాలి. శిధిలావస్థలోని ఇళ్లలోని వారిని సురక్షత ప్రాంతాలకు తరలించాలి. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తుఫాన్ ప్రాంతాల్లో సిద్ధంగా ఉండాలి. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి'అని సూచించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పుట్టిన రోజున పెళ్లి చేసుకుందాం



వెంకటేశ్ కథానాయకుడిగా ఇంటిల్లిపాదిని అలరించిన చిత్రం 'పెళ్లి చేసుకుందాం'. ఇప్పుడు మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమైంది. సాయిలక్ష్మి ఫిల్మ్స్ పతాకంపై నిర్మాత వరప్రసాద్ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ 'వెంకటేశ్ నటించిన ఆణిముత్యాల్లాంటి చిత్రాల్లో 'పెళ్లి చేసుకుందాం' ఒకటి. ఆయన పుట్టిన రోజు సందర్భంగా డిసెంబర్ 13న రీ రిలీజ్ చేస్తున్నాం. వెంకటేశ్ అభిమానులతో పాటు సినీ ప్రేమికులు మరోసారి మా చిత్రాన్ని ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు. ఈ చిత్రంలో సౌందర్య, లైలా కథానాయికలు. ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో సి. వెంకట్రాజు-శివరాజు సంయుక్తంగా నిర్మించారు.



అభిమానులంతా ఆంధ్ర కింగ్సే

ఉపేంద్ర

"ఆంధ్ర కింగ్ తాలూకా' కథ విన్నప్పుడు థ్రిల్‌గా అనిపించింది. కానీ, టైటిల్ ఆంధ్ర కింగ్ అని చెప్పినప్పుడు కాస్త టెన్షన్ పడ్డాను. నేను ఆంధ్ర కింగ్ ఎలా అవుతాను అని అనిపించింది. కానీ, ఇప్పుడనిపిస్తోంది ఇక్కడున్న అభిమానులే అసలైన ఆంధ్ర కింగ్స్ అని. నేను కింగ్ లాగా ఫీలవుతున్నానంటే అది మీ గొప్పతనం. సినిమాని ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు కన్నడ నటుడు ఉపేంద్ర. రామ్ పోతినేని కథానాయకుడిగా పి.మహేశ్ బాబు తెరకెక్కించిన 'ఆంధ్ర కింగ్ తాలూకా'లో ఆయన కీలక పాత్ర పోషించారు. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా మేకర్స్ విలేకరుల సమావేశం నిర్వహించారు. దర్శకుడు మహేశ్ బాబు మాట్లాడుతూ' ఒక మంచి బృందంతో ప్రయాణం చేస్తున్నప్పుడు ఒక్కోసారి అద్భుతం జరుగుతుంది. అలాంటి అద్భుతమే ఈ 'ఆంధ్ర కింగ్ తాలూకా" అని అన్నారు. నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'సినిమా గురించి ప్రతి ఒక్కరూ చాలా పాజిటివ్‌గా మాట్లాడుతున్నారు. ఇది చాలా లాంగ్ రన్ ఉన్న సినిమా. కచ్చితంగా మూడు వారాలు ఆడుతుందనే నమ్మకముంది' అని చెప్పారు.

మహాశివుని సాక్షిగా... అఖండ విజయం తథ్యం



- నందమూరి బాలకృష్ణ

'అఖండ 2: తాండవం' చిత్రంలో ప్రేక్షకులు మహాశివుని శక్తిని, రుద్రతాండవ విన్యాసాన్ని, సనాతన ధర్మ పరాక్రమాన్ని చూస్తారు. ఆ త్రినేత్రుడి వీక్షణ దృష్టి నాలో నిక్షిప్తమై, ఆయన త్రిశూలం నా ఆయుధానికి శక్తి శూలమై ఎలా నిలిచిందో వెండి తెరపై చూస్తారు. మహాశివుని సాక్షిగా... అఖండ విజయం తథ్యం' అని నందమూరి బాలకృష్ణ అన్నారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించిన చిత్రమిది. డిసెంబర్ 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శుక్రవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. బాలకృష్ణ మాట్లాడుతూ 'సనాతన ధర్మం, మన మూలాల గురించి ఈ చిత్రంలో చెప్పబోతున్నాం. ఇటీవల యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ గారికి ట్రైలర్ చూపించగా, సనాతన ధర్మం గొప్పతనాన్ని అద్భుతంగా ఆవిష్కరించారని ప్రశంసించారు. హిందీ వెర్షన్‌లోనూ నా పాత్రకు స్వయంగా డబ్బింగ్ చెప్పాను' అని తెలిపారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ "అఖండ' చిత్రం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అందుకే తాండవం చేస్తే పరమేశ్వరుడే కనిపించాలనే కసితో ఈ సీక్వెల్ చేశాం. శత్రువులు దేశాన్ని నాశనం చేయాలని చూస్తే మన సైన్యం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా చూపించబోతున్నాం' అని పేర్కొన్నారు.

ఆది పినిశెట్టి మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి బోయపాటి గారు చెబుతున్నప్పుడు 'నేను బాలయ్య గారి పక్కన సరిపోతానా?' అని అనుకున్నాను. ఆయనతో మళ్లీ మళ్లీ పనిచేయాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో బాలయ్య గారి ఎనర్జీ మరోసారి ప్రేక్షకులను అమితంగా అలరిస్తుంది' అని చెప్పారు.

గోపీ ఆచంట మాట్లాడుతూ 'కెమెరా ముందు బాలయ్య బాబు తాండవం, కెమెరా వెనుక డైరెక్టర్ బోయపాటి గారి తాండవం... థియేటర్లలో ప్రేక్షకుల తాండవం ఖాయం' అని అన్నారు. తమన్ మాట్లాడుతూ 'ఈ సినిమాకు సంగీతం నేను అందించలేదు. ఆ శివుడే నాతో చేయించుకున్నాడు. డిసెంబర్ 5న బాక్సులు పగిలిపోయి, స్పీకర్లు పేలిపోయాయని ఎవరూ ఫిర్యాదు చేయకూడదు. ముందే సర్వీస్ చేయించి పెట్టుకోండి' అని సరదాగా స్పందించారు. ఈ చిత్రంతో మరోసారి బాలయ్య బాబు నట విశ్వరూపాన్ని ప్రేక్షకలోకం చూస్తుందని సంయుక్త చెప్పారు.

వంద జన్మలైనా రజనీగానే పుట్టాలి

● ఇఫీ ముగింపు వేడుకల్లో సూపర్‌స్టార్‌కు ఘన సత్కారం



'నేను సినిమాల్లోకి వచ్చి 50 ఏళ్లు పూర్తయ్యాయంటే నాకే ఆశ్చర్యంగా ఉంది. నాకు ఈ 50 ఏళ్లు కేవలం పదీ, పదిహేను ఏళ్లలా గడిచిపోయాయి. సినిమా అంటే నాకున్న విపరీతమైన ప్రేమ వల్లే సమయం ఇంత వేగంగా గడిచిపోయిందేమో. నాకు మరో వంద జన్మలు ఉన్నా మళ్లీ రజనీకాంత్ గానే పుట్టించమని ఆ దేవుణ్ణి కోరుకుంటాను' అని హీరో రజనీకాంత్ అన్నారు. 56వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం (ఇఫీ) ముగింపు వేడుకలు శుక్రవారం రాత్రి గోవాలో అట్టహాసంగా జరిగాయి. భారతీయ సినిమాకు 50 ఏళ్లుగా అసమాన సేవలు అందిస్తున్న రజనీకాంత్‌ను ఈ వేదికపై ఘనంగా సత్కరించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ రజనీకాంత్‌కు శాలువా కప్పి, ప్రత్యేక జ్ఞాపికను అందించి గౌరవించారు.



వియత్నాం చిత్రానికి స్వర్ణ మయూరం

ఇఫీ పురస్కారాల విజేతల జాబితాను ప్రకటించి, అవార్డులను అందజేశారు. వియత్నాంకు చెందిన 'స్కిన్ ఆఫ్ యూత్' చిత్రం ఉత్తమ చిత్రంగా ఎంపికై ప్రతిష్ఠాత్మక గోల్డెన్ పీకాక్ పురస్కారం దక్కించుకుంది. ఉత్తమ నటుడి పురస్కారం ఉబెయ్‌మార్ రియోస్ ('స్పానిష్ చిత్రం - ఏ పోయెట్)కు దక్కింది. ఉత్తమ నటిగా 'జరా సోఫియా ఓస్టాన్ (స్లోవేనియన్ ఫిల్మ్ - లిటిల్ ట్రబుల్ గర్ల్స్), ఉత్తమ దర్శకుడుగా సంతోష్ దవాఖర్ (మరాఠీ చిత్రం - 'గోంధాల్) ఎంపికయ్యారు. ఉత్తమ భారతీయ తొలి చిత్ర దర్శకుడి పురస్కారం కరణ్ సింగ్ త్యాగి (కేసరి ఛాప్టర్ 2)ని వరించింది. హిందీ సిరీస్ బందీశ్ బాండిట్స్ 2 ఉత్తమ వెబ్‌సిరీస్‌గా నిలిచింది.



పతాక సన్నివేశాలే ప్రత్యేకాకర్షణగా

"పతంగ్' సినిమా క్లైమాక్స్ కోసం ఎంతో ఖర్చు పెట్టారు. ఓ స్టేడియాన్ని తీసుకుని, పతంగుల పోటీ పెట్టి పతాక సన్నివేశాలను ఎంతో భారీగా చిత్రీకరించారు. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది. కొత్తతరం అంతా కలసి తీసిన ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధించాలి' అని నిర్మాత డి.సురేశ్ బాబు ఆకాంక్షించారు. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ప్రధాన పాత్రధారులుగా ప్రణీత్ ప్రత్తిపాటి తెరకెక్కించిన చిత్రం 'పతంగ్'. విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి, నాని బండ్రెడ్డి నిర్మాతలు. డి.సురేశ్ బాబు సమర్పణలో డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. శుక్రవారం చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో 'ఎమోషనల్ డ్రామా' అంటూ సాగే పాటను సురేశ్ బాబు ఆవిష్కరించారు. నాని బండ్రెడ్డి మాట్లాడుతూ 'నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా. అందరికీ నచ్చుతుందనే నమ్మకముంది' అని అన్నారు.

అహో... అమరావతి!

ఆర్థిక నగరిగా అడుగులు

- ఒకేచోట కొలువుతీరనున్న 13 బ్యాంకులు
- ముంబై నుంచి తరలి వచ్చిన బ్యాంకింగ్ దిగ్గజాలు

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతిలో 'ఆర్థిక నగరి' ఏర్పాటు దిశగా తొలిఅడుగు పడింది. దేశంలోనే తొలిసారిగా... ఒకే రోజున 15 బ్యాంకులు, ఎల్ఐసీ వంటి సంస్థల జోనల్ కార్యాలయాలు, సర్కిల్ ఆఫీసులు, ప్రధాన కార్యాలయాల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు పాల్గొన్న ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులుశెట్టితో సహా ఆయా బ్యాంకుల ఎండీలు, సీఎండీలు, ఉన్నతస్థాయి అధికారులు ముంబై నుంచి తరలి వచ్చారు. రాయపూడిలో ఇటీవల ప్రారంభించిన ఏపీసీఆర్డీఏ కార్యాలయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి పరిశీలించారు. ఆయా బ్యాంకులు, సంస్థల కార్యాలయాల శంకుస్థాపనకు సంబంధించిన ఉమ్మడి ఫలకాన్ని రిమోట్ ద్వారా ఆవిష్కరించారు. దీనిని ఆవిష్కరించాలని చంద్రబాబును ఆమె పదేపదే కోరినా ఆయన అంగీకరించకుండా... ఆమె చేతనే ఆవిష్కరింపచేశారు. ఎస్‌బీఐ ఎల్‌హెచ్‌వో భవన శంకుస్థాపన ఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఆ తర్వాత ఒక్కో బ్యాంకు, ఆర్థిక సంస్థల భవనాల ఫలకాలను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయాలు... కెనరా బ్యాంక్ సర్కిల్ ఆఫీస్, ఆప్కాబ్ ప్రధాన కార్యాలయం, ఇతర బ్యాంకులు రాష్ట్రస్థాయి కార్యాలయాలకు భూమిపూజ జరిగింది. ఆ బ్యాంకులు తమకు కేటాయించిన స్థలాలకు ఫెన్సింగ్ వేసి... తాము నిర్మించబోయే భవనాల నమూనాలతో 'స్వాగత' తోరణాలు ఏర్పాటు చేశాయి. దీంతో... ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ ప్రాంతానికి 'బ్యాంక్ స్ట్రీట్' అని నామకరణం చేశారు. రాజధానిలో కార్యాలయాల శంకుస్థాపనకు వచ్చిన బ్యాంకుల ఉన్నతాధికారులకు సీఆర్డీయే అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. వీరిలో చల్లా శ్రీనివాసులు(ఎస్‌బీఐ), సత్యన్నారాయణ రాజు(కెనరా బ్యాంకు), దేబదత్తా చాంద్ (బ్యాంక్ ఆఫ్ బరోడా), రాకేశ్ శర్మ(ఐడీబీఐ),అజయ్ కుమార్ శ్రీవాస్తవ(ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు), వినోద్ కుమార్(ఇండియన్ బ్యాంకు), ఆశిష్‌రెడ్డి(యూనియన్ బ్యాంక్), కల్యాణ్ కుమార్ (సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), అశోక్ చంద్ర (పంజాబ్ నేషనల్ బ్యాంకు), రజనీశ్ కర్నాటక్ (బ్యాంక్ ఆఫ్ ఇండియా), ప్రమోద్‌కుమార్‌రెడ్డి(ఏపీ గ్రామీణ్ బ్యాంకు), శ్రీనాథ్ రెడ్డి (ఆప్కాబ్), నాబార్డు ఎండీ షాజీ కేవీ, ఆర్ దొరైస్వామి(ఎల్ఐసీ), గిరిజ సుబ్రహ్మణియన్ (న్యూ ఇండియా ఎస్యూరెన్స్) ఉన్నారు.

ఎల్‌హెచ్‌వో విశేషాలు...

రాజధానిలో ఎస్‌బీఐ నిర్మించబోతున్న లోకల్ హెడ్ ఆఫీసు విశిష్టతలను నిర్మల సీతారామన్, చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. రూ.311 కోట్ల అంచనా విలువతో... స్థానికత ఉట్టిపడే డిజైన్‌లో భవనాన్ని నిర్మించబోతున్నట్లు అధికారులు తెలిపారు. లక్ష చ.గ. విస్తీర్ణంలో 14 అంతస్తుల డిజైన్‌ని ఆమోదించామన్నారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ ఖరారు చేసి ఏజెన్సీని ఎంపిక చేసి పనులు ప్రారంభించి శరవేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.



సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమక్షంలో ఏపీ సీఆర్డీఏతో ఒప్పందం చేసుకుంటున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ ప్రతినిధులు. చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, పయ్యావుల తదితరులు

రాజధానిలో కాస్మోస్ ప్లానిటోరియం

- ఆస్ట్రో ఫిజిక్స్‌తో సీఆర్డీఏ ఎంవోయూ

నిర్మలా సీతారామన్, చంద్రబాబు సమక్షంలో.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్‌తో సీఆర్డీఏ ఎంవోయూ కుదుర్చుకుంది. ఐదెకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కాస్మోస్ ప్లానిటోరియం నిర్మాణానికి ఈ ఒప్పందం జరిగింది. సంస్థ డైరెక్టర్ అన్నపూర్ణి సుబ్రమణియం స్వయంగా ఎంవోయూ చేసుకోవడం పట్ల కేంద్ర ఆర్థిక మంత్రి హర్షం వ్యక్తం చేశారు.


ఒక్క ఐదేళ్లు సహకరించండి!

ఆ తర్వాత దేశ ఆర్థిక ప్రగతికి వెన్నెముకగా నిలుస్తాం

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలకు సీఎం వినతి
- రాష్ట్రానికి నిర్మలా సీతారామన్ చేయూత
- నల్లమలసాగర్‌కూ సహకరించాలి: సీఎం
- బ్యాంకు కార్యాలయాల శంకుస్థాపనతో ఆర్థిక ప్రగతికి పునాది: పవన్ కల్యాణ్
- ఆపేయడానికి అమరావతి స్విచ్ కాదు: లోకేశ్

ముంబైలో ఉండాల్సిన ఆర్థిక దిగ్గజ సంస్థల ప్రముఖులంతా ఇవాళ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చొరవతో అమరావతిలో కొలువుదీరారు. కొత్త నగరం, కొత్త రాజధాని అమరావతి. ఇది బ్యాంకర్లకు మంచి అవకాశం. సద్వినియోగం చేసుకుని మెరుగైన సేవలు అందించాలి.

- సీఎం చంద్రబాబు



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, కేంద్రమంత్రి పెమ్మసాని

గుంటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్క ఐదేళ్లు మీరు సహకరించండి.. ఆ తర్వాత మేం నిలదొక్కుకోవడమే కాదు.. దేశ ఆర్థిక ప్రగతికి కూడా వెన్నెముకగా నిలుస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. రాజధాని అమరావతి పరిధిలోని రాయపూడిలో ఏపీసీఆర్డీఏ కార్యాలయంలో బ్యాంకుల శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. సీఎం, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, పి.నారాయణ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో కలిసి నిర్మలా సీతారామన్ 13 కేంద్ర బ్యాంకులు, 2 బీమా సంస్థల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు (తద్వారా అన్ని బ్యాంకు సర్వీసులూ ఒకచోట ఉండేలా బ్యాంకింగ్ స్ట్రీట్ ఏర్పాటుకు సిద్ధమైంది). ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్, ప్రధాని మోదీ ఆర్థిక చేయూతనిచ్చి ఊపిరి పోశారని తెలిపారు. 'ఇప్పటికైతే బయటపడ్డాం. కానీ ఇంకా నిలదొక్కుకోవలసి ఉంది. ఆ దిశగా అడుగులు వేస్తున్నాం. 2027 మార్చినాటికి పోలవరం.. 2028 నాటికి అమరావతిని పూర్తి చేస్తాం. నా కంటే వేగంగా కేంద్ర మంత్రి నిర్మల స్పందించి అమరావతికి రూ. 15 వేల కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించి పనులు మొదలుపెట్టాలని చెప్పారు. ఆ ఐదేళ్లలో పోలవరం ఆగిపోయి, డయాఫ్రం వాల్ దెబ్బతిని.. ఆశలు వదులుకునే దశలో ఉన్న మనకు రూ.1,000 కోట్లు తక్షణ సహాయం అందజేసి డయాఫ్రం వాల్ పనులు మొదలుపెట్టించారు. ఇప్పుడు అమరావతి కోసం దేశ ఆర్థిక వ్యవస్థను మొత్తం ఒక చోటకు తెచ్చారు' అని కొనియాడారు. నాడు దేశంలోనే తొలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను సైబరాబాద్‌లో నిర్మించానని, మళ్లీ ఇప్పుడు అమరావతిలో 'బ్యాంకింగ్ స్ట్రీట్'ను కూడా తానే నిర్మిస్తుండడం, అందుకు కేంద్ర ఆర్థిక మంత్రి తోడ్పాటునివ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. అమరావతి ఆర్థిక నగరం చాలా ప్రత్యేకమైనదని, బ్యాంకు సేవలన్నీ ఒకే చోట ఉండేలా చేయడంతోపాటు, వారికి అవసరమైతే ప్రత్యేక టవర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు సులభతర లావాదేవీలను అందించాలని కోరారు. ప్రధాని మోదీ, కేంద్రం సహకారంతోనే విశాఖ ఉక్కు నిలిచిందని, అతిపెద్ద డేటా సెంటర్ రాష్ట్రానికి వచ్చిందని, రాయలసీమలో 9 జిల్లాల్లో హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేసేందుకు వీలైందని చంద్రబాబు చెప్పారు. అది మాత్రమే సరిపోదని.. పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుకు కూడా నిర్మలా సీతారామన్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పూర్వోదయ ప్రాజెక్టు కింద ఉత్తరాంధ్రకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉందని, అందుకు సహకరించాలని, రాజధాని రైతులకు క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు మరో రెండేళ్లు పొడిగించాలని, అమరావతి అన్‌స్టాపబుల్‌గా దూసుకుపోయేందుకు అన్నివిధాలా సహకరించాలని అభ్యర్థించారు. 2014లో ప్రపంచంలో 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మల నేతృత్వంలో ఇప్పుడు 4వ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, వచ్చే ఏడాదికి మూడో ఆర్థిక వ్యవస్థగా, 2038 నాటికి రెండో ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి ప్రపంచ నంబర్‌వన్ ఎకానమీగా ఎదుగుతుందని, అందులో ఏపీ గణనీయమైన పాత్ర పోషించబోతోందని చెప్పారు. స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్స్ సిటీలను ప్రారంభిస్తున్నామని, జనవరి నుంచి క్వాంటం కంప్యూటర్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అమరావతిలో గ్రీన్‌బిల్డింగ్స్, గ్రీన్ ఎనర్జీ, కావలసినంతనీరు ఉందని.. రాబోయే రోజుల్లో అద్భుతమైన కాంబినేషన్ ఉన్న నగరంగా ఉండబోతోందన్నారు.

ఇది కేంద్రం వాగ్దానం: పెమ్మసాని



అమరావతిలో బ్యాంకులకు శంకుస్థాపన.. భవిష్యత్ తరాలకు కేంద్రం ఇచ్చే వాగ్దానంగా ఉంటుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఎయిమ్స్ వసతులపై తాను, లోకేశ్ అడగ్గానే.. 540 ఉద్యోగాలు కల్పించి సమస్యలను పరిష్కరించారన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్. నాగరాజు తదితరులు మాట్లాడారు. మంత్రులు కందుల దుర్గేశ్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, సీఎస్ విజయానంద్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, 15 బ్యాంకులు, బీమా సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఆర్థిక ప్రగతికి పునాది

- డిప్యూటీ సీఎం

రాష్ట్ర పునర్నిర్మాణానికి కేంద్రం అందిస్తున్న సాయం మరువలేనిదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రోత్సాహం విలువైనదని సభలో అన్నారు. 'అమరావతిలో బ్యాంకు కార్యాలయాల శంకుస్థాపనతో ఆర్థిక ప్రగతికి పునాది పడింది. రాష్ట్ర ప్రగతి కోసం వేసే ప్రతి అడుగుకు కేంద్రం సహకరిస్తోంది. సహకారం కాగితాలకు పరిమితం కాకుండా, కార్యరూపం దాల్చేందుకు తోడ్పడుతోంది. బ్యాంకు స్ట్రీట్ విధానం వల్ల పెట్టబడిదారుల విశ్వాసం పెరిగి, అమరావతి అభివృద్ధికి బాటలు పడతాయి' అని ఆకాంక్షించారు.

జై అమరావతి అంటే జైల్లో పెట్టారు: లోకేశ్



మూడు రాజధానుల పేరుతో ఆడిన మూడు ముక్కలాటను, ఒక వ్యక్తి రూ.700 కోట్లతో ఇల్లు కట్టుకోవడాన్ని కళ్లారా చూశామని లోకేశ్ అన్నారు. 'భూములిచ్చిన రైతులు జై అమరావతి అంటే జైల్లో పెట్టారు. అయినా వెనక్కి తగ్గకుండా 1631 రోజులు ఉద్యమం చేసి.. 270 మంది బలిదానంతో అమరావతిని రక్షించుకున్నారు. ఆపేయడానికి అమరావతి అనేది ఎవరింట్లోనూ స్విచ్ కాదు. అది పవర్‌ఫుల్. ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన అమరావతి. దానిని కదిలించడం ఎవరి తరమూ కాదు' అని స్పష్టంచేశారు. నిర్మలా సీతారామన్ స్త్రీశక్తికి ప్రతిరూపమని.. ఆమె చేయూతతో అమరావతి నిర్మాణం దూసుకుపోతోందని చెప్పారు. మంగళగిరి చేనేత వస్త్రాలను ధరించి ప్రమోట్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ చాంబర్స్ ప్రతినిధులు పొట్లూరి భాస్కరరావు, బి.రాజశేఖర్, ఆర్.వి.స్వామి, మురళీకృష్ణ

ఉత్పాదకత పెంపునకు సహకరించండి

- కేంద్ర మంత్రి నిర్మలకు ఏపీ చాంబర్స్ ప్రతిపాదనలు

అమరావతి, విజయవాడ సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రపంచంతో పోటీ పడేలా దేశీయ ఉత్పాదకతను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ చాంబర్స్ ప్రతినిధులు పొట్లూరిభాస్కరరావు, బి.రాజశేఖర్, ఆర్.వి.స్వామి, మురళీకృష్ణ వినతిపత్రాన్ని ఇచ్చారు. ప్రపంచ స్థాయి పోటీ తత్వాన్ని దేశంలో పెంచడానికి డిజిటల్ ఆటోమేషన్, ఏఐ, రోబోటిక్, ఇంధన ఆదా పరికరాల ఉత్పత్తి, మౌళిక పరీక్ష సదుపాయాలను ప్రోత్సహించాలని కోరారు.

ఆతిథ్య రంగానికి ఐటీసీ ప్రయోజనాలు పునరుద్ధరించండి

అతిథ్య రంగానికి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ) ప్రయోజనాలను పునరుద్ధరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌ను ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, సలహాదారు ఎం.మురళీ కోరారు. ఐటీసీ ప్రయోజనాలు లేకుండా హాస్పిటాలిటీ రంగం 5 శాతం జీఎస్టీని చెల్లిస్తుందని, దీని కారణంగా పెట్టుబడుల ఖర్చు పెరిగి రాబడి తగ్గుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పుష్కరాలకల్లా పోలవరం పూర్తి చేయండి

- ముఖ్యమంత్రికి సూచించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచించారు శుక్రవారం అమరావతిలో పర్యటించిన కేంద్ర మంత్రికి ఈ ప్రాజెక్టుపై సీఎం సమక్షంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పగా.. నిర్మల జోక్యం చేసుకుని..ప్రజలకు సెంటిమెంటుగా ఉన్న గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. 2027 జూన్ నాటికి పూర్తి చేస్తే ప్రజలు పవిత్ర దినాల్లో పోలవరం ప్రాజెక్టు ప్రారంభమైందని భావిస్తారని తెలిపారు. సీఎం స్పందిస్తూ.. పుష్కరాల సమయానికి ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రాజెక్టు రెండో దశకు రూ.35,000 కోట్లు వ్యయమవుతుందని, వీటిని కేంద్రం ఇవ్వాలని కోరారు. ఇందులో కుడి, ఎడమ కాలువల విస్తరణ పనులకు రూ.3,000 కోట్లు, నిర్వాసితులకు ఉద్దేశించిన కార్యక్రమాలకు రూ.32వేలకోట్లు ఖర్చవుతాయని చెప్పారు. తొలిదశకు మరో రూ.2,000 కోట్లు ఇవ్వాలని సాయిప్రసాద్ కోరారు.

పోలవరానికి ఆర్థిక సాయం అందించండి

పోలవరం ప్రాజెక్టు, పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పనుల ప్రగతిని సాయిప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పనులకు రూ. 58,700 కోట్ల మేర వ్యయం కానున్నాయని చెప్పారు. త్వరలోనే అభ్యర్థన లేఖను అందిస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు తొలిదశకు రూ. 2,000 కోట్లు, రెండోదశకు రూ. 32,000 కోట్లు విడుదల చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ప్రజెంటేషన్‌లో మంత్రి రామానాయుడు పాల్గొన్నారు.

అమరావతిలో.. ఆర్థిక నగరం

- అమరావతి రాజధాని నిర్మాణం పునఃప్రారంభించడం బ్రహ్మయజ్ఞం లాంటిది. దానిని చంద్రబాబు మొదలుపెట్టగా.. ప్రధాని మోదీ వచ్చి మద్దతు తెలిపారు. సమగ్ర ప్రణాళికతో నూతన రాజధాని నిర్మించడం సామాన్యమైన పని కాదు.
- ఆంధ్రప్రదేశ్ గురించి నేను ప్రధాని వద్దకు ఎప్పుడు వెళ్లినా.. రాష్ట్రంలోని ఏ ప్రాంతమూ వెనుకబడకూడదని చెబుతున్నారు. విభజన తర్వాత ముందుకు వేగంగా ముందుకెళ్లాల్సిన రాష్ట్రమని, ఎంతో సహకరించాలని ఆదేశాలిస్తున్నారు. అందుకు ప్రధానికి కృతజ్ఞతలు. బడ్జెట్‌లో ఏపీకి న్యాయం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాను.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ డైరెక్టర్ అన్నపూర్ణి సీరియస్‌గా తీసుకుని ఏడాదిన్నరలో అమరావతిలోని ప్లానిటోరియం నిర్మాణాన్ని పూర్తి చేయాలి. రాజధానిలో మేజర్ ప్రాజెక్టులు పూర్తయ్యేనాటికి ప్లానిటోరియం నిర్వహణలోకి రావాలి. ఇక్కడున్న పిల్లలందరూ వెళ్లి చూడాలి. ఈ ప్రాజెక్టు బ్యాంకుల కంటే ఎక్కువ.

-నిర్మలా సీతారామన్



ప్రసంగిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

(మొదటి పేజీ తరువాయి)

ఆమె ప్రసంగించారు. దేశంలో ప్రప్రథమంగా ఆర్థిక జిల్లాను హైదరాబాద్‌లో నిర్మించింది అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబేనని నిర్మల గుర్తు చేశారు. మళ్లీ ఆ అవకాశం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఆయనకే లభించిందని చెప్పారు. నాడు హైదరాబాద్‌లో అమలు చేసిన కార్యక్రమాలు నేడు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చి ఆర్థిక ఫలాలు అందిస్తున్నాయని.. చంద్రబాబుకు ఇలాంటి అవకాశం వచ్చినందుకు చాలా గర్వంగా ఉందని తెలిపారు. ఎంతో క్లిష్టమైన ఈ బాధ్యతను ఆయన తన భుజాలపై మోసి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. ఆయన సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దృఢమైన రాజధాని అమరావతి రూపంలో ఏర్పడుతుందన్న విశ్వాసం తనకు ఉందన్నారు. నిర్మలా సీతారామన్ ఇంకా ఏం చెప్పారంటే..

ఏపీ శక్తికి అనుగుణంగా బ్యాంకింగ్

ఆంధ్రప్రదేశ్ శక్తి, సామర్థ్యాలను అర్థం చేసుకుని.. వాటికనుగుణంగా బ్యాంకింగ్ కార్యకలాపాలు ఉండాలి. ప్రాంతీయ ప్రధాన కార్యాలయాల ఏర్పాటు ఒక్కటే చాలదు. ఈ రాజధాని నిర్మాణంలో రైతులు చాలా పెద్ద త్యాగం చేశారు. అది మనం మరచిపోకూడదు. కొత్త అమరావతి అంటే మనకు గుర్తుకొచ్చేది రైతులే. రైతులకు సమస్య లేకుండా బ్యాంకింగ్, బీమా సదుపాయాలు అందించడం బ్యాంకింగ్, బీమా కంపెనీల బాధ్యత. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా ఇచ్చే రూ.లక్ష రుణాలకే పరిమితం కాకూడదు. రాయలసీమలోని తొమ్మిది జిల్లాల్లో ఉద్యాన హబ్ ఏర్పాటు చేస్తామని సీఎం చెబుతున్నారు. దాని ప్రభావం ఆ ప్రాంతానికే కాకుండా అన్ని జిల్లాల్లో ఉంటుంది. ఈ సమయంలో బ్యాంకులు తాజాగా ఆలోచన చేయాలి. కూరగాయలు, పండ్లకు ఏపీని హబ్‌గా చేయాలనేది సీఎం ఆలోచన. దానికి మౌలిక సదుపాయాల కల్పనకు బ్యాంకర్లు సహకరించాలి. 'పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన'లో పేదలకు ఉచిత బియ్యం అందుతున్నాయి. అది చాలదు. ప్రధాని పోషకాహార భద్రత గురించి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బియ్యంతో పాటు పప్పులు, కాయగూరలు, పండ్లు ప్రజలకు అవసరం. వాటిని ఆంధ్రలో రాయలసీమలాంటి తొమ్మిది జిల్లాలు పండించినప్పుడు.. కావలసిన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, నాణ్యమైన విత్తనాలు, ప్యాకేజింగ్ ఉండాలి. ఒక రాష్ట్రం రైతుల సంక్షేమం కోసం ఏదైనా ప్లాన్ చేసినప్పుడు అండదండగా ఉండాలి.

బీమా లాభాలు అమరావతికి అందాలి

'బీమా సఖి' కార్యక్రమాన్ని రెండేళ్ల కిందట హరియాణాలో ప్రధాని మోదీ ప్రారంభించారు. బీమా కంపెనీలకు ఏజెంట్లుగా మహిళలను గ్రామగ్రామానికీ పంపించారు. ఒకే రోజున మూడు లక్షల మంది చేరారు. ఏడాదిలో దాని ఫలితం అద్భుతం. బీమా కవరేజ్ జరుగుతోంది. మహిళలకు ఆదాయమూ వస్తోంది. అలాంటి లాభాలను బ్యాంకులు అమరావతికి అందించాలి.

ఐటీఐ ద్వారా ఏఐ శిక్షణ కేంద్రాలు

చంద్రబాబు క్వాంటమ్ హబ్, ఏఐకోసం ఎంతగానో కృషి చేస్తున్నారు. ఏఐ విస్తరణకు 'ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఇండస్ట్రీ కౌన్సిల్ (ఐటీఐ)'కి కేంద్ర బడ్జెట్ ద్వారా నిధులు అందుతున్నాయి. ఐటీఐ ద్వారా ఏఐ శిక్షణ కేంద్రాలను సంకల్పించాం. పైలట్ ప్రాజెక్టుగా ఏపీలో రెండు జిల్లాల్లో శ్రీకారం చుట్టబోతున్నాం. అక్కడ యువకులు శిక్షణ పొందితే ఉద్యోగాలు వెంటనే వస్తాయి.

కెమిస్ట్రీ, ఫిజిక్స్‌కు ఏపీలో ప్రాధాన్యమివ్వాలి..

కోర్ సైన్సెస్‌కు ప్రాధాన్యం గురించి మంత్రి లోకేశ్ అడిగారు. స్కూలు పిల్లల సమయం నుంచే ఆస్ట్రోఫిజిక్స్ గురించి మాట్లాడతాం. నా కుటుంబంలో మూడు నాలుగు తరాలు ఇదే విషయం చెప్పేవాళ్లు. ఒకప్పుడు బెనారస్‌కు వెళ్లి సైన్స్ చదవాలని ఉండేది. ఆంధ్ర నుంచి ఆ యూనివర్సిటీలో ఎక్కువ మంది సైన్స్ విద్యార్థులుండేవారు. సైన్స్‌కు పేరు ప్రఖ్యాతలు గడించిన ప్రాంతం ఆంధ్ర. ఇప్పుడు ఐటీలో చాలా దృష్టి పెట్టి ముందుకుపోతోంది. అయితే కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో పేరుగాంచిన వాళ్లు ఇక్కడ లేరు. వాటికి కూడా మనం ప్రాధాన్యం ఇవ్వాలి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్‌తో ఎంవోయూ చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు. ఆస్ట్రోఫిజిక్స్‌పై ఎంతగానో పనిచేస్తున్న డైరెక్టర్ అన్నపూర్ణి వచ్చి సీఎంతో ఒప్పందం చేసుకున్నారంటే అంతకంటే గొప్ప విషయం మరొకటి లేదు. లద్దాఖ్‌కు ఎవరైనా కొత్తగా వెళ్తే శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు పడుతుంటారు. రెండు రోజుల పాటు చాలా జాగ్రత్తగా ఉండాలని అందరూ చెబుతారు. అక్కడ ప్రాణవాయువు తక్కువగా ఉంటుంది. ఆ ప్రాంతం నుంచి ఇంకా లోతుగా వెళ్తే హ్యాండ్‌లే అనే ప్రదేశం ఉంటుంది. అక్కడ గాఢాంధకారం ఉంటుంది. ఆకాశంలో ఉన్న ప్రతి నక్షత్రాన్ని చూసేంత చీకటి ఉంటుంది. బైనాక్యులర్స్ అవసరం లేదు. మొత్తం పాలపుంత కనిపిస్తుంది. అక్కడ సంస్థ ఏర్పాటు చేసి అన్నపూర్ణి నడుపుతున్నారు. నేనోసారి వెళ్లి చూశాను. ఆ అనుభూతి మరిచిపోలేనిది. ఆ పాలపుంతను రియల్‌టైంలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో చూపించడానికి ప్లానిటోరియం ఏర్పాటు చేస్తున్నారు. మొట్టమొదటిది మైసూరులో ఏర్పాటు చేశారు. దానిని కన్నడ విద్యార్థులు సందర్శిస్తూ సైన్స్‌లో ఎంతగానో ముందుకెళ్తున్నారు. దేశంలో చాలా ప్లానిటోరియంలు ఉన్నాయి. అయితే వాళ్లు ఆకాశాన్ని రికార్డు చేసి పెడతారు. అది సందర్శకులకు చూపిస్తారు. ఇక్కడ టెక్నాలజీని వినియోగించి రియల్ టైంలో అబ్జర్వేటరీ ద్వారా

సైన్స్ ఆంధ్రలో ఎంత ముఖ్యమో...

సైన్స్ ఆంధ్రలో ఎంత ముఖ్యమో చెప్పాలంటే.. ఒకసారి నేను విద్యార్థులతో కలిసి టిబెట్‌కు వెళ్లాను. అక్కడ బౌద్ధ ప్రదేశాలు చూపించాం. కష్టమైనా అనుమతి తీసుకున్నాం. రసాయన శాస్త్రంలో బౌద్ధాచార్యుడు ఆచార్య నాగార్జునుడి నైపుణ్యం గురించి అక్కడి బౌద్ధులు చెప్పారు. నేటికీ మాట్లాడతారు. ఆచార్య నాగార్జునుడు ఆంధ్ర నుంచే టిబెట్‌కు వెళ్లి బౌద్ధ మతాన్ని విస్తరించారు. ఆ స్ఫూర్తితో ఏపీ గురించి ఎక్కడికెళ్లినా చెప్పుకొనేలా రాష్ట్రాన్ని నిర్మించాలి.

అరుదైన ఖనిజాలపై దృష్టిపెట్టాలి..

ఎన్నో మెటీరియల్స్ చైనా నుంచి వస్తున్నాయి. అరుదైన భూమి ఖనిజాలు రావడానికి మాత్రం ఎన్నో ఆటంకాలు. అలాంటి ఖనిజాలను ఇక్కడ తయారు చేయాలంటే శాస్త్ర, సాంకేతిక రంగంలో దేశం మరింత ముందుకెళ్లాలి. ఆధునిక అమరావతిలో అంత ఆధునికంగా సైన్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే మన పిల్లలు సైన్స్‌లో మాస్టర్ క్లాస్ చేస్తారు.

శంకుస్థాపన జరిగింది వీటికే...

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్, ఏపీ గ్రామీణ బ్యాంకు, ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్.. ఎల్ఐసీ, ఎన్ఐఏసీఎల్.



సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, నారాయణ, పయ్యావుల, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, పలు బ్యాంకుల ప్రతినిధులు



జనసేన ఎంపీలు బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌తో భేటీ అయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పార్లమెంటు సమావేశాలకు సిద్ధం కండి

- జాతీయ ప్రయోజనాలతో కూడిన అంశాలపై మాట్లాడండి
- ఎంపీలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ దిశానిర్దేశం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో జాతీయ ప్రయోజనాలతో కూడిన అంశాలపై చర్చల్లో పాల్గొనేందుకు సిద్ధం కావాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయన జనసేన ఎంపీలతో సమావేశమయ్యారు. డిసెంబరు 1 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాలం సమావేశాల్లో అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు వేగవంతమయ్యే విధంగా కేంద్రంలోని సంబంధిత శాఖల మంత్రులతో సమావేశమై వివరాలు అందించాలన్నారు. పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ కేంద్ర పథకాల ద్వారా మంజూరయ్యే నిధులు, ఈ ఆర్థిక సంవత్సరం రావాల్సిన నిధుల వివరాలను కేంద్రం మంత్రుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పవన్ రాజోలు పర్యటనలో అపరిచిత వ్యక్తి..!

- ఉప ముఖ్యమంత్రికి అతి చేరువగా సంచారం
- కోనసీమ ఎస్పీకి డిప్యూటీ సీఎం కార్యాలయం ఫిర్యాదు
- గూడపల్లికి చెందిన నరసింహమూర్తిగా గుర్తింపు..
- అతనికి పాస్ ఎలా వచ్చిందనే కోణంలో ఆరా

అమలాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ నెల 26న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఓ అపరిచిత వ్యక్తి కదలికలు అనుమానాస్పదంగా ఉన్నట్టు గుర్తించిన పవన్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది డిప్యూటీ సీఎం కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. డిప్యూటీ సీఎం కార్యాలయం దీనిపై కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనాకు ఫిర్యాదు చేసింది. ఈ పర్యటన సందర్భంగా పవన్ కల్యాణ్.. శంకరగుప్తం డ్రెయిన్ వల్ల దెబ్బతిన్న కొబ్బరితోటలను పరిశీలిస్తున్న సమయంలో, అధికారులతో మాట్లాడుతున్న సందర్భంలో, ఆ తర్వాత జరిగిన ప్రతి కార్యక్రమాల్లోనూ ఆ అపరిచిత వ్యక్తి పవన్‌కు చేరువలోనే సంచరించినట్టు ఫిర్యాదులో పేర్కొంది. అతడు రాజోలు నియోజకవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్తగా తమకు సమాచారం అందిందని తెలిపింది. కార్యక్రమానికి జారీచేసిన పాస్ వైసీపీకి చెందిన వ్యక్తికి చేరడంపై సందేహాలు వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన పోలీసులు.. ఆ వ్యక్తిని మలికిపురం మండలం గూడపల్లికి చెందిన పున్నం నరసింహమూర్తిగా గుర్తించారు. అతనికి పాస్ ఎవరిచ్చారు... పవన్ సమీపంలోనే తిరగడానికి కారణాలేమిటి అనే కోణంలో ఆరా తీస్తున్నారు. కాగా, నరసింహమూర్తి గతంలో వైసీపీలో పనిచేశాడు. గతేడాది జనసేన పార్టీ సభ్యత్వం కూడా తీసుకున్నాడు. తాజాగా పవన్ కార్యక్రమాలకు మలికిపురం మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు సుందర శ్రీనివాస్ పేరిట ఉన్న వీఐపీ పాస్‌తో అతడు పాల్గొన్నట్టు తెలిసింది. హెలిప్యాడ్ దగ్గర కూడా ఎమ్మెల్యే, కలెక్టర్‌తో పాటు ఆయన ఉన్నట్టు తెలిసింది.

నేడు టీడీపీ కార్యాలయానికి సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి రానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యాలయానికి రానున్న చంద్రబాబు ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం అందుబాటులో ఉన్న నేతలతో సమావేశం అవుతారు. టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షులు, నూతన రాష్ట్ర కమిటీపై చర్చించనున్నారు.

25 వేల కోట్ల పెట్టుబడులు, 79 వేల ఉద్యోగాలు

- ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం


అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ. 25,195.53 కోట్ల పెట్టుబడులతో 79,037 మందికి ఉద్యోగ కల్పన ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. ఇందులో ప్రధానంగా టీజీవీ స్రాక్ రూ. 1,216 కోట్లతో 400 మందికి ఉద్యోగాలను కల్పించే కాస్టిక్‌సోడా, అనుబంధ ఉత్పత్తులు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ఎస్ఐపీబీ ఆమోదించింది.

రాష్ట్ర యువతకు విదేశాల్లో ఉద్యోగాలు

- మూడు సంస్థలతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంవోయూలు

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువతకు విదేశాల్లో ఉద్యోగాల కల్పించడమే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ మూడు కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. దుబాయ్‌లో ఏడాదికి వెయ్యి ఉద్యోగాలు కల్పించేందుకు డైనమిక్ స్టాఫింగ్ సర్వీసెస్, జర్మనీలో వైద్య రంగంలో ఉద్యోగాల కోసం బోర్డర్ ప్లస్, జపాన్‌లో వివిధ రంగాల్లో ఉద్యోగాల కోసం నిహాన్ అనే మూడు సంస్థలతో శుక్రవారం విజయవాడలో ఒప్పందాలు జరిగాయి. కాగా, జాతీయ రిక్రూట్‌మెంట్ ఏజెంట్స్ కంపెనీలతో నైపుణ్యాభివృద్ధి శాఖ సమావేశం నిర్వహించింది. రాష్ట్ర యువతకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పించేందుకు వేర్వేరు ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. ఆ సంస్థలు ఎదుర్కొంటున్న ఇమ్మిగ్రేషన్, ఇతర సమస్యలపై ఇందులో చర్చించారు. ఈ సమావేశంలో ఆ సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నతాధికారులు గణేష్‌కుమార్, సీతాశర్మ, నారాయణస్వామి, మనోహర్, ఏపీ ఎన్ఆర్‌టీ అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి: బ్రాహ్మణి



హిందూపురం మండలం పూలకుంట పాఠశాలలో విద్యార్థినులకు కంప్యూటర్‌ను అందజేస్తున్న నారా బ్రాహ్మణి

హిందూపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బడి పిల్లలకు సమాజానికి అవసరమైన విలువలతో కూడిన విద్యను అందించాలని మంత్రి లోకేశ్ సతీమణి, హెరిటేజ్ కంపెనీ ఈడీ నారా బ్రాహ్మణి ఉపాధ్యాయులను కోరారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో శుక్రవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. చోళసముద్రం వద్ద ఉన్న హెరిటేజ్ పాలడెయిరీని, తూమకుంటలోని హెరిటేజ్ దాణా పరిశ్రమను సందర్శించారు. చిలమత్తూరు జూనియర్ కళాశాలకు హెరిటేజ్ సంస్థ తరపున కంప్యూటర్‌ను అందించారు. లేపాక్షి నవోదయ పాఠశాలను సందర్శించారు. కుర్లపల్లి, పూలకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్లు, ప్రింటర్లను అందించారు. పూలకుంట పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ఉపాధ్యాయులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. లోకేశ్, తాను విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. విద్యార్థులకు జీవితానికి ఉపయోగపడే విద్యను విద్యార్థి దశలోనే నేర్పాలని టీచర్లను కోరారు. స్త్రీలను గౌరవించడం, తల్లి, చెల్లి వద్ద ఎలా ఉండాలో నేర్పించాలన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఆడబిడ్డలను చదివించాలని, తమ కుటుంబంలో మహిళలకు సమాన ప్రాధాన్యం ఇచ్చినందుకే బాగా చదువుకోగలిగానని, మంచిఉద్యోగం కూడా సంపాదించానని తెలిపారు. గురువులు, తల్లిదండ్రుల సూచనలను అనుసరిస్తూ, స్నేహపూర్వకంగా మెలగాలని విద్యార్థులకు సూచించారు. హిందూపురం తనకు పుట్టినిల్లువంటిందని, ఇక్కడి నుంచి తన తాత నందమూరి తారక రామారావు, పెదనాన్న హరికృష్ణ, తండ్రి బాలకృష్ణ ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని ఆమె గుర్తు చేశారు. అందుకే హిందూపురాన్ని నందమూరి పురం అంటుంటారని బ్రాహ్మణి వ్యాఖ్యానించారు.

రైతులను ఒప్పించే సమీకరిస్తున్నాం

- రెండో విడత భూసమీకరణపై నేనే వారందరితో స్వయంగా మాట్లాడా
- అందరి ఆమోదంతోనే ముందుకెళ్తున్నాం
- క్యాబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): "రాజధాని కోసం రెండో విడత భూసమీకరణపై రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత లేదు. నేను స్వయంగా రైతులందరితో మాట్లాడాను. అందరి ఆమోదంతోనే ముందుకెళ్తున్నాం." అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రి మండలి సమావేశం శుక్రవారం సీఎం అధ్యక్షతన జరిగింది. క్యాబినెట్‌లో భూసమీకరణ అంశంపై చర్చ సందర్భంగా.. రాజధాని రైతులు అసంతృప్తితో ఉన్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రస్తావించారు. రైతులందరూ రెండో విడత భూసమీకరణకు సుముఖంగా ఉన్నారా.. వారంతా సంతోషంగానే భూములు ఇస్తున్నారా.. అంటూ సందేహం వ్యక్తం చేశారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు. రెండో విడత భూసమీకరణ విషయంలో సీఆర్డీయే అధికారులు రైతులతో సరైన విధంగా మాట్లాడకపోవడం, అధికారుల వ్యవహారశైలి కారణంగా కొంత ఇబ్బంది తలెత్తిన మాట వాస్తవమేనని, రైతుల అభ్యంతరాలను వారు సీరియస్‌గా తీసుకోలేదని



మంత్రి వర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, అనిత, మనోహర్, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, నారాయణ తదితరులు

సీఎం అన్నారు. ఆ తర్వాత తాను రైతులను పిలిపించుకుని మాట్లాడి పరిస్థితిని అర్థమయ్యేలా చెప్పడంతో సుముఖత వ్యక్తంచేశారని తెలిపారు. అమరావతి అభివృద్ధి విషయంలోనూ రైతులు సంతృప్తిగా ఉన్నారని వ్యాఖ్యానించారు. కేంద్రం కూడా సహకరిస్తోందని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు, స్పోర్ట్స్ సిటీ, విమానాశ్రయం, రైల్వేస్టేషన్ వంటివాటితోపాటు నేచురోపతి వైద్య కళాశాల ఏర్పాటుకు అదనపు భూమి సమీకరించాల్సి ఉందన్నారు. నేచురోపతి వైద్యకళాశాలకు కేంద్రం రూ.750 కోట్లు ఇస్తుందని, మనం 40 ఎకరాలు కేటాయిస్తే సరిపోతుందని తెలిపారు. అమరావతిలో కాలుష్యరహిత పారిశ్రామికవాడను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పరిశ్రమలను ఆకర్షించడంలో మనమే బెస్ట్

రాష్ట్రానికి గూగుల్, రిలయన్స్ డేటా సెంటర్లతోపాటు ఆర్సెలార్ మిత్తల్ వంటి భారీ పరిశ్రమలు వస్తున్నాయని సీఎం క్యాబినెట్ సహచరులకు వివరించారు. పరిశ్రమలను ఆకర్షించడంలో ఏపీ అత్యుత్తమంగా పనిచేస్తోందని, భూకేటాయింపుల విషయంలోనూ ఎలాంటి జాప్యం లేకుండా ముందుకెళుతోందంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారని చంద్రబాబు తెలిపారు. భూకేటాయింపు విషయంలో మిగిలిన రాష్ట్రాలకన్నా ఏపీ పాలసీ చాలా బాగుందని ఆమె పేర్కొన్నారన్నారు. పరిశ్రమలను ఆకర్షించడం.. వివాదాలు లేకుండా భూకేటాయింపులు చేయడమే కాదు.. పరిశ్రమలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడటం కూడా ప్రభుత్వం, మంత్రుల బాధ్యతేనని స్పష్టం చేశారు.

- పోలవరం ప్రాజెక్టును 2028 మే నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, అన్నీ అనుకూలిస్తే 2027 గోదావరి పుష్కరాల నాటికే పూర్తి చేయాలన్నది తమ అభిమతమని సీఎం తెలిపారు. పోలవరం వద్ద ఐకానిక్ వంతెన నిర్మించాలని నిర్ణయించామన్నారు.
- రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందని, ఈ విషయంపై ఎన్నిసార్లు మాట్లాడుకున్నా రావణకాష్టంలా రెవెన్యూ సమస్యలు కొలిక్కి రావడం లేదని సీఎం వ్యాఖ్యానించారు.
- పీపీపీ మోడల్‌లో ప్రారంభించిన వైద్య కళాశాలల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల, పాడేరు కళాశాలలను ఎట్టి పరిస్థితుల్లోనూ రెండేళ్లలో పూర్తయ్యేలా చూస్తామని సీఎం తెలిపారు.
- క్యాబినెట్ భేటీ అనంతరం అరటి, పత్తి తదితర పంటల గిట్టుబాటు ధరలు, టిడ్కో ఇళ్ల నిర్మాణంపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్లు ఇచ్చారు. వైసీపీ నిర్వాకం వల్ల టిడ్కో ఇళ్ల నిర్మాణం ఐదేళ్లపాటు అటకెక్కిందని, ఫలితంగా సుమారు రూ.4000 కోట్లు అదనపు భారం ప్రభుత్వంపై పడుతోందని వివరించారు.

ఒడిశా పవర్ కన్సార్టియంకు బలిమెల, జోలాపుట్ పవర్ ప్రాజెక్టులు

జోలాపుట్, బలిమెల డ్యామ్‌ల వద్ద 78 మెగావాట్ల పవర్ ప్రాజెక్టులను ఒడిశా పవర్ కన్సార్టియం లిమిటెడ్‌కు కేటాయించేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. బలిమెల డ్యామ్ వద్ద 60 మెగావాట్లు, జోలాపుట్ డ్యామ్ వద్ద 18 మెగావాట్ల పవర్ ప్రాజెక్టుల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 50 శాతం ఏపీకి కేటాయించాలనే నిబంధనపై ఈ ప్రాజెక్టులను ఒడిశా కన్సార్టియంకు కేటాయించనున్నారు.

8.2% జీడీపీ వృద్ధి ప్రతి భారతీయుడికీ గర్వకారణం: సీఎం

భారతదేశం 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.2 శాతం జీడీపీ వృద్ధి సాధించడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ పరిణామం ప్రతి భారతీయుడికీ గర్వకారణంగా నిలుస్తుందని, ప్రపంచంలో అతివేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలుపుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. తయారీ, నిర్మాణ రంగాలు, ఆర్థిక, వృత్తిపరమైన సేవలు ఉత్పాదకతను పెంచుతూ దేశ ఆర్థికవ్యవస్థను శక్తివంతంగా ముందుకు నడిపిస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా దేశం పయనిస్తోందనడానికి ఈ అద్భుతమైన వృద్ధి నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

7 గ్రామాలు.. 16,666 ఎకరాలు

జరీబు భూమికి నివాస స్థలం 1,000 గజాలు, వాణిజ్య ప్లాటు 450 గజాలు

మెట్ట భూములకు నివాస స్థలం 1,000 గజాలు, వాణిజ్య ప్లాటు 250 గజాలు

(మొదటి పేజీ తరువాయి)

28,526 మంది రైతుల నుంచి 34,400 ఎకరాలు సేకరించారు. మొదటి దశలో సీఆర్‌డీఏకు ప్రభుత్వ భూమి సుమారు 16వేల ఎకరాలు అప్పగించారు. దీంతో మొత్తం ప్రభుత్వ భూమి, రైతుల దగ్గర నుంచి తీసుకున్న భూమితో కలిపి 74వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం చేపట్టనున్నారు. రెండో విడతకు సంబంధించి ఏడు గ్రామాల్లో రైతుల నుంచి భూమిని సమీకరించనున్నారు. దీనికి సంబంధించి సీఆర్‌డీఏ త్వరలో ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

రాజధాని అభివృద్ధి కోసమే: నారాయణ

రాజధాని ప్రాంతంలో రైల్వేస్టేషన్, రైల్వే లైన్, స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం మరోసారి భూసమీకరణకు వెళ్లాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "రాజధాని విస్తరణ కోసం మలివిడత భూసమీకరణకు సీఎం నిర్ణయం తీసుకున్నారు. దీనికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రెండో విడతలో 7 గ్రామాల్లో 16,666.56 ఎకరాలు సమీకరించాలని నిర్ణయించాం. రాజధానిలో వచ్చే 30 ఏళ్లకు సరిపడా ప్రజల జీవన స్థితి ఉండేలా కార్యాచరణ రూపొందించాం. ఈ ప్రాంతంలో భూమి రేట్లు పెరగాలన్నా, వృద్ధి రేటు పెరగాలన్నా.. కచ్చితంగా స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలి. అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం లేకపోతే అభివృద్ధి చెందదు. అందుకే 500 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు కట్టాలని సీఎం నిర్ణయించారు. వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడిల్లో 7,562 ఎకరాలు, వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమిలో 9,104.57 ఎకరాలు సమీకరించాల్సి ఉంది. ఈ గ్రామాల్లో ప్రభుత్వ భూమి 3,828 ఎకరాలు ఉంది. అయితే ప్రభుత్వ భూముల్లో ఎక్కువగా కొండలు, నీళ్లు ఉన్నాయి. భూసమీకరణలో భూములిచ్చిన రైతులకు గతంలో అమలు చేసిన నిబంధనలే వర్తిస్తాయి. జరీబు భూమికి నివాస స్థలం 1,000 గజాలు, వాణిజ్య ప్లాటు 450 గజాలు, మెట్ట భూములకు నివాస స్థలం 1,000 గజాలు, వాణిజ్య ప్లాటు 250 గజాలు కేటాయిస్తాం. కౌలు కూడా గతంలో మాదిరిగానే ఇస్తాం. ఇప్పటికే ఈ ఏడు గ్రామాల్లో సభలు నిర్వహించి, భూ సమీకరణకు అనుకూలంగా చేసిన తీర్మానాలను కేబినెట్ ఆమోదించింది. గతంలో స్పోర్ట్స్ సిటీకి 70 ఎకరాలు మాత్రమే కేటాయించగా, ఒలింపిక్ వంటి అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు 2,500 ఎకరాలు అవసరమవుతుంది. గతంలో భూములిచ్చిన రైతులందరికీ ప్లాట్లు ఇచ్చాం. కొన్ని చోట్ల జరీబు, నాన్ జరీబు, గ్రామ కంఠాల వంటి సమస్యలు ప్రస్తావిస్తున్న రైతులతో చర్చిస్తున్నాం. ఎవరికైనా ఎక్కువ భూమి ఇచ్చి ఉంటే వెనక్కి తీసుకోవాలని సీఎం చెప్పారు. ఎవరికైనా ఇవ్వాల్సి ఉంటే నెల రోజుల్లో ఈ సమస్యను పరిష్కరిస్తాం. అసైన్డ్ రైతుల సమస్యను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలిస్తుంది. రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తుది దశకు చేరుకుంది' అని మంత్రి వివరించారు.

రైతుల ఆమోదంతోనే భూసమీకరణ: మంత్రి కొలుసు

రైతుల ఆమోదంతో అమరావతిలో అవసరమైన భూముల సమీకరణ చేపడతామని మంత్రి పార్థసారథి చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వేస్టేషన్, రైల్వే లైన్ కోసం రెండో విడత భూసమీకరణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. రాజధానిలో దేవదాయ, వక్ఫ్ బోర్డు భూములు కూడా నిబంధనల ప్రకారం తీసుకుంటామని తెలిపారు. మూడో విడత భూ సమీకరణపై మంత్రి మాట్లాడుతూ ఒక నగరాన్ని నిర్మించేటప్పుడు తగిన సమయంలో, తగినంత భూమిని తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

రాజధానికి 7,500 కోట్ల రుణానికి ఆమోదం

అమరావతి కోసం రూ.7,500 కోట్ల రుణం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్ఏబీఎఫ్ఐడీ) నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

దొమ్మరకులం ఇక దొరవంశం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దొమ్మర కులాన్ని ఇక దొరవంశంగా పిలవనున్నారు. బీసీ-ఏలో సీరియల్ నం.7గా ఉన్న దొమ్మర కులాన్ని ఇక నుంచి దొరవంశ కులంగా పిలవాలని బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

రైడెన్ భాగస్వామ్య ఒప్పందాలకు క్యాబినెట్ ఆమోదం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో డేటా సెంటర్ ఏర్పాటులో భాగంగా అదానీ, ఎయిర్‌టెల్ తదితర సంస్థలతో తమ భాగస్వామ్య ఒప్పందాలకు అనుమతి ఇవ్వాలంటూ గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ చేసిన అభ్యర్థనపై రాష్ట్ర మంత్రివర్గం సానుకూలంగా స్పందించింది. డేటా సెంటర్ ఏర్పాటు విషయంలో ప్రాథమికంగా కొన్ని, ఆ తర్వాత మరికొన్ని పనులను తమ భాగస్వామ్య సంస్థలతో చేయిస్తామని, చివరిగా డేటా కేంద్రాన్ని తామే నిర్వహిస్తామని రైడెన్ పేర్కొంది. ఈ మేరకు ఈనెల 19న రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆలేఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో చర్చించి, రైడెన్ అభ్యర్థనను ఆమోదించారు. డేటా సెంటర్ ఏర్పాటు విషయంలో ఈ ఏడాది అక్టోబరు 11న రైడెన్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విశాఖలోని రాంబిల్లిలో చేపట్టాల్సిన పనులు తొలుత అదానీకి ఇవ్వడానికి రైడెన్ నిర్ణయించుకుంది. అయితే దానిని ఎయిర్‌టెల్ నెక్స్‌ట్రాకు మార్చింది. తర్లువాడ పనులు అదానీ ఇన్‌ఫ్రా నుంచి అదానీ కాంప్లెక్స్‌కు, అడవివరం-ముదసర్లోవ పనులు అదానీ ఇన్‌ఫ్రా నుంచి అదానీ కనెక్స్‌కు బదలాయించింది. వీటి అనుమతి కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసింది.

హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష వద్దు

- వ్యాధిగ్రస్తులతో మంత్రి సత్యకుమార్ అల్పాహారం

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ బాధితులపట్ల వివక్ష ప్రదర్శించవద్దని, వారు కూడా సమాజంలో భాగస్వాములేనన్న కనీస మానవత చూపాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయవాడలో శుక్రవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు వారితో కలిసి అల్పాహారం స్వీకరించారు. దాదాపు గంటన్నర పాటు వారితో గడిపిన మంత్రి.. హెచ్ఐవీ సోకిన చిన్నారులు, పెద్దవారితో సంభావించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పెద్దలు తెలిసీ తెలియక చేసిన తప్పులకు చిన్న పిల్లలు బాధపడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. హెచ్ఐవీ సోకినప్పటికీ రోగులు ఆందోళనకు గురికాకుండా ప్రభుత్వం ఉచితంగా అందజేసే మందులను వాడాలని సూచించారు. బహిరంగ మార్కెట్లో రూ.3వేల నుంచి రూ.12 వేల మధ్య ఉన్న ఏఆర్టీ మందులను ప్రభుత్వం ఉచితంగానే అందిస్తున్నట్లు తెలిపారు. చదువుల్లో ప్రతిభ కనబరిచిన హెచ్ఐవీ బాధిత విద్యార్థులకు ఆయన బహుమంతులు అందించారు.

సంధ్యారాణి ప్రైవేటు కార్యదర్శిపై కేసు

పార్వతీపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రైవేటు కార్యదర్శి సతీశ్‌పై సాలూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో కేసు వివరాలు వెల్లడించారు. సాలూరుకు చెందిన మహిళ ఈనెల 27న ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 'మా వీధిలోనే నివాసముంటున్న సతీశ్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకున్నాడు. ఇవ్వమని అడిగితే వేధిస్తున్నాడు' అంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. మరికొన్ని ఆరోపణలు కూడా చేసిన ఆమె మంత్రి లోకేశ్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారు. దీంతో సతీశ్‌పై సాలూరులో కేసు నమోదైంది. కాగా మంత్రి సంధ్యారాణి కుటుంబంపైన, ఆమె వ్యక్తిగత కార్యదర్శి సతీశ్‌పైన తప్పుడు కథనాలు ప్రచురించడంతో పాటు అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ జగన్ పత్రికపై స్థానిక టీడీపీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలో ఆ పత్రికకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పత్రిక ప్రతులను దహనం చేశారు. కాగా, మంత్రి సంధ్యారాణి ప్రైవేటు కార్యదర్శి సతీశ్ తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'నాపై ఆ మహిళ చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం. జగన్ పత్రిక నాపై ఇష్టారాజ్యంగా తప్పుడు వార్తలు రాస్తోంది' అని సతీశ్ ఆరోపించారు. మంత్రి, వారి కుటుంబ సభ్యులను ఇందులోకి లాగడం సభ్యత కాదన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయండి: సీపీఐ

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరిస్తామని గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. జూనియర్ కాలేజీల్లో 3,618మంది, డిగ్రీ కాలేజీల్లో 965 మంది, పాలిటెక్నిక్ కాలేజీల్లో 309 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పని చేస్తున్నారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం జీవో 114ను తీసుకువచ్చినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా అప్పట్లో ఆ ప్రక్రియ ఆగిపోయిందని ఈశ్వరయ్య తెలిపారు.

అవి ప్రభుత్వ వైద్య కళాశాలలే

(మొదటి పేజీ తరువాయి)

కొలుసు పార్థసారథి విలేకరులకు వెల్లడించారు. ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల వైద్య కళాశాలలకు కేటాయించిన కేటాయించిన భూముల్లో 60 ఎకరాల మేర తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 'పీపీపీ విధానంలో వైద్య కళాశాలలకు కేటాయించిన భూములను వాణిజ్య అవసరాలకు, వైద్యేతర కార్యక్రమాలకు వినియోగించరాదని స్పష్టం చేసింది. ఈ భూముల్లో 625 పడకల ఆస్పత్రి, 150 యూజీ, 24 పీజీ సీట్లతో కూడిన కళాశాల, వసతి గృహాలు, బోధన, బోధనేతర సిబ్బంది నివాసాల నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించింది. భవిష్యత్ అవసరాల కోసం ఆయా వైద్య కళాశాలలు... దంత వైద్య, నర్సింగ్ కాలేజీలను, టెలిమెడిసిన్, శిక్షణ, ఆయుష్ కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు ఆమోదం తెలిపింది. ఈ అదనపు అభివృద్ధి ద్వారా వచ్చే ఆదాయంలో 3శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది' అని తెలిపారు.

వైద్య కళాశాలలకు భూముల కుదింపు..

మొదటి దశలో చేపట్టే 4 వైద్య కళాశాలలకు గత ప్రభుత్వం 257.50 ఎకరాలు కేటాయించగా.. దానిని 197.71 ఎకరాలకు కుదిస్తూ వైద్యఆరోగ్య శాఖ చేసిన సిఫారసుకు క్యాబినెట్ ఆమోదించింది. పీపీపీ విధానంలో వైద్యకళాశాల, ఆస్పత్రి నిర్వహణలోకి వచ్చినప్పటి నుంచి బోధనాస్పత్రుల్లో పనిచేసే వైద్య, ఇతర సిబ్బందికి జీతాలను రెండేళ్లపాటు ప్రభుత్వమే భరిస్తుంది. కొత్తఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యాక ప్రస్తుత బోధనాస్పత్రులను తిరిగి ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ప్రభుత్వ వైద్యకళాశాల, ఆస్పత్రి అనే పేరుతో పాటు ప్రదేశం పేరు కూడా పెట్టి, దాని కింద పీపీపీ భాగస్వామి పేరును కూడా ప్రస్తావించవచ్చు. ఈ పేర్లను 70:30 నిష్పత్తిలో ప్రదర్శించాలి. అలాగే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, అన్ని రకాల పడకల్లో 70శాతం నగదు రహిత సేవలు పొందే పేదలకు కేటాయించాలని నిర్ణయించారు.

మరిన్ని నిర్ణయాలివీ..

- పోలవరం ప్రాజెక్టులో భాగంగా రూ.542.55 కోట్లతో చేపట్టిన మూడు అనుబంధ పనులకు ఆమోదం. పోలవరం గ్రామం నుంచి కుడివైపున స్పిల్‌వే కనెక్టింగ్ టన్నెల్స్, రేడియల్ డ్యామ్‌ల దాకా అనుసంధాన రహదారుల నిర్మాణానికి రూ.117.86 కోట్లు వ్యయమైంది. గ్యాప్-1 నుంచి పోలవరం ఎడమ కాలువకు హెడ్‌రెగ్యులేటర్, కేఎల్ బండ్ వరకు 21 కిలోమీటర్ల మేర రోడ్లు వేసేందుకు రూ. 217.55 కోట్లు ఖర్చుచేయడానికి అంగీకారం. పురుషోత్తపట్నం నుంచి గండిపోచమ్మ తల్లి గుడిదాకా 6 కిమీ మేర రూ.207.50 కోట్లతో రక్షణ పనులు.
- ఆంధ్రప్రదేశ్ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ లావాదేవీలు, యాజమాన్య నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఆమోదం.
- పట్టణాలు, నగరాల్లో ఖాళీ భూమిపై విధిస్తున్న పన్నులో 50% భవన నిర్మాణ దశలో మినహాయిస్తూ తెచ్చిన ముసాయిదా బిల్లుకు ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌బాషా/దూదేకుల సంక్షేమ, అభివృద్ధి సంస్థను రద్దు చేసి.. సహకార సంఘాల చట్టం-1964 ప్రకారం 'ఏపీ నూర్‌బాషా/దూదేకుల సహకార ఆర్థిక సంస్థ' అనే కొత్త కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం.
- ఏపీ రెగ్యులేషన్-కంట్రోల్ ఆఫ్ డిస్‌ప్లే డివైసెస్(ప్రమోషన్ ఆఫ్ ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్)కు ఆమోదం. తద్వారా హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఇతర ప్రచార పరికరాల ఏర్పాటుకు లైసెన్సులు, అనుమతి తీసుకోవడం తప్పనిసరి.
- ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు పీఎంఎస్‌జీఎంబీవై కింద రూఫ్‌టాప్, గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ఇన్‌స్టాలేషన్ల అమలుకు నాబార్డు నుంచి రూ.3,762.26 కోట్ల రుణం పొందడానికి ప్రభుత్వ గ్యారెంటీ.
- 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో ధాన్యం సేకరణ కోసం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా తాజాగా రూ.5 వేల కోట్లు రుణం తీసుకుని.. పౌరసరఫరాల సంస్థకు బదలాయింపునకు అంగీకారం.
- నోటిఫైడ్ పార్ట్‌నర్స్ అధికారానికి సంబంధించి విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో డేటా సెంటర్ ప్రాజెక్టు కోసం 480 ఎకరాల భూమిని భాగస్వాములకు కేటాయించడానికి రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా (గూగుల్ అనుబంధ సంస్థ) అభ్యర్థనకు ఆమోదం.
- ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ కోసం ప్రస్తుత అర్హత తేదీకి అదనంగా ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబరు 1 తేదీలను ఆమోదించడానికి ఏపీ పంచాయతీరాజ్ చట్ట సవరణకు ముసాయిదా ఆర్డినెన్స్ ప్రతిపాదనకు ఆమోదం.
- సవరించిన భారత్ నెట్ ప్రోగ్రాం అమలుకు కొత్త ఎస్పీవీ ఏర్పాటు.. దాని అమలుకు త్వరగా టెండర్ల విడుదలకు ఆమోదం.
- కాంట్రాక్టర్లు, ఏజెన్సీల బిల్లుల నుంచి కార్మిక సెస్ రికవరీకి ఓకే. ● 2024 జూన్ 15 వరకు జరిగిన భూలావాదేవీల క్రమబద్ధకరణకు అనుమతి. 'ఫామ్ టెన్' క్లెయిముల దాఖలు గడువు 2027 డిసెంబరు 31 వరకు పొడిగింపు.
- గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు సన్న చిన్న రైతులు ఇష్టపూర్వకంగా చేసుకునే అగ్రిమెంట్ల విషయంలో స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల చెల్లింపుల్లో మినహాయింపులు అందించేందుకు.. ఊపీ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్స్ రూల్స్ 1989లోని 22(2) నిబంధన ప్రకారం వన్‌టైం చర్యగా పరిగణించేందుకు ఆమోదం.
- విశాఖ రూరల్ ముడసర్లోవలో యాదవ భవన్ స్కీం కింద కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఆమోదం. దీనికి ఎకరా రూ.12.10 కోట్ల చొప్పున చెల్లింపుతో 50 సెంట్ల ప్రభుత్వ భూమి బీసీ సంక్షేమశాఖకు బదిలీ.
- తిరుపతి రూరల్ మండలం దమినేడులో జాతీయ ప్రామాణిక క్రీడా మౌలిక సదుపాయాల కల్పన కోసం 28.37 ఎకరాల ప్రభుత్వ భూమి మార్కెట్ విలువకు ఏపీటీఏకు బదిలీ.
- చిత్తూరు జిల్లా మంగసముద్రంలో 8.08 ఎకరాల ప్రభుత్వ భూమి.. కేంద్రీయ వర్సిటీ స్థాపనకు ఉచితంగా కేంద్రీయ విద్యాసంస్థకు బదిలీ.
- నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం మాధవరంలో 4.96 ఎకరాలు క్రషింగ్, పల్వరైజింగ్ యూనిట్ కోసం ఏపీఐఐసీకి బదిలీ.
- ఇతర రాష్ట్రాల్లో మరణించిన వారికి వారసత్వంగా వచ్చే పూర్వీకుల వ్యవసాయ ఆస్తుల బదిలీకి అవసరమైన డీడ్‌లకు భారతీయ స్టాంప్ యాక్ట్‌లో కొత్త నిబంధనలు చేర్చే ప్రతిపాదనకు ఆమోదం.
- టిడ్కోపై ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ ఇచ్చిన నివేదికపై మంత్రుల కమిటీ చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలని సీఎం ఆదేశం.

రాజీ వెనుక రహస్యమేంటో?

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

పరకామణి చోరీ కేసు రాజీ విషయంలో అంతా 'పథకం' ప్రకారమే జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కీలకమైన విషయాలను వ్యూహాత్మకంగా దాచేసి... 'మాకేమీ తెలియదు' అనేలా ఉద్దేశపూర్వకంగానే నిబంధనలను గాలి కొదిలేసినట్లు తెలుస్తోంది. నిందితుడు రవికుమార్ ఆస్తులను స్వీకరించే విషయం టీటీడీ బోర్డు సమావేశం అజెండాలో పెట్టినప్పటికీ... అందులో రవికుమార్ పరకామణి చోరీ కేసు నిందితుడనే సంగతి దాచేశారు. రవికుమార్ ఆస్తులను స్వీకరించే విషయంపై 2023 జూన్ 19న జరిగిన టీటీడీ బోర్డు సమావేశం అజెండాలో ప్రతిపాదన పెట్టారు. రవికుమార్, అతడి భార్య రమ్య తమ ఆస్తులను ఏడు గిఫ్ట్ డీడ్‌ల ద్వారా టీటీడీకి విరాళంగా రాసిచ్చారని మాత్రమే పేర్కొన్నారు. సాధారణ భక్తుడి నుంచి స్వీకరిస్తున్నట్టుగా తీర్మానాన్ని (నంబరు 159) వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బోర్డు ఆమోదించేసింది. భక్తులు శ్రీవారికి సమర్పించే ఆస్తులను టీటీడీ స్వీకరించేందుకు ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. టీటీడీ భక్తుల ఆస్తులను విరాళంగా తీసుకునే ముందు ప్రకటన ఇవ్వాలి. ప్రజల నుంచి ఈ ఆస్తుల విషయంలో అభ్యంతరాలు,



సూచనలు ఏవైనా ఉంటే తెలుసుకునేందుకు దినపత్రికల్లో పబ్లిక్ నోటీసు ప్రచురించాలి. న్యాయ, సాంకేతికపరమైన అభ్యంతరాలు లేనప్పుడే గడువు తర్వాత ఆస్తులను తీసుకోవాలి. అయితే టీటీడీ రవికుమార్ ఆస్తులను తీసుకునే ముందు పబ్లిక్ నోటీసు ఇవ్వలేదు. తగిన సమయం లేదంటూ టీటీడీ బోర్డు మినహాయింపు ఇచ్చింది. రవికుమార్ ఆస్తుల అంశాన్ని ప్రత్యేక కేసుగా పరిగణిస్తున్నట్టుగా తీర్మానించింది. ఆ మినహాయింపును ఆ ఒక్కసారికే పరిమితం చేస్తున్నట్టుగా పేర్కొనడం విశేషం. వాస్తవానికి రవికుమార్, అతడి భార్య రమ్య రూ. 14.43 కోట్ల విలువైన (ప్రభుత్వ ధరల ప్రకారం) తమ ఆస్తులను ఏడు గిఫ్ట్ డీడ్‌ల ద్వారా టీటీడీ పేరిట రిజిస్టర్ చేశామని, వాటిని విరాళంగా అనుమతించాలని కోరుతూ 2023 మే 19వ తేదీన టీటీడీకి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత నెల రోజులకు అంటే.. జూన్ 19న టీటీడీ పాలకమండలి సమావేశం జరిగింది. అంత వ్యవధి ఉన్నప్పటికీ టీటీడీ పబ్లిక్ నోటీసు జారీ చేయలేదు.

పరకామణి కేసులో ఎన్నో అనుమానాలు

- నిబంధనలేవీ పాటించని టీటీడీ
- రవికుమార్ నిందితుడని పేర్కొనకుండా ఆస్తుల స్వీకరణకు బోర్డు ముందుకు అజెండా
- పబ్లిక్ నోటీసు ఇవ్వకుండా మినహాయింపు
- బోర్డు అనుమతి లేకుండానే లోక్‌అదాలత్‌లో రాజీ

ప్రభుత్వానికి సమాచారం లేదు

సాధారణంగా భక్తుల నుంచి ఆస్తులను విరాళంగా స్వీకరించడానికి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సిన అవసరం టీటీడీకి లేదు. అయితే ఇక్కడ ఆస్తులు టీటీడీకి విరాళంగా ఇచ్చింది సాధారణ భక్తుడు కాదు. తిరుమల శ్రీవారి ఆలయ పరకామణిలో చోరీ చేసి పట్టుబడిన వ్యక్తి. తిరుమలలో నమోదైన క్రిమినల్ కేసులో రవికుమార్ నిందితుడు. అలాంటి వ్యక్తి నుంచి ఆస్తులు స్వీకరించే సమయంలో ప్రభుత్వానికి తెలియజేయకపోవడం విచిత్రం. లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేసుకోవడానికి కూడా బోర్డు అనుమతి లేకపోవడం గమనార్హం. దీంతో తెర వెనుక ఏదో జరిగిందన్న అనుమానాలకు ఆస్కారం కలిగింది. అదే చివరికి హైకోర్టు ఆదేశాలతో సీఐడీ దర్యాప్తు చేపట్టడానికి కారణమైంది.

ఇలా వచ్చి.. అలా వెళ్లి..

- పరకామణి కేసులో సీఐడీ విచారణకు హాజరైన వైవీ సుబ్బారెడ్డి



విజయవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసులో సీఐడీ విచారణకు టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయారు. ఈ కేసులో ఇతర నిందితులను సుదీర్ఘంగా విచారించగా, వైవీ విచారణ మాత్రం కేవలం రెండు గంటల్లోనే ముగిసింది. ఇదేదో చుట్టం చూపుగా వచ్చినట్లు ఉందంటూ సుబ్బారెడ్డి విచారణపై పలువురు సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేస్తున్నారు. విజయవాడకు సమీపాన ఉన్న కానూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం హాజరయ్యారు. ఆయనను సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ విచారించారు. రెండు గంటలపాటు సాగిన విచారణలో సుబ్బారెడ్డికి సుమారు 20 ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. విచారణ తర్వాత బయటకు వచ్చిన సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. పరకామణి నెపాన్ని టీటీడీ అధికారుల మీదకు నెట్టేందుకు ప్రయత్నించారు. డాలర్ల చోరీ తాను చైర్మన్‌గా ఉన్నప్పుడు జరిగినప్పటికీ పదవీ కాలం పూర్తయిన తర్వాత ఇప్పుడు బయట పడిందని, ఈ విషయాన్ని ఇన్నాళ్లూ ఎవరు దాచి పెట్టారో తేల్చాల్సిన అవసరం ఉందని అన్నారు. కాగా, సుబ్బారెడ్డిని కలిసేందుకు వైసీపీ నేతలు సీఐడీ కార్యాలయం వద్దకు క్యూ కట్టారు. మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మొండితోక అరుణ్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ తదితరులు వచ్చారు. విచారణ పూర్తయ్యేంత వరకు సీఐడీ కార్యాలయానికి సమీప భవనంలోనే కూర్చున్నారు. పెనమలూరు పోలీసులు విచారణ కార్యాలయం ఉన్న వీధికి రెండు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. సుబ్బారెడ్డి కార్యాలయంలో నుంచి బయటకు రాగానే వాటిని తోసుకుంటూ నాయకులు, కార్యకర్తలు దూసుకొచ్చారు. అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా

పరకామణి విషయంలో సీఐడీ అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాను. పరకామణిలో చోరీ జరగడం బాధాకరం. నా హయాంలో అది జరిగిందన్నారు. నా పదవీ కాలం పూర్తయ్యాక అది బయట పడింది. ఆ రోజు చోరీ విషయం ఎవరు దాచారో తెలియదు. ఈ విచారణను రాజకీయ కోణంలో చూడొద్దు. మమ్మల్ని దోషులుగా చూడకండి. నిష్పక్షపాతంగా విచారణ చేసి దోషులను శిక్షించాలి. విచారణకు అన్నివిధాలా సహకారం అందిస్తానని అధికారులకు చెప్పాను.

- వైవీ సుబ్బారెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్

నందిగం రాణికి ముందస్తు బెయిల్ ఇవ్వలేం: హైకోర్టు

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హర్షిత స్కూల్ చైర్‌పర్సన్ నందిగం రాణికి మందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. నేర తీవ్రత ఉన్న కేసుల్లో నిందితులకు రక్షణగా ఉత్తర్వులు జారీచేస్తే వారు దర్యాప్తునకు ఆటంకం కలిగించడంతో పాటు సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, తద్వారా న్యాయానికి విఘాతం కలుగుతుందని పేర్కొంది. మరోవైపు ఇదే కేసులో నిందితులుగా ఉన్న రాణి కుటుంబసభ్యులు, బంధువులు ఐదుగురికి కోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరుచేసింది. ఒక్కొకరు రూ.2లక్షల బాండ్‌తో మూడు పూచీకత్తులు సమర్పించాలని స్పష్టం చేసింది. చార్జిషీట్ దాఖలు చేసేవరకూ ప్రతి శనివారం ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఎస్‌హెచ్‌వో అనుమతి లేకుండా జిల్లా సరిహద్దు దాటి వెళ్లడానికి వీల్లేదని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏలూరు జిల్లా, కామవరపుకోట మండలం, తడికలపూడి గ్రామంలో హర్షిత పాఠశాల, జూనియర్ కాలేజ్ చైర్‌పర్సన్ నందిగం రాణి, ఆమె భర్త రూ.33 కోట్లకు పైగా వసూలు చేసి మోసానికి పాల్పడ్డారంటూ కొర్రపాటి చంద్రశేఖర్ మంగళగిరి సీఐడీ పోలీసులకు చేసిన ఫిర్యాదు ఆధారంగా నందిగం రాణి, ఆమె భర్త ధర్మరాజు, కుమార్తె లక్ష్మీ హర్షిత, ఆమె తండ్రి గవిర్ని కృష్ణారావు, సోదరులు రమేశ్, సురేష్, వదిన గవిర్ని యజ్ఞవల్లిపై గతేడాది ఆగస్టులో వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో నందిగం రాణి, ఇతరులు హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

కోకాపేటలో ఎకరం రూ.151.25 కోట్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూముల వేలంతో కోకాపేట కోట్లపేటగా మారింది. మూడు రోజుల క్రితం ఇక్కడ ఎకరం రూ.135 కోట్లు పలికింది. తాజాగా ఎకరం రూ.151.25 కోట్లు పలకడం విశేషం. శుక్రవారం హెచ్‌ఎండీయే ఆధ్వర్యంలో కోకాపేటలోని నియోపోలీస్ లేఔట్‌లో గల 15, 16 నెంబర్ల ప్లాట్లను ఆన్‌లైన్‌లో వేలం వేశారు. నియో పోలీసు లేఅవుట్‌కు ముఖద్వారంగా ఉన్న 15వ నెంబరు ప్లాటు 4.03 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. ఈ ప్లాట్‌ను ఎకరం రూ.151.25 కోట్ల చొప్పున లక్ష్మీనారాయణ గుమ్మడి, కార్తీష్ రెడ్డి మాడుగుల, శరత్ వెంట్రప్రగడ, శ్యామ్ సుందర్ రెడ్డి వంగాల కలిసి కొనుగోలు చేశారు. 5.03 ఎకరాల విస్తీర్ణంలోని 16వ నెంబరు ప్లాటును రూ.147.75 కోట్లకు గోద్రెజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్ అనే సంస్థ కొనుగోలు చేసింది. ఈ రెండు ప్లాట్ల విక్రయం ద్వారా హెచ్‌ఎండీయేకు రూ. 1,353 కోట్లు సమకూరాయి.

మద్యం స్కాంలో కసిరెడ్డిదే
కీలక పాత్ర

ముడుపుల సొమ్మును దేశం దాటించారు



- రూ.3,200 కోట్ల ప్రజాధనం దోచుకున్నారు
- అన్నింటికీ ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి
- సీనియర్ న్యాయవాది లూథ్రా వాదనలు
- రాజశేఖర్ 'బెయిల్'పై హైకోర్టులో విచారణ

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కుట్ర వెనుక పిటిషనర్ కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టుకు నివేదించారు. మద్యం కంపెనీల నుంచి వసూలు చేసిన ముడుపుల సొమ్మును నకిలీ కంపెనీల ద్వారా విదేశాలకు మళ్లించారని తెలిపారు. రూ.3,200 కోట్ల ప్రజాధనం దోచుకున్నారని వివరించారు. కేసుకు సంబంధించి ఇప్పటి వరకు మూడు చార్జ్‌షీట్లు దాఖలు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. నేరానికి పాల్పడ్డారని నిర్ధారించేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, బెయిల్ పొందేందుకు పిటిషనర్ అర్హుడు కాదని కోర్టుకు తెలిపారు. కాగా, కోర్టు సమయం మించిపోవడంతో ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది వాదనల కొనసాగింపు, పిటిషనర్ తరఫున రిప్లై వాదనల కోసం విచారణను డిసెంబరు 2కు వాయిదా వేశారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

7 నెలలుగా జైల్లోనే



మద్యం కుంభకోణం కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా కసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు వినిపించారు. "పిటిషనర్ గత 7 నెలలుగా జైల్లో ఉన్నారు. కేసు దర్యాప్తు చేసి ఇప్పటికే 3 చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. ఇప్పటికీ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటి వరకు 39 మందిని నిందితులుగా చేర్చారు. 300 మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తయి ట్రయల్ ప్రారంభం కావాలంటే ఏళ్ల తరబడి సమయం పడుతుంది. నిరవధికంగా జైల్లో ఉంచడం నిందితుల ప్రాథమిక హక్కులను హరించడమే. ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పటికీ బెయిల్ నిరాకరించడానికి వీల్లేదు. నేరం తీవ్రమైనదైనప్పటికీ సహేతుక సమయంలో దర్యాప్తు పూర్తికాకుంటే నిందితులకు బెయిల్ ఇచ్చేందుకు ప్రాసిక్యూషన్ వ్యతిరేకించడానికి వీల్లేదు." అని తెలిపారు.

ఇదే తొలిసారి: కోర్టు

మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితులు ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ అప్పటి ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎక్సైజ్‌శాఖ అధికారి డి. వెంకటసత్యప్రసాద్ పిటిషన్లు దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్లను తిరస్కరించాలని కోరుతూ మరో నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ఈ పిటిషన్ విచారణార్హతను తేలుస్తామని హైకోర్టు తెలిపింది. ముందస్తు బెయిల్ పిటిషన్లలో సహచర నిందితుడు అనుబంధ పిటిషన్ వేసి బెయిల్ పిటిషన్లను తిరస్కరించాలని కోరడం మొదటిసారి చూస్తున్నామని పేర్కొంది. ఇలా అనుబంధ పిటిషన్లు వేయవచ్చా? అనే విషయాన్ని తేలుస్తామని ప్రకటించింది. ఈ పిటిషన్లపై విచారణను కూడా న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి డిసెంబరు 2కు వాయిదా వేశారు.

కొత్తగా 8,190 ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

- 1న ఏలూరు జిల్లాలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 1న పంపిణీ చేయనున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 63,25,999 మంది లబ్ధిదారుల కోసం రూ.2738.71 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. కొత్తగా 8,190 మందికి పెన్షన్లను మంజూరు చేశారు. దీని కోసం అదనంగా రూ.3.28 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు పెన్షన్లు కోసం రూ.21,280 కోట్లు ఖర్చు చేశారు. డిసెంబరు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపాలపురం గ్రామ సచివాలయ పరిధిలో జరిగే కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు అందజేస్తారని మంత్రి పేర్కొన్నారు.

'విద్యార్థి మిత్ర' టెండర్లకు షెడ్యూలు

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, బూట్లు ఇచ్చే 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పథకంలో వస్తువుల సమీకరణకు షెడ్యూలు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. నవంబరు నాలుగో వారంలో పరిపాలనా అనుమతులు, టెక్నికల్ కమిటీ నియామకం ఉంటుంది. డిసెంబరు రెండో వారంలో టెండర్లు పిలిచి, జనవరి నాలుగో వారంలో టెండర్లు ఖరారు చేస్తారు. అదే నెల నాలుగో వారంలో వర్క్ ఆర్డర్లు జారీచేస్తారు. మే రెండో వారం నుంచి కిట్లను స్టాక్ పాయింట్లకు పంపిస్తారు. పాఠశాలల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు కిట్లు అందజేస్తారు.

రెండు మున్సిపాలిటీలు అప్‌గ్రేడ్

అమరావతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు మున్సిపాలిటీలను అప్‌గ్రేడ్ చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 మున్సిపాలిటీగాను, నిడదవోలును గ్రేడ్-2 నుంచి స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది.

కల్తీ నెయ్యిలో సుబ్రమణ్యం కుట్రదారు

(మొదటి పేజీ తరువాయి)

చుక్క పాలు కూడా కొనుగోలు చేయని డెయిరీలకు అనుకూలంగా సిఫారసు చేయడం.. కల్తీ నెయ్యితో వచ్చే ట్యాంకర్ల ప్రవేశానికి రాచబాట వేయడం.. టీటీడీకి ఆర్థికంగా నష్టం కలిగించడం.. అర్హతలేని డెయిరీలకు ఆయాచిత లబ్ధి చేకూర్చడం.. అన్నింటికన్నా ముఖ్యంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను కాలరాయడంలో సుబ్రమణ్యం పాత్ర కీలకమని పేర్కొంది. లంచాల రూపంలో లక్షలాది రూపాయలతో పాటు బోలేబాబా డెయిరీ నుంచి వెండి కంచం కూడా తీసుకున్నట్టు సిట్ దర్యాప్తులో తేలింది. అంతేగాక తనిఖీలకు వెళ్లిన ప్రతిసారి సెల్ ఫోన్, వెండి కాయిన్ ఇలా ఏదో ఒకటి తీసుకున్నట్లు గుర్తించింది. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిన్న అప్పన్న సహకారంతో కల్తీ దందా కొనసాగించాడని నిగ్గు తేల్చింది.

వెండి కంచంతో మొదలు...

టీటీడీ చైర్మన్‌గా సుబ్బారెడ్డి ఉన్నప్పుడు ప్రొక్యూర్మెంట్ విభాగానికి జీఎంగా వ్యవహరించిన సుబ్రమణ్యం అవినీతి వెండి కంచంతో మొదలైనట్లు కోర్టుకు తెలిపింది. నాణ్యత నిర్ధారించే టెక్నికల్ కమిటీలోనూ సభ్యుడైన సుబ్రమణ్యం చేతిలో వైష్ణవి డెయిరీ ప్రతినిధి అపూర్వ చద్దా పంపిన వెండి కంచం పెట్టగానే నెయ్యి సరఫరాకు అర్హత లభించింది. వైష్ణవి డెయిరీతో ఒప్పందం చేసుకున్న బోలేబాబా డెయిరీ ప్లాంటు సందర్శనకు ఆయన వెళ్లినప్పుడు ఖరీదైన సెల్‌ఫోన్‌తో పాటు రూ.3.5లక్షల నగదు ఇచ్చారు. దీంతో అక్కడ ఆవు పాలు సేకరణే లేకున్నా అంతా సవ్యంగా ఉందని ఆమోద ముద్ర వేశాడు. 50 గ్రాముల వెండి కాయిన్ బహుమతిగా ఇచ్చినా లొంగిపోయే సుబ్రమణ్యం బోలేబాబా, వైష్ణవి, మల్ గంగా డెయిరీలతో కలిసి కుట్రపూరితంగా వ్యవహరించాడు. కోట్ల లీటర్ల నెయ్యి సరఫరాకు టెండర్లు వేసిన డెయిరీలు సమర్పించిన అర్హత సర్టిఫికెట్లు నకిలీవా, నిజమైనవా అన్నది కూడా పరిశీలించలేదు.

సుబ్బారెడ్డి పీఏ అప్పన్నతో ఫోన్ కాల్స్

తన దగ్గర 2018లో చిన్న అప్పన్న(ఏ-24) పని మానేశాడని టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి చెప్పడం పచ్చి అబద్ధమని సిట్ తేల్చింది. నెయ్యి సరఫరాదారులు ఎవరు తనతో మాట్లాడినా.. 'మీరు చైర్మన్ పీఏ చిన్నఅప్పన్నతో మాట్లాడుకోండి' అని సుబ్రమణ్యం సూచించేవాడు. చిన్నఅప్పన్న నుంచి ఫోన్ రాగానే నెయ్యి సరఫరాదారులకు సహకారం అందించేవాడు. ఇందుకు ఆధారంగా ఫోన్ కాల్స్ డేటాను సిట్ సేకరించింది. 2022 మే 10న బోలేబాబా ప్లాంట్ తనిఖీ చేయాలన్న టీటీడీ సూచనతో జూన్ 6న తనిఖీ కోసం సుబ్రమణ్యం వెళ్లాడు. బయటి ల్యాబ్‌కు ఆ నెయ్యిని పరీక్షలకు పంపించాలని మెమో జారీ చేశాడు. మైసూరులోని సీఎఫ్‌టీఆర్‌ఐ ల్యాబ్‌కు నమూనాలు పంపారు. అందులో బెటా సిసోస్టెరాల్, ఇతర వెజిటబుల్ ఆయిల్ ఉన్నట్లు రిపోర్టు వచ్చింది. సుబ్రమణ్యం మెయిల్‌కు ఆగస్టు 15న ల్యాబ్ నుంచి రిపోర్టు వచ్చినా ఎవ్వరికీ చెప్పకుండా దాచాడు. బోలేబాబాకు 9,450 కిలోలు, 1,07,625 కిలోల చొప్పున వెంటవెంటనే నెయ్యి సరఫరా ఆర్డర్లు జారీ చేశాడు. ఆ తర్వాత కూడా అక్టోబరు 2022 వరకూ ఆర్డర్లు కొనసాగించాడు. మైసూరు ల్యాబ్ నివేదిక తర్వాత నెయ్యి సరఫరాకు మళ్లీ టెండర్లు పిలిచారు. అందులో ఎఫ్ఎస్ఎస్ఏఆర్ ప్రమాణాలను తప్పనిసరి చేయాలని డెయిరీ నిపుణుడు సురేంద్రనాథ్ సిఫారసు చేశారు. టీటీడీ ఈవో ఆమోదం తీసుకుని టెండర్లు పిలిచారు. ఆల్ఫా డెయిరీ, ప్రీమియర్ డెయిరీలను మినహాయించాలంటూ మరో నోట్ పెట్టి సుబ్రమణ్యం వారికి లబ్ధి చేకూర్చాడు. ఇలా ప్రతిదాంట్లోనూ సుబ్రమణ్యం పాత్ర కీలకమైందని సిట్ వివరించింది.

తొలి అడుగు సుబ్రహ్మణ్యం అరెస్టు: దినకర్

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): 'టీటీడీలో జరిగిన నెయ్యి స్కాం విచారణలో ఇంజినీరింగ్ అధికారి సుబ్రహ్మణ్యం అరెస్టుతో తొలి అడుగు పడింది. మలి అడుగులో కీలక వ్యక్తిపై సాక్ష్యాధారాలతో చర్యలు తీసుకునే అవకాశముంది' అని 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. పరకామణి స్కాంలో కూడా నిజాలు నిగ్గుతేలి అసలు నిందితుల ముసుగు తొలగడం ఖాయమని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఆర్‌డీఏ పరిధిలో టీటీడీ నిర్మించతలపెట్టిన వెంకటేశ్వరస్వామి దేవాలయ వాస్తవ ప్రణాళికకు జగన్ హయాంలో తూట్లు పొడిస్తే... నేటి సీఎం చంద్రబాబు రూ.230 కోట్ల అంచనా వ్యయంతో వాస్తవ ప్రణాళిక ప్రకారం ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసి స్వామి వారి ఆశీస్సులు రాజధాని అమరావతికి అందేలా చేశారని దినకర్ పేర్కొన్నారు.

త్వరలో మరో ఇద్దరు అరెస్టు?

తిరుపతి(నేరవిభాగం) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్తీ నెయ్యి కేసులో సూత్రధారుల పాత్రపై సిట్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటి వరకు 9 మందిని అరెస్టు చేసిన సిట్ త్వరలో మరో ఇద్దరిని అరెస్టు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. కల్తీ నెయ్యి కేసు విచారణ తుదిదశకు చేరుకుంది. డిసెంబరు 15లోగా మరో చార్జిషీటు దాఖలు చేయాల్సి ఉంది. దీంతో రానున్న రోజుల్లో మరికొందరి పేర్లు బయటకు రావచ్చని తెలుస్తోంది. ప్రధానంగా డెయిరీల నిర్వాహకులు, టీటీడీలో ప్రధాన భూమిక పోషించిన అధికారులు, పాలకమండలిలోని కొందరు ముఖ్యులను మరోసారి విచారించనున్నట్టు తెలిసింది. కొందరు పోటు ఉద్యోగులను కూడా విచారణకు పిలిచే అవకాశాలున్నాయి. కొద్ది రోజులుగా సీబీఐ ఉన్నత స్థాయి అధికారి మురళీరాంబా తిరుపతిలోనే మకాం వేసి కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు.

భూమన, వైవీ నార్కో టెస్టుకు సిద్ధమా?: వర్ల

అమరావతి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి ధర్మరాజు వారసులు మాదిరి మాట్లాడుతున్నారు. వారు నిజంగా సుద్దపూసలైతే లై డిటెక్టర్ టెస్టుకు కాదంటే... నార్కో ఎనాలసిస్ టెస్టుకు సిద్ధం కావాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వామి వారి సేవ చేయమని పదవులు ఇస్తే స్వామి వారి సొమ్మునే దోచుకున్న ఘనాపాటీలు వీరిద్దరని రామయ్య ఆరోపించారు. స్వామి వారి సొమ్ము దోచుకున్న వారు ఎవరూ బతికిబట్ట కట్టలేదన్నారు.

మంత్రి చెబితే మాకేంటి!

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తివేసి.. తిరిగి నియమించాలన్న ఫైలును రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి, స్పెషల్ సీఎస్‌లు తిరిస్కరించారు. కానీ... రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా డీఐజీగా ఉన్న అధికారి మాత్రం పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చారు. అది కూడా... హైకోర్టు ఉత్తర్వులకు వక్రభాష్యం చెబుతూ, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి కోరుకున్న చోటే పోస్టింగ్ ఇచ్చారు. పైఅధికారుల ఆశీస్సులు పుష్కలంగా ఉంటే చాలు... మంత్రి, స్పెషల్ సీఎస్, ప్రభుత్వంతో పనేముందన్నట్లుగా తెగించేశారు.

ఆనందరెడ్డి అంటే మజాకా?

తిరుపతి జిల్లా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చాలా ఫేమస్. ఇక్కడి ఆఫీసుపై లెక్కలేనన్ని ఆరోపణలు వస్తూనే ఉంటాయి. ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా ఆనంద రెడ్డి అనే ఓ అధికారి పనిచేస్తున్నారు. నిషేధ భూముల జాబితాలో ఉన్న భూములను ఈయన రిజిస్టర్ చేశారంటూ ఇటీవల ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ చేసిన ప్రభుత్వం... ఆనంద రెడ్డిని ఈనెల 11వ తేదీన సస్పెండ్ చేసింది. ఆ వెంటనే ఆయన హైకోర్టుకు వెళ్లి సస్పెన్షన్‌ను సవాల్ చేసి... ఊరట పొందారు. సస్పెన్షన్ ఉత్తర్వును పక్కనపెడుతూ ఈనెల 20వ తేదీన హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అంతే తప్ప తిరిగి అదే రేణిగుంటలో సబ్ రిజిస్ట్రార్‌గా పోస్టింగ్ ఇవ్వమని ఆదేశించలేదు. ఇలా ఉత్తర్వులు రావడమే ఆలస్యం... అలా అదే రోజున ఆనందరెడ్డి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ల శాఖ హైకోర్టు ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లాలి. ఇది ఆ శాఖ కమిషనర్ (ఐజీ) చేయాల్సిన పని ఇది. కానీ, ఆ పనిచేయలేదు. ఇది ఆనందరెడ్డికి అందించిన లేదా అందివచ్చిన అవకాశం. ఇది అంతటితో ఆగలేదు. ఆనంద రెడ్డిని రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌గా నియమించాలంటూ ఐజీయే స్పెషల్ సీఎస్‌కు ఈనెల 24న ఫైలు పెట్టారు. ఆ ఫైలుపై స్పెషల్ సీఎస్ వాస్తవాలు రాస్తూ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పంపించారు. ఆనంద రెడ్డిపై ఉన్న ఆరోపణల నేపథ్యంలో మంత్రి అనగాని ఈనెల 26న ఫైలును తిరస్కరించారు. ఇదే ఫైనల్! అంటే... ఆయనకు రేణిగుంటలో కాకుండా మరోచోట పోస్టింగ్ ఇవ్వాలి. కానీ... ఇక్కడ అలా జరగలేదు.

'ఇన్‌చార్జి'తో ఇలా...

ఆనందరెడ్డి పోస్టింగ్‌పై ఒక ఫైలు సచివాలయంలో ఫైలు నడుస్తుండగా, మరోవైపు అదే ఆనంద రెడ్డికి రేణిగుంటలోనే పోస్టింగ్ ఇచ్చేలా రిజిస్ట్రేషన్ శాఖలో కథ నడిచింది. ఆ సమయంలో చిత్తూరు డీఐజీ సెలవులో ఉండటంతో... నెల్లూరు డీఐజీకి చిత్తూరు బాధ్యతలనూ 'ఇన్‌చార్జి' హోదాలో అప్పగించారు. ఆనందరెడ్డికి రేణిగుంట పోస్టింగ్ ఇవ్వాలనే ఫైలు ఆయనకే వెళ్లింది. తెరవెనక ఏం జరిగిందో తెలియదు కానీ, ఆనందరెడ్డిని రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌పై నియమిస్తూ చిత్తూరు ఇన్‌చార్జి డీఐజీగా ఉన్న నెల్లూరు డీఐజీ 27వ తేదీన ఆదేశాలు ఇచ్చారు. సరిగ్గా ఒకరోజు ముందు సచివాలయ స్థానంలో మంత్రి జారీ చేసిన ఆదేశాలను ఏమాత్రం లెక్క చేయకుండా... మరుసటి రోజునే పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చేశారు. ఇంకా చెప్పాలంటే, మంత్రి అనుమతి ఎవరికి కావాలన్నట్లుగా తీసిపారేసి ఓ జూనియర్ అధికారి అయిన డీఐజీతో పోస్టింగ్ ఆర్డర్ ఇప్పించారు. అదీ రెగ్యులర్ డీఐజీ లేని సమయంలో మరో జిల్లా అధికారికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించి మరీ ఉత్తర్వులు ఇప్పించారు. ఆనందరెడ్డి కళ్లల్లో ఆనందం రెట్టింపవడానికి రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, స్పెషల్ సీఎస్‌ను తోసిరాజని మరీ నిర్ణయాలు తీసుకున్నారు. రిజిస్ట్రేషన్ ఐజీ, డీఐజీలు అనుకుంటే ఏదైనా జరిగిపోతుందని... మంత్రి, సీనియర్ ఐఏఎస్ అయిన స్పెషల్ సీఎస్‌లతో పనేలేదని ఈ ఉదంతం నిరూపిస్తోంది.

ఇంత తెగింపా?

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డిపై వచ్చిన ఆరోపణలు చిన్నవో, సాధారణమైనవో కావు. నిషేధ జాబితాలో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలు తీవ్రమైనవి కాబట్టే ప్రభుత్వం విచారణ చేసి మరీ సస్పెండ్ చేసింది. అలాంటి అధికారికి పోస్టింగ్ వద్దని ప్రభుత్వం ఫైలును తిరస్కరించినా పట్టుబట్టి మరీ ఉత్తర్వులు ఇప్పించారంటే ఇది దుస్సాహసమే అని సీనియర్ ఐఏఎస్‌లు చెబుతున్నారు. తమకంటే ప్రభుత్వం ఎక్కువ కాదనేలా వ్యవహరించడం బరితెగింపునకు పరాకాష్ఠ అని ఓ సీనియర్ ఐఏఎస్ విస్మయం వ్యక్తం చేశారు.

షాక్‌లో మంత్రి...

తను ఫైలు తిరస్కరించినా ఆనందరెడ్డికి పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు వెలువడటం పట్ల రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ షాక్‌నకు గురయ్యారని తెలిసింది. 'మేం తిరస్కరించిన తర్వాత మళ్లీ నియామక ఉత్తర్వులు ఇచ్చారా? ఇదెలా సాధ్యమయింది?' అంటూ మంత్రి విస్మయానికి గురయినట్లు తెలిసింది. రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్-ఐజీ, ఇన్‌చార్జి చిత్తూరు డీఐజీని పిలిపించి మాట్లాడాలని ఆయన నిర్ణయించారు. ఆనందరెడ్డి పోస్టింగ్ ఉత్తర్వులను రద్దుచేయాలని డీఐజీని ఆదేశించినట్లు కూడా తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.